fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 77 | విజయవాడ, మంగళవారం 20 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

టెట్

43 శాతం అర్హత

- ఫలితాలు విడుదల చేసిన మంత్రి గంటా
- 10 వేల టీచర్ పోస్టుల ఖాళీలు
- ఆర్థిక శాఖకు లేఖ
- అనుమతి రాగానే డిఎస్సీ



టెట్ ఫలితాలు విడుదలను చేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

9



మమతా బెనర్జీతో కేసీఆర్ భేటీ

'ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై దృష్టి'

మమతాతో కేసీఆర్ భేటీ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ఉదయం సమావేశమయ్యారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ప్రక్రియకు ఈ సమావేశాన్ని మంచి ప్రారంభంగా కేసీఆర్ పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో కేసీఆర్ మాట్లాడుతూ ఈ సమావేశంలో మమతతో కొన్ని అంశాల్లో అంగీకారం కుదిరిందని, భవిష్యత్‌లో మరికొన్ని అంశాలపై చర్చిస్తామని తెలిపారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పడవలసిన అవసరం ఉందని తెలిపారు. 'గత 71 ఏళ్ల నుంచి దేశంలో ఏం జరిగింది? ఇదే జరగాలని కోరుకుంటున్నారా..? దేశంలో అద్భుతం జరగాల్సిన అవసరం ఉంది' అని కేసీఆర్ తెలిపారు. 'మా ఎజెండా అభివృద్ధి. అంతేకానీ బిజెపి కానీ, లేదా ఇతర పార్టీ కానీ కాదు' అని కేసీఆర్ అన్నారు. ఈ మీడియా సమావేశంలో మమతా బెనర్జీ కూడా పాల్గొన్నారు. 'రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో కలిసి పనిచేయడానికి పరిస్థితులు కలసిరావాలి. టీఆర్ఎస్ పార్టీతో మంచి అనుబంధం ఉంది. దాన్ని కొనసాగిస్తాం' అని మమతా బెనర్జీ తెలిపారు. పాలనలో 'నాణ్యమైన మార్పులు' తీసుకోవాలని కోరుకుంటూ దేశ రాజకీయాల్లో ప్రవేశిస్తున్నట్లు ఈ నెల 4న కేసీఆర్ ప్రకటన చేశారు. ఆ సందర్భంలోనే మమతకు కేసీఆర్ ఫోన్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సుమారు 2 గంటల పాటు కేసీఆర్, మమత సమావేశమయ్యారు.

పార్లమెంట్‌లో అదే తీరు





పార్లమెంటులో టిడిపి, వైసిపి ఎంపిల ఆందోళన

టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఎంపిల ఆందోళనతో అవిశ్వాసంపై చర్చకు అనుమతించని స్పీకర్

మండిపడ్డ ప్రతిపక్షం

స్పీకర్ లంచ్‌ను బహిష్కరించిన ఏపి ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నరేంద్రమోడీ ప్రభుత్వంపై వైసిపి, టిడిపిలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై సోమవారం నాడు కూడా లోక్‌సభలో చర్చ జరగలేదు. సభ్యుల సంఖ్యను కూడా లెక్కించకుండానే స్పీకర్ సభను వాయిదా వేశారు. సభలో జరుగుతున్న ఆందోళనలను సాకుగా చూపుతూ తీర్మానాలని పరిగణలోకి తీసుకునే విషయాన్ని స్పీకర్ దాటవేశారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే టిఆర్ఎస్, అన్నాడిఎంకె సభ్యులు వోల్‌లోకి దూసుకెళ్లారు. అన్నాడిఎంకె సభ్యులు కావేరి జల వివాదాలను ప్రస్తావించగా, టిఆర్ఎస్ సభ్యులు రిజర్వేషన్ల అంశంలో రాష్ట్రాల హక్కులను లేవనెత్తారు. దీంతో 30 సెకన్లు కూడా కూడా జరగకుండానే సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. తిరిగి 12 గంటలకు సమావేశాలు పున్ణప్రారంభమైనా.. నినాదాల జోరు తగ్గలేదు. స్పీకర్ పలుమార్లు మిగతా 9లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు

క్షేత్ర స్థాయిలోకి హోదా పోరు

22న జాతీయ రహదారుల దిగ్బంధం

జాతీయ స్థాయిలో సమన్వయ కమిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ప్రత్యేక హోదా సాధన సమితి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, దీనిపై ఆందోళనను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి హోదాను సాధించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీన రాష్ట్రంలో అన్ని జాతీయ రహదారులను దిగ్బధించాలని, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో సమన్వయ కమిటీలు, అన్ని విభాగాలతో జెఎసిని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. హోదా కోసం జరిగే పోరులో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులన్నీ ఎత్తేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం జీవో ఇవ్వాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విద్యార్థుల పరీక్షలకు ఇబ్బంది లేకుండా ఆందోళనలు ఉండాలని నిర్ణయించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన సోమవారం ఉదయం విజయవాడ ఐవి ప్యాలెస్‌లో ఏర్పాటైన సమావేశంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వైసిపి, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ, సిపిఐఎంఎల్, ఎంసిపిఐ, న్యూడెమోక్రసీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు. విద్యార్థి, మహిళా, యువజన విభాగాలు, వేదికలు, నాన్ పొలిటికల్ జెఎసి నాయకులు హాజరయ్యారు. ప్రత్యేక కార్యాచరణ ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ఉద్యమం మిగతా 9లో

ఏముంది గర్వకారణం ?

యోగి సర్కార్‌పై యుపి మంత్రి విమర్శలు

8

'బాబు' ప్రభుత్వ అవినీతిపై విచారణ

పవన్ కల్యాణ్ డిమాండ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రబాబు ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఒక ఆంగ్ల టివి ఛానల్‌తో సోమవారం మాట్లాడిన ఆయన ఆ పార్టీకి చెందిన 40 మంది ఎంఎల్‌ఏలు, మరికొందరు నేతలు ఈ అవినీతి విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి గురించి తాను కొత్తగా మాట్లాడడటం లేదని, గతంలోనే ఆయన దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. అయితే, ఆయన సీరియస్‌గా స్పందించలేదని అన్నారు. ఎన్నికల పొత్తు విషయమై ఇప్పుడు ఆలోచించడం లేదని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. ఎన్నికల సమయంలో ఆ విషయమై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కాంట్రాక్టర్‌ను మార్చడం వెనుక ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీతో తనకు కొంత పరిచయం ఉందని. అయినా, తన పరిధి స్వల్పమేనని చెప్పారు. . రాష్ట్రంలో టిడిపి, బిజెపిల మధ్య సంబంధాలు ఎప్పుడూ సరిగా లేవని అన్నారు. రాష్ట్ర ప్రజానీకం బిజెపిపై ఆగ్రహంగా ఉన్నారని, ఆ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని తెలిపారు. తాను ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయగానే తన వెనుక బిజెపి ఉందంటూ టిడిపి నేతలు ఆరోపణలు చేస్తున్నారని, గతంలో తన వెనుక చంద్రబాబు ఉన్నారని జగన్ ఆరోపించారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిశానని, థర్డ్ ఫ్రంట్ గురించి తన అభిప్రాయాన్ని కెసిఆర్‌కు తెలిపానని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనకు మిగతా 9లో



ఐసిడిఎస్ బడ్జెట్, అంగన్‌వాడి వేతనాలు పెంచాలని, బయోమెట్రిక్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు

7

ప్రత్యేక హోదా కోసం మానవహారం, ధర్నాలు



గుంటూరు జిల్లా కొమ్మూరులో జరిగిన మానవహారంలో జగన్

- **వైసిపి ఆందోళనకు వామపక్షాల సంఘీభావం**

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మానవహారాలు, రాస్తారోకోలు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. బిజెపి వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీలు సంఘీభావం తెలిపాయి. అక్కడక్కడ టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విజయనగరం జిల్లాలో పలుచోట్ల వైసిపి ఆధ్వర్యంలో మానవహారాలు, ర్యాలీలు చేపట్టారు. సిపిఎం, సిపిఐ మద్దతు తెలిపాయి. సాలూరులో ఎమ్మెల్యే పీడిక రాజన్న దొర, కురుపాంలో ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, చీపురుపల్లిలో నిరసన తెలిపారు. పూసపాటిరేగ వద్ద జాతీయ రహదారిపై ఆందోళనతో వాహనాలు నిలిచిపోయాయి. విశాఖ జిల్లా పాడేరు, అరకు, డుంబ్రిగుడ, చోడవరం, దేవరాపల్లి తదితర మండలాల్లో వైసిపి నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. ఎస్.రాయవరంలో మానవహారం మిగతా 9లో



పుతిన్ ఘన విజయం

- నాల్గోసారి అధ్యక్షునిగా ఎన్నిక
- రెండో స్థానంలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి

మాస్కో : రష్యా అధ్యక్ష ఎన్నికల్లో వ్లాదిమిర్ పుతిన్ ఘన విజయం సాధించారు. దీంతో మరో ఆరేళ్ళపాటు అంటే 2024 వరకు ఆయన అధికారంలో వుంటారు. ఆదివారం జరిగిన రష్యా అధ్యక్ష ఎన్నికల తుది ఫలితాలను సోమవారం విడుదల చేశారు. 76.6శాతం ఓట్లతో పుతిన్ నాల్గవసారి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఆయన సాధించిన వాటిలో ఇదే అత్యధిక ఓట్ల శాతం. 2000 ఎన్నికల్లో 53శాతం ఓట్లతో గెలుపొందిన పుతిన్‌కు 2004లో 71శాతం, 2012లో 63శాతం ఓట్లు లభించాయి. కాగా ఈ ఎన్నికల్లో మొత్తంగా 99.8శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు ప్రకటించారు. పుతిన్‌తో పాటు మరో ఏడుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో వున్నారు. పుతిన్‌కు 76.6శాతం ఓట్లు రాగా, కమ్యూనిస్టు అభ్యర్థి పావెల్ గ్రదినిన్ 11.8శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. అల్ట్రా నేషనలిస్ట్ అభ్యర్థి వ్లాదిమిర్ జిరినోవ్‌స్కీ కి 5.6శాతం ఓట్లు వచ్చాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా పుతిన్‌ను బహిరంగంగా విమర్శించిన ఏకైక అభ్యర్థి, లిబరల్ టివి స్టార్ క్సెనియా సాబ్‌చక్‌కు కేవలం 1.6శాతం ఓట్లు లభించాయి. కాగా, న్యాయపరమైన కారణాలతో మిగతా 9లో

పది కోట్ల రైతుల సంతకాల సేకరణ

- ఆగస్టు 9న జైల్‌భరో
- ఏప్రిల్ మొదటి వారంలో "త్రిపుర సంఘీభావం"
- సెప్టెంబర్‌లో రైతు, కార్మిక ఆందోళన
- ఎఐకెఎస్ కేంద్ర కమిటీ నిర్ణయాలను వెల్లడించిన హన్నన్ మొల్లా

8

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం ఉలింద కొండలో ఇంటర్ పరీక్షలు సరిగా రాయలేదని తీవ్ర మనస్థాపం చెందిన ఇంటర్ విద్యార్థిని ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నది. ఉలిందకొండ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని లక్ష్మిపురం గ్రామానికి చెందిన లక్ష్మన్న కూతురు దాసరి మౌనిక (18) నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసఫ్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు రాసింది. ఇటీవల జరిగిన ద్వితీయ సంవత్సరం ఇటర్మీడియేట్ పరీక్షలు సరిగా రాయలేదని మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నూతన కార్యాలయం

తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కొత్త కూటమి బహుజన లెఫ్ట్‌ఫ్రంట్(బీఎల్ఎఫ్) రాష్ట్ర నూతన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభసభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు పాల్గొన్నారు.



టిఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది పలకాలి

బిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభ సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఎల్ఎఫ్ తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది కావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో సామాజిక ఉద్యమం నడిచిందని, అందరికి, అన్ని పార్టీలకు బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ఆదర్శం కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో బిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభసభలో రాఘవులు మాట్లాడారు. ఈ సభకు బిఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్య ప్రకాశ్ అధ్యక్షత వహించగా, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిగ్నేశ్ మేవాని, ఎంబీటీ రాష్ట్ర అధ్యక్షులు మజీదుల్లాఖాన్, సిపిఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు. టిడిపి, బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్‌లకు తేడా ఏమీలేదని రాఘవులు చెప్పారు. ఈ పార్టీల విధానాలన్నీ ఒకటేనని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం ఆ పార్టీలు పనిచేయడం లేదని చెప్పారు. ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఫ్రంట్ పాలన రావాలని, అందుకు ఐక్యతతో తడాఖా చూపించాలని సూచించారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడుతూనే ఆర్థికదోపిడీకి వ్యతిరేకంగా కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని బిఎల్ఎఫ్ దేశానికి ఆశాకిరణం కావాలని ప్రముఖ సామాజిక ఉద్యమకారులు, గుజరాత్ రాష్ట్రంలోని వడ్గం నియోజకవర్గ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని అభిప్రాయపడ్డారు.



వేడి మొదలైంది

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

మూడు రోజుల తర్వాత రాష్ట్రం మళ్లీ వేడెక్కింది. ఉక్కపోత, మాడు పగిలే ఎండలు మొదలయ్యాయి. శుక్ర, శనివారాలు రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురవడంతో పాటు ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం చల్లబడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉపరితలంపై తేమ పోయి వేడి వాతావరణం నెలకొంది. కర్నూలు, అనంతపురంలో 38 డిగ్రీలు, తుని 37, తిరుపతి, గన్నవరంలో 36 డిగ్రీలు, విశాఖ, కాకినాడలో 35 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడు నాలుగు రోజులు ఇదే పరిస్థితులు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. తర్వాత మరింతగా ఉష్ణోగ్రతలు పెరుగుతా యని హెచ్చరించింది. ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలోని భూ మధ్య రేఖా ప్రాంతంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆగ్నేయ అరేబియా సముద్రంలోని ఉపరితల ఆవర్తనం నుంచి కేరళ, దక్షిణ కర్నాటక మీదుగా ఉత్తర కర్నాటక వరకు మరో అల్పపీడన ద్రోణి నెలకొన్నట్లు తెలిపింది. మరోవైపు తూర్పు బంగ్లాదేశ్ నుంచి ఉత్తర ఒడిశా వరకు ద్రోణి ఏర్పడినట్లు పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. ప్రపంచ ఎనర్జీ ట్రాన్సిషన్ (డబ్ల్యూఈఎఫ్) జాబితాలో భారత్ ర్యాంక్?
2. ప్రపంచంలో ఖరీదైన నగరాల్లో తొలి, చివరిస్థానాల్లో నిలిచిన నగరాలు?
3. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి ఇటీవల వైదొలిగిన దేశం?
4. భారత్-ఫ్రెంచ్ సంయుక్త నౌకా విన్యాసాలు 'వరుణ 2018' ఎక్కడ ప్రారంభమయ్యాయి?
5. ఇండియన్ వేల్స్ టెన్నిస్ టోర్నీ 2018 విజేత?

సమాధానాలు 7లో

అనంతలో కొరియన్ ఆటోమొబైల్ క్లస్టర్

కియా అనుబంధ సంస్థ హ్యుండై మొబిస్‌తో ఎపి ఒప్పందం



కొరియన్ శాస్త్రవేత్తలతో సిఎం చంద్రబాబు నాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లాలో కొరియాకు చెందిన 16 ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఎపి ప్రభుత్వం కియా అనుబంధ సంస్థలైన హ్యుండై మొబిస్‌తో సోమవారం ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి, సంస్థ ప్రతినిధులు సంతకం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ దక్షిణ కొరియా ఎపిని రెండో నివాసంగా భావించాలని, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. రూ.24,600 కోట్లతో పెట్టుబడులు పెడుతున్నారని, అనంతపురం నుంచి చిత్తూరు మీదుగా నెల్లూరు వరకూ ఆటో కారిడార్ తయార వుతుందని అన్నారు. ఈ క్లస్టర్‌కు అనంతపురం జిల్లా ఎర్రమంచి దగ్గర 534 ఎకరాలు, గుడిపల్లిలో 71 ఎకరాలు, అమ్మవారిపల్లి దగ్గర 131 ఎకరాలు కేటాయించామన్నారు. ఈ క్లస్టర్ భారత్‌లోనే అతిపెద్ద ఎఫ్‌డిఐగా అభివర్ణించారు. అనంత జిల్లాకు, తద్వారా రాష్ట్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు బాట వేస్తున్నాయన్నారు. ఎపిలో ఆటోమొబైల్ రంగ అభివృద్ధి వాతావరణ ఏర్పాడుతుందని, ఎంఎస్ఎంఇ యూనిట్లు పెరుగుతాయని, ఎపికి బ్రాండ్ ఇమేజ్ వస్తుందని తెలిపారు. మూడేళ్ల క్రితమే దేశంలో అత్యుత్తమైన ఆటోమొబైల్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. అనంతపురం బెంగళూరు విమానాశ్రయానికి దగ్గరగా ఉందని, త్వరలో ఓర్వకల్లులో విమానాశ్రయం రానుందని, ఇప్పటికే తిరుపతి, పుట్టపర్తిలో విమానాశ్రయాలున్నాయని తెలిపారు. కియాతో సహ ఇసుజు మోటార్స్ అనుబంధ సంస్థలు, హీరో మోటార్స్, అశోక్ లేలాండ్, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ కంపెనీలు తమ ఉత్పాదక యూనిట్లను ఏర్పాటు చేయనున్నాయని, ఇప్పటికే శ్రీసిటీలో సుజుకి వాహన ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటు చేసిందని వివరించారు. ఒప్పందాలు కుదుర్చుకున్న వాటిలో హ్యుండై డైమోస్, హ్యుండై స్టీల్, హ్యుండై గ్లోవిస్, సంగ్‌వూ, సేహన్, సియోయాన్ ఎవహ, ఎన్‌విహెచ్, హ్యుండై మెటీరియల్స్, ఫోరేసియా, ఎస్ఎల్, వూయంగ్, హసీయంగ్, ఇంజి, డిఎస్‌సి కంపెనీలు ఉన్నట్లు తెలిపారు. సిఎంతో పాటు సిఎం ముఖ్యకార్యదర్శి జి సాయిప్రసాద్ ఉన్నారు.

ఉపాధి హామీ పనులకు కార్యాచరణ రూపొందించండి

తొలి దశగా 20 కోట్ల పని దినాలు
నీరు ప్రగతి టెలి కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి హామీ పనులకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నీరు- ప్రగతిపై సిఎం సోమవారం జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వచ్చే ఏడాది రూ.9 వేల కోట్లు నరేగా నిధులను వినియోగించగల సామర్థ్యాన్ని యంత్రాంగం పెంచుకోవాలని సూచించారు. తొలిదశగా 20 కోట్ల పనిదినాలకు రూ.7,620 కోట్ల వ్యయానికి ఆమోదం లభించిదని వెల్లడించారు. వ్యవసాయానుబంధ రంగాల పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారు లను ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏప్రిల్ రెండో తేదీలోగా కేంద్రానికి ఈ సమాచారం పంపితేనే రాష్ట్రానికి అదనంగా నిధులు వచ్చే అవకాశం ఉందని సిఎం తెలిపారు. జల సంరక్షణ కింద చెరువులను పటిష్టం చేశామని, ఇక నదులు, వాగులు, వంకల పటిష్టతపై దృష్టి పెట్టాలని సూచించారు. కట్టలు పటిష్ట పరచడం, నదుల సుందరీకరణ, పూడికతీత పనులను నరేగా కింద చేపట్టాలని మార్గ నిర్దేశం చేశారు. రైతు బజార్లలో తగినన్ని షెడ్లు నిర్మించి వ్యవసాయోత్పత్తులన్నీ నీడలో అమ్ముకునే సదుపాయం కల్పించాలని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల తరువాత తాను అన్ని జిల్లాల్లో పర్యటించబోతున్నట్లు సిఎం చెప్పారు. పనులను తాను తనిఖీ చేస్తానని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని హెచ్చరించారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో 80 శాతం సంతృప్తి రావాలన్నారు. జల సంరక్షణ చర్యల వల్ల ఈ ఏడాది రూ.600 కోట్ల విలువైన విద్యుత్తును పొదుపు చేయగలిగామని తెలిపారు. తీవ్ర వర్షా భావం ఉన్నప్పటికీ 97శాతం వ్యవసాయ దిగుబ డులు సాధించామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకు న్న భవనాలకు త్వరలోనే ప్రారంభోత్సవాలు చేపట్టా లని సూచించారు. ఆరు వేల గ్రామ పంచాయతీల్లో న్యూట్రీ గార్డెన్స్ (పోషక ఆహార తోటలు)కు భూములు గుర్తించారని, గ్రామాల్లో వీటిని వీటిని అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా పోషకాహార లోపం, ఎనీమియా వంటి లోపాలు కనిపించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత మూడేళ్లలో మూడు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, ఈ ఏడాది జూన్ కల్లా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. 2016-17 ఎన్టీఆర్ గ్రామీణ పథకం కింద 70 శాతం ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 30 శాతం ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. 2017-18 ఇళ్ల పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. కందుల కొనుగోళ్లకు బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించామని తెలి పారు. ఒక్కో రైతు నుంచీ గరిష్టంగా 25 టన్నుల వరకు కందులు కొంటున్నట్లు తెలిపారు. కర్నూలు లోనే 8428 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశామని, ధర రాలేదని రైతులు ఇబ్బంది పడ కుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు సిఎం పేర్కొన్నారు. గత మూడేళ్లలో శనగలు, పసుపు, ఉల్లి, మిర్చి కొనుగోలు చేశామన్నారు. అధికార యంత్రాంగం రైతులకు అండగా ఉండాలని కోరారు.

కేంద్రం తోడ్పాటు అరకొరే..
స్వావలంబతోనే ముందడుగు

కేంద్రం నుంచి అరకొర తోడ్పాటు ఉన్నప్పటికీ మన కాళ్ల మీద మనం నిలబడే పరిస్థితికి వచ్చామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎపి గురించే దేశ వ్యాప్తంగా చర్చ సాగుతోందని, ఇది సంఘటితంగా పని చేయాల్సిన కీలక తరుణమని తెలిపారు. అధికారులు సమర్థంగా బాధ్యతలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల సంతృప్తి డిసెంబరులో 57 శాతం ఉండగా, ఫిబ్రవరిలో 62 శాతం ఉందని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, జల వనరులు, గ్రామీణభివృద్ధి , పట్టణాభివృద్ధి, హౌసింగ్ అధికారులు శశిభూషన్, రామాంజనేయులు , జవహర్‌రెడ్డి, కాంతిలాల్ దండే, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర పార్టీలతోనూ నోటీసులు ఇప్పించండి..

టిడిపి ఎంపిలకు చంద్రబాబు సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఇతర పార్టీలూ నోటీసులు ఇచ్చే విధంగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడిపి ఎంపిలు, వ్యూహకర్తలకు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సిఎం సోమవారం రాత్రి ఢిల్లీలోని తమ ఎంపిలు, వ్యూహకర్తలతో సిఎం టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పార్లమెంట్‌లోని పరిణామాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ తీర్మానంపై నోటీసులు ఇస్తున్నా పరిగణలోకి తీసుకోరా అని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. 'మనకు ప్రజా ప్రయోజనాలే ముఖ్యం.. హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు.. సభలో హాజరు తగ్గకుండా చూడాలి. మిగిలిన పార్టీల ఎంపిలు కూడా సభకు హాజరయ్యేలా చూడాలి.' అని తమ ఎంపిలను ఆదేశించారు. ఇతర పార్టీల వారితో వారే గలభా సృష్టించి సభను వాయిదా వేయించే అవకాశం ఉందని సిఎం తమ ఎంపిలను హెచ్చరించారు. ఎపికి జరిగిన అన్యాయంపై దేశ వ్యాప్తంగా సానుభూతి ఉందని అనేక పార్టీల నుండి వస్తున్న మద్దతే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఐదు కోట్ల ప్రజలు మన వెంటే ఉన్నారని అదే స్ఫూర్తితో పోరాడాలని ఎంపిలకు సూచించారు. సభలో ఏయే పార్టీలు ఎలా వ్యవహరించాయనేది ఎంపిలు చంద్రబాబుకు వివరించారు. బిజెపి, శివసేన ఎంపిలు వారి స్థానాల్లో కూర్చోగా, అన్నాడిఎంకె, టిఆర్ఎస్ ఎంపిలు వెల్‌లో ఉండగా, మిగిలిన అన్ని పార్టీల సభ్యులు అవిశ్వాసానికి మద్దతుగా లేచి నిలబడ్డారని ఎంపిలు తెలిపారు. టిఎంసి, ఎన్‌సిపి, ఆప్, ఆర్‌జెడి, కమ్యూనిస్టులు, వామపక్షాలు, అన్ని పార్టీల వారూ సంఘీభావం ప్రదర్శించారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్ మాట్లాడుతూ తొందర్లోనే ఎన్నికలని, జగన్ బిజెపితోనే ఎకనామిక్ టైమ్స్ ఎడిటోరియల్‌లో ఆర్టికల్ వచ్చిందని చెప్పారు. కాకినాడ ఎంపి తోట నరసింహం మాట్లాడుతూ టిడిపి సభ్యులు వెల్‌లోకి వెళ్లి అడ్డుకున్నారని వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు దృష్టికి తీసుకు వచ్చారు.

నవంబరు నాటికి ఎల్ఇడి దీపాల లక్ష్యం పూర్తి : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఇడి వీధి దీపాల లక్ష్యాన్ని ఈ ఏడాది నవంబరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 30 లక్షల వీధి దీపాల ఏర్పాటు పూర్తి చేసి రికార్డు సృష్టించాలన్నారు. ఈ అంశంపై ఇంధన, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఈడి వీధి దీపాల వల్ల రాష్ట్రంలో 333 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఫలితంగా రూ.500 కోట్లు వ్యయం తగ్గుతుందని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి, మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, కళా వెంకట్రావు, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్, డిస్కంల సిఎండిలు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై బాబు అసత్యాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్లమెంట్ నిబంధనలు తెలిసిన వారికి చంద్రబాబు విన్యాసాలు అర్థమవుతాయని వైసిపి అధికార ప్రతినిధి పార్థసారథి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అవిశ్వాసం విషయంలో చంద్రబాబు అసత్యాలు చెబుతున్నారన్నారు. వేర్వేరు కారణాలతో ఇతర రాష్ట్రాల్లోని పార్టీలు అవిశ్వాసానికి మద్దతిస్తుంటే చంద్రబాబు తన ఘనతగా చెప్పుకోవడం దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. నాలుగేళ్లుగా కలిసున్న పవన్ అవినీతిని బయటపెట్టారని, ఇందుకు ఏం సమాధానం చెబుతారని సిఎంను ప్రశ్నించారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ కనపర్తి నాగమణి (29) సోమవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కృష్ణలంక పోలీసుల కథనం ప్రకారం... కృష్ణలంక బాలాజీనగర్ మొదటి లైన్లో నాగమణి, ఆమె భర్త నాగరాజు నివాసం ఉంటున్నారు. అవనిగడ్డకు చెందిన నాగమణికి బాలాజీనగర్‌కు చెందిన గల్లా నాగరాజుతో 2011లో వివాహమైంది. నాగరాజు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సొంతంగా లారీలున్నాయి. వీరికి ఆరేళ్లు, మూడేళ్ల వయస్సు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. 2009లో నాగమణికి పోలీసు ఉద్యోగం వచ్చింది. ఏడేళ్ల నుండి ఇప్పటి వరకు క్రైమ్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వన్‌టౌన్ సిసిఎస్ పోలీసుస్టేషన్‌లో ఉగాది పండుగ రోజైన ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు విధులు నిర్వహించిన నాగమణి ఇంటికొచ్చిన కొద్ది సమయానికే ఇంట్లో ఉరివేసుకొని కనిపించారు. భార్యాభర్తల మధ్య ఉన్న మనస్పర్ధలే తమ కుమార్తె మృతికి కారణమని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిపిఎం బస్సు జాతాలను జయప్రదం చేయండి

మహాసభల ప్రచార కమిటీ కన్వీనర్ జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే నెల 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని ఏప్రిల్ 22న జరగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మహాసభల ప్రచార కమిటీ కన్వీనర్ జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మహాసభల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 24 నుండి రెండు ప్రాంతాల నుంచి బస్సు జాతాలు బయలుదేరి వివిధ జిల్లాల్లో పర్యటించనున్నట్టు తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో మార్చి 24న మొదటి జాతాను పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రారంభిస్తారని తెలిపారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూలు, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ జాతాకు రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, స్కైలాబ్‌లు నాయకత్వం వహిస్తారని తెలిపారు. భువనగిరిలో మార్చి 24న రెండో జాతాను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ జాతా భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో పర్యటిస్తోందన్నారు. ఈ జాతాకు రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, సాంబశివ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా జరిగే సభల్లో పార్టీ కేంద్ర నాయకులతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర నాయకులు పాల్గొంటారు. సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూనే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలపై మోపుతున్న విపరీతమైన భారాలు, అవినీతి, అవకాశవాద నిరంకుశ ధోరణులను విస్తృతంగా ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. బస్సు జాతాల్లో పార్టీ కార్యకర్తలు, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జూలకంటి విజ్ఞప్తి చేశారు.

బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులు, రంజిత్ బాషా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ కార్యదర్శిగా బి.రామాంజనేయులు, డైరెక్టర్‌గా రంజిత్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే వీరిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.. సచివాలయంలో కార్యదర్శి రామాంజనేయులు, విజయవాడలోని కమీషనరేట్‌లో డైరెక్టర్ రంజిత్ బాషా బాధ్యతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ శాఖ డిప్యూటీ కమీషనర్‌లు, ఇతర అధికారులు వీరికి అభినందనలు తెలిపారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిలో రైతులకిచ్చే రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడో రేపో ఆదేశాలు రానున్నాయి.

ఆకట్టుకుంటున్న నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజమహేంద్రవరంలో జరుగుతున్న నంది నాటకోత్సవాలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. సమాజంలో ఉన్న వరకట్నం వంటి రుగ్మతలు తొలగిపోవాలని పిలుపునిస్తూ కాకినాడలో సోమవారం ప్రదర్శించిన 'ఎప్పుడో ఒకప్పుడు' సాంఘిక నాటకం రక్తి కట్టించింది. యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నంది నాటకోత్సవాలు-2017 తొమ్మిదిరోజులుగా జరుగుతు న్నాయి. సోమవారం షిర్డిసాయి కల్చరల్ అసోషియేషన్(అనకాపల్లి) సమర్పణలో ఎప్పుడో ఒకప్పుడు సాంఘిక నాటకం పి.ముత్యాలు దర్శకత్వంలో ప్రదర్శించారు. వరకట్నంపై రూపొందించిన ఈ నాటకంలో పైకి అభ్యుదయ భావాలున్న వ్యక్తిగా నటిస్తూ మహిళల పట్ల క్రూర మనస్థత్వం కలిగిన వంశీ పాత్రదారి ముత్యాలు నటన అందరినీ అలరించింది. ధనికుల అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆమెపై కపట ప్రేమ ఒలకపోసే ఘట్టాలు, చివరకు ఆమె ద్వారా ఎటువంటి ఆస్తీ రాదని తెలిసిన తర్వాత ఆమెను ఒదిలించుకునేందుకు వంశీ చేసిన ప్రయత్నాలు ఆకట్టుకున్నాయి.

అవమానం భారంతో విద్యార్థిని ఆత్మహత్య?

మృతిపై నిగ్గు తేల్చాలని విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - గూడూరు

సెల్‌ఫోన్ అపహరణ నేరాన్ని తనపై మోపినందుకుగాను అవమాన భారంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లా గూడూరు ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న శ్రీకాళహస్తి మండలం వేలవేడు గ్రామానికి చెందిన మాధవి(18) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. చిత్తూరు జిల్లా కాళహస్తి మండల పరిధిలోని మాదమాల గ్రామానికి చెందిన ఆకుపల్లి బలరామయ్య కుమార్తె మాధవి మొదటి సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ చదువుతుంది. ఆమె ఉంటున్న హాస్టల్ గదిలో నాలుగు రోజుల క్రితం ఓ విద్యార్థినికి చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఆ సెల్‌ఫోన్‌ను మాధవి తీసినట్లు సాటి విద్యార్థులు వార్డెన్‌కు ఫిర్యాదు చేశారు. వార్డెన్ ఆ విషయంలో ఆమెను మందలించారు. ఈ విషయంపై ఆమె తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించి విచారించినట్లు సమాచారం. దాంతో మానసిక ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున బాత్‌రూమ్‌లో తన చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసిన వెంటనే చిల్లకూరు సిఐ అక్కేశ్వరరావు, చిల్లకూరు ఎస్ఐ శ్రీనివాసరావు, మనుబోలు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డిలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి విద్యార్థినీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. విద్యార్థిని మృతిపై న్యాయం జరగాలంటూ ఎబివిపి, టిఎస్ ఎస్ఎఫ్ నాయకులు మాధవి కుటుంబసభ్యులతో కలిసి సాయంకాలం 4 గంటల సమయంలో కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని విద్యార్థి సంఘాలకు హామీ ఇచ్చారు.



చున్నీతో ఉరివేసుకుని మృతి చెందిన మాధవి

కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాల రద్దుపై నిర్ణయం వద్దు

హైకోర్టు మధ్యంతర ఆదేశాలు
కోమటిరెడ్డి, సంపత్‌లకు ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాల రద్దు నిర్ణయంలో ఆరు వారాల పాటు ఏవిధమైన చర్యలు తీసుకోరాదని ఉమ్మడి హైకోర్టు సోమవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. తెలంగాణ న్యాయ, శాసనవ్యవహారాల శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం చర్యలు తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి బి.శివశంకరరావు ఆదేశించారు. శాసనసభ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నర్సింహన్ ప్రసంగ సమయంలో హెడ్‌ఫోన్‌ను విసిరినప్పుడు శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్‌కు తగిలి గాయమైందని, వారిద్దరి శాసన సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని కోమటిరెడ్డి, సంపత్‌లు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన కేసులో వారికి తాత్కాలిక ఊరట లభించింది. హెడ్‌ఫోన్ విరిసినప్పుడు గాయపడ్డామనే స్వామి గౌడ్ ఆరోపణలో వాస్తవం లేదని, గవర్నర్‌తో కలిసి ఉండగా స్వామి గౌడ్ మాట్లాడారని, గవర్నర్‌కు వీడ్కోలు కూడా చెప్పారని, ఆరోపణలన్నీ కుట్రపూరి తంగా చేసినవేనని వారిద్దరి ఆరోపణ. ఈ ఘటన జరిగిన12 తేదీ నాటి అసెంబ్లీ సమావేశాల వీడియో పుటేజీని సీల్డ్ కవర్‌లో ఈనెల 22 నాటిలోగా తమముందుంచాలని అసెంబ్లీ సెక్రటరీని న్యాయమూర్తి ఆదేశించారు. ప్రతివాదులందరూ తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాలు దాఖలు చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సెక్రటరీ, శాసన, న్యాయ వ్యవహారాల శాఖ సెక్రటరీ, కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీలు కౌంటర్లు వేయాలని ఆదేశించారు. వాదప్రతివాదనలతో సాయంత్రం 4 గంటలకు తిరిగి కేసు విచారణ ప్రారంభమైంది. పది రోజుల పాటు ఎన్నికల నోటిఫికేషన్‌పై ఏవిధమైన నిర్ణయాలు తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. చట్ట సభ సభ్యుల అనర్హతపై ఎప్పుడు ఏవిధమైన చర్యలు తీసుకోవాలో సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘం-భజ రంగ్ బహదూర్‌సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ప్రతిని ఇసిలాయర్ న్యాయమూర్తికి అందజేశారు. దాంతో ఆరు వారాలపాటు గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఏచర్య లూ తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణ 27కి వాయిదా పడింది.

త్వరలో 354 ఎసిబి పోస్టులు భర్తీ : ఠాకూర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అవినీతి నిరోధక శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 354 ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నామని ఆ శాఖ డిప్యూటీ జనరల్ ఆర్.పి.ఠాకూర్ తెలిపారు. రాష్ట్రంలో ఎసిబిని మరింత పటిష్టపరుస్తామన్నారు. శ్రీకాకుళంలోని బలగమెట్టు వద్ద రూ1.05 కోట్లతో నిర్మించిన ఎసిబి జిల్లా కార్యాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాకొక డిఎస్‌పి, ఇద్దరు సిఐలతో పాటు మొత్తం ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారని, ఆ సంఖ్యను 17కు పెంచనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎసిబి కార్యాలయాలకు సొంత భవనాలను సమకూర్చుతున్నామన్నారు.



శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలంలో సోమవారం వంశధార రిజర్వాయర్ గట్టు పనులను అడ్డుకున్న 11 గ్రామాల గిరిజనులు

వంశధార గట్టు పనులు అడ్డగింత

రహదారులు పూర్తయిన తర్వాతే పనుల కొనసాగింపు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)

వంశధార రిజర్వాయర్ గట్టు నిర్మాణం పూర్తయితే తమ గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండదని, ప్రత్యామ్నాయ రహదారి సౌకర్యం కల్పించాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం గార్లపాడు పంచాయతీ పరిధిలోని 11 గ్రామాల గిరిజనులు వంశధార రిజర్వాయర్ గట్టు పనులను సోమవారం అడ్డుకున్నారు. గార్లపాడు సమీపంలో చేపడుతున్న రిజర్వాయర్ పనుల వద్దకు ఆయా గ్రామాల నుంచి ర్యాలీగా చేరుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ పనులు చేపట్టేందుకు వీల్లేదంటూ పనులను అడ్డగించారు. రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభం నుంచి గిరిజనులకు ప్రభుత్వం అన్యాయం చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఐటిడిఎ పిఒ వచ్చి సమాధానం చెప్పే వరకూ పనులు సాగనీయబోమని గిరిజనులు తేల్చి చెప్పారు. తహశీల్దార్ కాళీప్రసాద్ సమాచారం మేరకు ఆర్‌డిఒ గున్నయ్య అక్కడికి చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. రహదారి నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. రహదారులు పూర్తయ్యే వరకూ పనులను చేపట్టరాదని గిరిజనులు డిమాండ్ చేశారు. అప్పటివరకూ గట్టు పనులు నిలిపేయాలని కాంట్రాక్టర్‌ను ఆర్‌డిఒ ఆదేశించడంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

దళారుల దోపిడీ..!

ప్రతి ఏడాది రూ.450 కోట్లు హాంఫట్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఒకప్పుడు ఆంధ్రాకు అన్నపూర్ణగా పేరున్న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రైతులకు అన్యా యం జరుగుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతేడాది చేతులు దులుపు కుంటుంది. గతేడాది 162 కోనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. చివరి వరకు కనీసం 50 శాతం ధాన్యం కొనుగోలు చేయలేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం మిల్లర్లు, దళారులకు వరంగా మారుతోంది. గతేడాది సిఎంఆర్ బియ్యం పేరుతో సుమారు రూ.450 కోట్లు హాంఫట్ చేసిన విషయం తెలిసింది. ప్రతేడాది గిట్టుబాటు ధర లభించని కారణంగా జిల్లా రైతులు సుమారు రూ.400 కోట్ల మేర నష్టపోతున్నారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమతుంది. ఈ ఏడాది ముందే రైతులు కళ్లుతెరిచారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. జిల్లాలోని రైతులు ప్రతేడాది సాగు నీటి కోసం పోరాటాలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర కోసం మరో పోరాటం చేస్తున్నారు. జిల్లాలో ప్రతి రెండేళ్లకోసారి ఇవే పరిస్థితులు నెల కొంటున్నాయి. ఈ ఏడాది జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 7.5 లక్షల ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. ఫలితంగా సుమారు 30 నుంచి 35 లక్షల పుట్ల దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తుంది.

ప్రతేడాది రైతు సంఘాల ఆందోళన ఫలితంగానే ప్రభుత్వం సివిల్ సప్లయ్, ఎఫ్‌సిఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తుంది. అవి కేవలం మొక్కుబడిగానే సాగుతున్నాయి. ఎన్.శ్రీధర్ కలెక్టర్‌గా ఉన్న సమయంలోనే రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి కేవలం ఉత్సవ విగ్రహాలుగానే కొనుగోలు కేంద్రాలుంటున్నాయనే విమర్శలున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకొని మిల్లర్లు, దళారులు నిలువునా ముంచేస్తున్నారు. తేమ, మచ్చ పేరుతో దోపిడీకి దిగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.



కల్లాల్లో ధాన్యం బస్తాలు

రైతుకు 'మద్దతు' కరువు?

ప్రభుత్వం రైతుకు మద్దతు కల్పించడానికే ఇస్తున్న ప్రకటనలు కేవలం కాగితాల్లోనే ఉంటుంది. ఏడాది క్వింటాల్ ధాన్యం పండించేందుకు రూ. 1,484 ఖర్చుగా లెక్క గట్టి 'ఏ' గ్రేడ్ రకానికి రూ.1,590గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. స్వామినాధన్ కమిషన్ సిఫారస్సు ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఖర్చు రూ.1,484 దానికి 50 శాతం అదనంగా అంటే రూ.740లు కలుపుకుంటే క్వింటాల్ రూ.2,224 మద్దతు ధర ఇవ్వాల్సి ఉంది. పుట్టి 'ఏ' గ్రేడ్ రూ.18,850 ఉండాలి. ప్రభుత్వం దీనిని అమలు చేయడానికి సిద్ధంగా లేదు. ప్రస్తుతం 'ఏ' గ్రేడ్ రూ.13,515, 'బి' గ్రేడ్ 13,175లు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులోనే మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తున్నారు. తేమ పేరుతో 60కిలోలు ఎక్కువ తీసుకుంటున్నారు.

గోతాము బరువు అంతా కలిసి మిల్లర్లు పుట్టికి రూ. 1500 తక్కు వకు కొనుగోలు చేస్తున్నారు. ప్రసుత్తం జిల్లా వ్యాప్తంగా 'ఏ' గ్రేడ్ రూ.12 వేలకు, 'బి' గ్రేడ్ రూ, 11,675లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాలు లేకపోవడంతో రైతులు ఈ ధరలకే అమ్ము కోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీనిని ఆసరా చేసుకొని దళారులు, మిల్లర్లు, రెచ్చిపోతున్నారు. రైతుల వద్ద నుంచి అతితక్కువ ధరలకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పంట కోత దశకు చేరుకున్నది. ఈ క్రమంలో ప్రభుత్వం చొరవ తీసుకోకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ప్రస్తుతం పుట్టికి రూ. 1500 రైతులు నష్టపోతున్నారు. ఇదే జరిగితే సుమా రుగా 30 లక్షల పుట్లకు కనీసంగా చూస్తే సుమారు రూ.450 కోట్ల వరకు నష్టపో తారు. ప్రతేడాది రైతులు దళారుల చేతిలో ధరల రూపంలో నష్టపోతూనే ఉన్నారు. గతేడాది సిఎంఆర్ ధాన్యం విషయంలో అధికారులు జిల్లాలో రూ.450 కోట్లు తినేశారు.

ప్రగతి రథచక్రాలకు అడ్డంకులు

- ఆర్‌టిసిలో తగ్గుతున్న సిబ్బంది
- సింగిల్ క్రూ డ్యూటీలతో సర్దుబాటు
- అవస్థల్లో సిబ్బంది, ప్రయాణికులు, విద్యార్థులు



ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

'బస్సు చక్రం ప్రగతికి చిహ్నం' అంటారు. అలాంటి ఆర్‌టిసి చక్రాలకు అడ్డంకులు వచ్చి పడ్డాయి. బస్సులను నడిపే సిబ్బంది రోజురోజుకూ తగ్గిపోతున్నారు. ఫలితంగా పల్లెదారులకు బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. సిబ్బంది తగ్గిపోవడంతో ఉన్న సిబ్బంది సెలవులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా కండక్టర్ల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆర్‌టిసి ఎన్ఇసి (నార్త్, ఈస్టుకోస్టు) రీజియన్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మొత్తం తొమ్మిది డిపోలున్నాయి. వీటిలో 595 ఆర్‌టిసి బస్సులు, 281 అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఈ రెండు జిల్లాల్లో 4,200 మంది సిబ్బందిలో 1,375 మంది డ్రైవర్లు, 1,525 మంది కండక్టర్లుగా పని చేస్తున్నారు. మిగిలిన వారిలో మెకానిక్‌లు, ఇతర విధులు నిర్వర్తిస్తున్న వారు ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఆర్‌టిసిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రతి డిపోలోనూ సిబ్బంది కొరత వెంటాడుతోంది. విజయనగరం జిల్లాలోని నాలుగు డిపోల్లో 253 ఆర్‌టిసి బస్సులు, 139 అద్దె బస్సులు తిరుగుతున్నాయి. వీటిలో 712 మంది కండక్టర్లు పని చేస్తున్నారు. వారిలో 152 మంది మహిళా కండక్టర్లు ఉన్నారు. 571 మంది డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా డిపోకు ఇద్దరు నుంచి ముగ్గురు ఆర్‌టిసి ఉద్యోగులు, సిబ్బంది రిటైరుఅవుతున్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించక పోవడంతో సిబ్బంది కొరత ఏర్పడి బస్సులు తిరిగే ట్రిప్పులు తగ్గిపోతున్నాయి. సిబ్బంది కొరతను సర్దుబాటు చేసేందుకు ఉన్నతాధి కారులు సింగిల్ క్రూ (ఒటి) డ్యూటీలతో బస్సులను నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సింగిల్ డ్రైవర్లతో బస్సులు నడపలేరు కాబట్టి, ఆ ప్రాంతాలకు బస్సులు తగ్గిపోతున్నాయి. ఫలితంగా గ్రామీణులకు ఆర్టీసీ సేవలు సక్రమంగా అందడం లేదు. వాస్తవానికి ఏటా 12 శాతం సిబ్బంది అవసరం పెరుగుతుంది. దానికను గుణంగా సిబ్బంది నియాయకం చేపట్టాలి. కొంత కాలంగా నియమాకాలు చేయడంలేదు. ఉన్నవారితోనే సర్దుబాటు పేరుతో సెలవులు ఇవ్వకుండా పనిచేయించు కుంటున్నారు.

నిలిచిపోయిన రూట్లు

సిబ్బంది కొరతతో కొన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సులను నిలిపివేశారు. గుర్ల మండలం గరికివలస, గంట్యాడ పెంటశ్రీరాంపురం, మరువాడ, బుడతనాపల్లి, పూసపాటిరేగ మండలం కోనాడ, గజపతినగరం గడషాం రూట్లలో బస్సులను తిప్పడం మానేశాయి. జామి- ఎస్‌కోట రూట్‌లో ట్రిప్పులను తగ్గించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు బస్సులకు అడ్డంగా అనేకసార్లు ధర్నాలు చేశారు. భోగాపురం మండలంలోని గ్రామాలకూ బస్సులు తిరగడం లేదు. బొబ్బిలి, పార్వతీపురం మండల్లా లోని ఏజెన్సీ ప్రాంతాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించడం లేదు. గ్రామాలకు బస్సులు కావాలని కోర్టులను సైతం ఆశ్రయించాల్సి పరిస్థితి నెలకొంది. బస్సుల కోసం ప్రయాణికులు జిల్లాలో ఎక్కడికక్కడే ఆందోళనకు దిగిన సందర్భాలున్నాయి.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ఆర్‌టిసిలో డ్రైవర్లు, కండక్టర్ల పోస్టుల నియామకాలు చేపట్టి, బస్సుల సంఖ్య పెంచాలి. సిబ్బంది కొరతతో, సెలవులు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పోస్టులు పెరిగితేనే అన్ని రూట్లకూ బస్సులు తిప్పడం సాధ్యపడు తుంది. ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయాలి.

వి.రాములు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజియన్ కార్యదర్శి, విజయనగరం

భూములు లాక్కోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

- సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట అఖిల పక్ష రైతు సంఘాల ధర్నాలో వక్తలు
- అభ్యంతరాలపై కమిషనరుకు వినతిపత్రం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలో రైతుల భూములు లాక్కోవడంపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని అఖిలపక్ష రైతు సంఘాల నేతలు విమర్శించారు. అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉండాలేగానీ, నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఉపయోగపడే విధంగా ఉండకూడదన్నారు. అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు నోటిఫికేషన్‌ను, రోడ్డు నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ రాజధాని ప్రాంత రైతులు, అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు పి.నరశింహారావు మాట్లాడుతూ రాజధాని అభివృద్ధి కోసం సేకరించిన 33 వేల ఎకరాల భూములు అభివృద్ధి లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. రాజధానిలో పెరిగే ట్రాఫిక్ అవసరాలకు సంబంధించిన ఇన్నర్‌రింగ్ రోడ్డు ప్రస్తుతం అవసరం లేదన్నారు. అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు నిర్మాణం, లేఅవుట్ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 17న విడుదల చేశారని తెలిపారు. 75 మీటర్ల వెడల్పుతో 96 కిలోమీటర్ల దూరం మేర రోడ్డు వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. పూలింగ్‌లో తీసుకున్న భూమి మూడేళ్లుగా పంటలు లేక బీడు భూములుగా మారగా, తాజాగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు తీసుకునే ప్రయత్నం అభ్యంతరకరమని చెప్పారు. ఎపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, వైసిపి రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నాన్ పొలిటికల్ జెఎసి నాయకులు అప్పికట్ల శ్రీహరినాయుడు మాట్లాడుతూ ఇన్నర్‌రింగ్‌రోడ్డు ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంత రైతులవద్ద నుండి మరోసారి వేలాది ఎకరాల భూములు లాక్కొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంపై రైతుల నుండి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. రాజధాని ప్రాంత సిపిఎం కన్వీనర్ సిహెచ్. బాబూరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ పేరుతో ప్రభుత్వం రైతుల నుండి భూముల్ని లాక్కొనేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించకుండా, రైతుల భూములు తీసుకుని, వాటిని అమ్మి వచ్చే డబ్బుతో రోడ్లు వేయాలని చూస్తోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.గంగాధర్‌రావు, కృష్ణా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎం.హరిబాబు, సిపిఎం మహిళా నాయకులు ఎస్.కోటేశ్వరరమ్మ, కృష్ణా జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎం.యలమందరావు, రైతు నాయకులు రాంభూపాల్‌రెడ్డి, కృష్ణా జిల్లా రైతు సంఘం నాయకులు వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై సమన్వయంతో పనిచేయండి

రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రానున్న వేసవి దృష్ట్యా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు అధికారులను ఆదేశించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సిపిఒ సమావేశ మందిరంలో సోమవారం జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి శిద్దా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుండి 2.5 టిఎంసి నీటిని విడుదల చేయాలని, సిఎం, ఇరిగేషన్‌మంత్రిని కోరతామన్నారు. జిల్లాలో తాగునీటి అవసరాల కోసం విడుదలైన నీటిని చౌర్యం జరగకుండా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కరణం బలరామకృష్ణమూర్తి, పోతుల సునీత, కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు, కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డి.శ్రీబాలవీరాంజనేయ స్వామి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు, కలెక్టర్ వి.వినయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి నుండే బిజెపి పతనం : నక్కా

తమిళనాడు తరహా కుట్రలు ఇక్కడ సాగవు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిజెపి పతనం ఎపి నుండే ప్రారంభమవుతుందని, ప్రాంతీయ పార్టీలపై బిజెపి చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యం కావని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొనారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిప్పికొడతారని చెప్పారు. తమిళనాడులో శశికళను జైలుకు పంపిన విధానం అందరికీ తెలిసిందేనని, పార్లమెంటులో అవిశ్వాసం చర్చకు రాకుండా బిజెపి అడ్డుపడుతోందని విమర్శించారు. ఎన్నికలప్పుడు రాష్ట్ర విభజనను తల్లిని చంపి బిడ్డను వదిలి వేశారని కాంగ్రెస్‌పై విమర్శలు చేసిన మోడీ ఇప్పుడు 4 ఏళ్ల చిన్నారినీ చంపాలనే ఉద్దేశంతో ఉన్నట్లు కన్పిస్తోందని దుయ్యబట్టారు.

ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డికి మాతృవియోగం

పలువురు ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డికి మాతృవియోగం కలిగింది. శ్రీనివాసులురెడ్డి తల్లి యండపల్లి రెడ్డెమ్మ (88) గుండె పోటుతో సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతిచెందారు. 20 రోజుల నుంచి ఆమె గుండె సంబంధిత జబ్బుతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో గుండెపోటుతో మరణించింది. శ్రీనివాసులురెడ్డి వామపక్ష ఉద్యమం వైపు రావడం పట్ల ఆయన తల్లి రెడ్డెమ్మ పాత్ర కీలకమని ఆమె కుటుంబీకులు చెబుతున్నారు. ఆమెకు 11 మంది సంతానం కాగా వారిలో శ్రీనివాసులురెడ్డి రెండోవారు. పీలేరుకు సమీపంలోని యండపల్లివారి పల్లెలో వారి



స్వగృహం వద్ద సోమవారం సాయంత్రం అంత్యక్రియల్ని పూర్తి చేశారు. ఆమె భౌతికకాయాన్ని ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చింతలరామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్-2 చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి, సిపిఎం తిరుపతి, చిత్తూరు జిల్లాకార్యదర్శులు అంగేరిపుల్లయ్య, చల్లావెంకటయ్య, జిల్లా నేతలు కందారపుమరళి, కుమార్‌రెడ్డి, యుటిఎఫ్ నాయకులు సోమచంద్రారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, జివిరమణ, స్థానిక ఎంపిపి, జెడ్‌పిటిసిలు, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించి శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు.

అర్హులందరినీ రెగ్యులర్ చేయాలి : ఎపి హంస

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య శాఖలో అన్ని క్యాడర్లలోని ప్రస్తుత ఖాళీ పోస్టులలో అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఏపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపి హంస) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యోగీశ్వరరెడ్డి, అరవపాల్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతన పెంపు కోసం ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో 27పై అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలవుతున్న పిఆర్‌సి ప్రకారం కాకుండా కన్సాలిడేటెడ్ పే మాత్రమే ఇస్తామని పేర్కొనడం అన్యాయమని తెలిపారు. పదిహేనేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ఈ జీవోతో మోసం చేసినట్లేనని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ జెఎసి నాయకులు స్పందించి ప్రభుత్వ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్ళాలని కోరారు.

జీవో 27ను సవరించాలి

యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యఆరోగ్య శాఖలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 27ను సవరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, పలివెల శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షులు వై. నేతాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీలు నియమించిన ఉద్యోగులు, వివిధ స్కీంలలో పనిచేస్తున్న వారికి ఇప్పటివరకు 8, 9వ పిఆర్‌సి ప్రకారం బేసిక్ పే, డిఎ, హెచ్‌ఆర్‌ఎ చెల్లిస్తోందన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ ప్రకారం అవన్నీ రద్దు చేసిందని తెలిపారు. పదో పిఆర్‌సి అమలు చేయకపోగా అలవెన్సులు తొలగించడం, సీనియర్లకు తక్కువ వేతనాలు, జూనియర్లకు ఎక్కువ వేతనాలు నిర్ణయించడం అన్యాయమని పేర్కొన్నారు. జిఒలో పేర్కొన్నట్లు ప్రస్తుతం పెంచిన వేతనాలు 2016 ఏప్రిల్ నుంచి కాకుండా 2018 ఏప్రిల్ నుంచి చెల్లిస్తే వారికి రావాల్సిన అరియర్స్, వేతన బకాయిలు నష్టపోతారని తెలిపారు. అరియర్స్ చెల్లించడంతోపాటు పదో పిఆర్‌సి ప్రకారం బేసిక్, డిఎ, హెచ్‌ఆర్‌ఎ ఈ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ : నారాయణ

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. గుంటూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ శ్రీకేష్ బాలాజి రావ్ లత్కర్‌తో కలిసి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల కో-ఆర్డినేటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ భవిష్యత్‌లో మున్సిపల్ స్కూల్లో సీట్లు ఫుల్ అని, నో వెయికెన్సీ అని బోర్డులు పెట్టేలా అభివృద్ధి చేస్తామన్నారు. 2018 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాష్ట్రంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో నమోదు పెంచాలని ఆదేశించారు. కో-ఆర్డినేటర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రతి పాఠశాలలో అదనపు తరగతి గదులు, అధునాతన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రాథమిక పాఠశాల చదువు పూర్తయ్యేలోపు ప్రతి విద్యార్థి ఇంగ్లీష్‌లో మాట్లాడేలా తీర్చిదిద్దాలన్నారు.

ఎంఎల్‌సి సోము వీర్రాజు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - నెల్లూరు

గాండ్ల కులస్తులు నీచ కులానికి చెందిన వారని ఎంఎల్‌సి సోము వీర్రాజు శాసన మండలిలో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గ్రోసు గోపాలయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోము వీర్రాజు తక్షణం తన వ్యాఖ్యలను ఉపసంహరించకొని క్షమాపణ చెప్పాలని కోరారు. వెనుకబడిన కులాలకు చెందిన తమను ఎంఎల్‌సి పదవిలో ఉన్న వీర్రాజు అవమానించి మాట్లాడటాన్ని ముక్త కంఠంతో ఖండించాలన్నారు.

సంపాదకీయం

పశ్చాత్తాపం లేని ప్లీనరీ

దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్న వేళ ఢిల్లీలో మూడు రోజులపాటు జరిగి కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు దేశానికే కాదు ఆ పార్టీకి కూడా దిశానిర్దేశం చేయడంలో విఫలమైనాయి. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌కు అధ్యక్షుడయ్యాక ఇది తొలి ప్లీనరీ సమావేశం కావడంవల్లా, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు, అంతకుముందే ఈ సంవత్సరంలో కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్లీనరీ వేదికపై సోనియా, రాహుల్ సహా పలువురు సీనియర్ నాయకుల ప్రసంగాల్లో, ఆమోదించిన తీర్మానాల్లో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ తీరాలు దాటాలన్న అభిలాష ప్రముఖంగా ప్రస్ఫుటించింది. వివిధ వర్గాల ప్రజలకు పలు హామీలిస్తూ పార్టీ ఎన్నికల ప్రణాళికను ముందస్తుగా ప్లీనరీలో వెల్లడించారు. ఎన్నికల పొత్తులపై సంకేతాలిచ్చారు. బిజెపి ఏలుబడిలో తిష్టవేసిన పలు వైఫల్యాలను, నిరంకుశ, దురహంకార పోడలను, ప్రజలను విచ్ఛిన్నం చేసే ఆర్ఎస్ఎస్- హిందుత్వ శక్తుల జాతి విచ్ఛిన్నర చర్యలను కాంగ్రెస్ ఖండించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా జిఎస్‌టి, పెద్దనోట్ల వంటి విధానాలతో ప్రజలకు బిజెపి మరింత అన్యాయం చేసిందని ఎత్తి చూపింది. అధికార మదంతో బిజెపి సర్కారు వ్యవస్థలపై దాడి చేస్తోందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని కాంగ్రెస్ ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్‌డిఎ ప్రభుత్వంలో చోటు చేసుకున్న అవినీతి, స్కాంలపై నిప్పులు చెరిగింది. దేశంలో యువత ఉద్యోగాలు కోసం అలమటిస్తున్నారని, రైతులు గిట్టుబాటు ధరల కోసం నిరీక్షిస్తున్నారని ఆందోళన ప్రకటించింది. మోడీ పాలనతో విసుగెత్తిన దేశం ఇప్పుడు ఆ పాలన నుంచి విముక్తమయ్యే మార్గం కోసం ఎదురు చూస్తోందని కాంగ్రెస్ బాగానే చెప్పింది.

కానీ యావత్ కాంగ్రెస్ ప్లీనరీలో ఎక్కడా తన నాయకత్వంలోని పదేళ్ల యుపిఎ పాలనలో అనుసరించిన సరళీకరణ, నయా-ఉదారవాద ఆర్థిక విధానాలపై కించిత్తు ఆత్మవిమర్శకానీ, పిసరంతైనా పశ్చాత్తాపంకానీ కానరాలేదు. పైగా తాము అమలు చేసిన ఆ ప్రజా కంటక, వినాశకర విధానాలను ఇంకా 'మంచి'గా అమలు చేయాలని కోరుతోంది. మన దేశంలో సరళీకరణ విధానాలకు ఆద్యుడు మన్మోహన్‌సింగ్. పివి హయాంలో ఆర్థిక మంత్రిగా సరళీకరణ విధానాలను తీసుకొచ్చారు. వాటి వలన ప్రజలకు జరిగిన దుష్ఫరిణామాలపై ప్రతిపక్ష హోదాలో గొంతు చించుకున్న బిజెపి, వాజ్‌పేయి ప్రభుత్వంలో ఆ విధానాలనే అమలు చేసింది. వాజ్‌పేయి విధానాలపై నానాయాగీ చేసిన కాంగ్రెస్ తాను అధికారంలోకి వచ్చి పదేళ్లపాటు వాటినే పరుగులు పెట్టించింది. కాంగ్రెస్ విధానాలను తూలనాడిన మోడీ, తాను గద్దెనెక్కగానే కాంగ్రెస్ కంటే దూకుడుగా అవే విధానాలను పదును పెడుతున్నారు. రెండున్నర దశాబ్దాల రాజకీయాలను పరిశీలిస్తే కాంగ్రెస్, బిజెపి రెండూ పాలక వర్గాల తరఫున ప్రజలను కాల్చుకుతినే విధానాలను అమలు పరిచాయని, వాటితో తెగతెంపులు చేసుకోడానికి అవి ఎంతమాత్రం సిద్ధపడట్లేదన్న తత్వం బోధ పడుతుంది. అధికార మార్పిడి తప్ప ఈ రెండింటి వలనా ప్రజలకు ఒనగూరేదేమీ లేదన్నదన్నది స్పష్టం. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా తాము పని చేయనందున ఓడిపోయామంటున్న రాహుల్‌కు, సరళీకరణ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్న నిజాన్ని ఎందుకు స్వీకరించలేకపోతున్నారు? ఎవరి ప్రాపకం కోసం ఆ విధానాలను వదల్లేకపోతున్నారు?

దేశంలో మతతత్వానికి కొమ్ములు రావడానికి కాంగ్రెస్ విధానాలే కారణం. కాంగ్రెస్ అనుసరించిన సరళీకరణ విధానాలతో ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని ఉపయోగించుకుని బిజెపి గతంలో వాజ్‌పేయి హయాంలోనూ ఇప్పుడు మోడీ హయాంలోనూ అధికారంలోని వచ్చింది. పదేళ్ల యుపిఎ ప్రభుత్వం అనుసరించిన సరళీకరణ, ఆశ్రిత పెట్టుబడిదారీ, అవినీతి కరణ విధానాలు ప్రజలు ప్రజలను కాల్చుకు తిన్నాయి. ప్రజల్లోని ఈ అసంతృప్తిని నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి బాగా ఉపయోగించుకుని అధికార పగ్గాలు చేపట్టింది. అయితే ప్రస్తుతం పెనం మీదనుండి నుంచి పొయ్యిలో పడ్డట్లు తయారైంది జనం పరిస్థితి. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన తమ పార్టీకి దాని విధానాలే కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశాయన్న సత్యాన్ని కాంగ్రెస్ అంగీకరించడానికి సిద్ధపడట్లేదు. తాజా ప్లీనరీలో బిజెపిపై రాజకీయ విమర్శలు తప్ప అది అమలు చేస్తున్న విధానాలను కాంగ్రెస్ అస్సలు పట్టించుకోలేదు. తాము అధికారంలోకొస్తే రైతులకు రుణ మాఫీ, ఆహారశుద్ధి సముదాయాలు యువతకు ఉద్యోగాలంటూ గతంలో బిజెపి మల్లే కాంగ్రెస్ హామీలిచ్చింది. ఎన్నికల్లో ఇవిఎంల స్థానంలో బ్యాలెట్ల పునరుద్ధరణ, లోక్‌పాల్ నియామకం, ఏక ఎన్నికలపై వ్యతిరేకత, న్యాయవ్యవస్థకు సంస్కరణలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వంటి తీర్మానాలు మంచివే. కాగా మోడీది క్రూర పాలన అంటున్న రాహుల్, ఆ విధానాలను మార్చుకోకుండా పైపై విమర్శలు, ఆరోపణల ఆధారంగా ఈ దేశానికి కాంగ్రెసే ప్రత్యామ్నాయం అనడం ఎంతమాత్రం ప్రజలకు ఆమోదయోగ్యం కాదు. ఈ పరమ సత్యాన్ని కాంగ్రెస్ గ్రహించాలి. ప్రజలూ అర్థం చేసుకోవాలి.

ఇదీ విషయం



సైకిల్ చక్రాలపై
ముప్పేట దాడీ...
అంతా అవినీతేనంటూ
విపక్షాల రూఢీ!

నిన్నటిదాకా మిత్రులు
నేడంతా శత్రువులే...
రాజకీయ ఎత్తులలో
ఏమైనా జరుగునులే!

- కొల్లూరు వెంకట్

విగ్రహాలు కూలిస్తే సిద్ధాంతం చెరిగిపోతుందా?

విశ్లేషణ



యంవి ఆంజనేయులు

త్రిపురలో ఎన్నికల అనంతరం ఆర్.ఎస్.ఎస్, బి.జె.పి కార్యకర్తలు విధ్వంసం సృష్టించారు. సి.పి.యం కార్యాలయాలను తగులబెట్టారు. లెనిన్ విగ్రహాన్ని కూల్చారు. అంతటితో ఆగలేదు. ఉత్తరప్రదేశ్‌లో, జార్ఖండ్‌లో అంబేద్కర్ విగ్రహాలను కూల్చారు. తమిళనాడులో ద్రవిడ ఉద్యమ నిర్మాత పెరియార్ విగ్రహాన్ని కూల్చారు. ఇంకా ఎన్ని విగ్రహాలను కూల్చుతారో వారికే తెలియాలి.

సి.పి.యం కార్యాలయాలను, సిపియం పార్టీ ఆఫీసులను తగుల బెట్టారంటే పార్టీల మధ్య శతృత్వంతో అలా చేశారని అనుకోవచ్చు. కాని లెనిన్, అంబేద్కర్, పెరియార్ విగ్రహాలను కూల్చారంటే వీరికున్నది పార్టీల శతృత్వం కాదు. సైద్ధాంతిక శతృత్వం అనేది స్పష్టం. వారి సిద్ధాంతమే వారి సంస్కృతిని రూపొందిస్తుంది.

కూల్చివేతల విషయంలో ఆర్.ఎస్.ఎస్. సంస్కృతి ఏమిటో మనం చూస్తూనే ఉన్నాము. మన కాలంలోనే బాబ్రీ మసీదును కూల్చారు. అనేక చోట్ల అంబేద్కర్ విగ్రహాలను కూల్చారు. ఇప్పుడు లెనిన్, పెరియార్ విగ్రహాలను కూల్చారు. వారి మాటలను బట్టి చూస్తే రేపో మాపో గాంధీ విగ్రహాలను, తాజ్‌మహల్‌ను కూల్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. ఈ విషయంలో లెనిన్ ఏం చేశాడో తెలుసుకుంటే కమ్యూనిస్టుల సంస్కృతి ఎంత ఉన్నతమైనదో అర్థమౌతుంది. 1917లో 11 రోజుల భీకర పోరాటం అనంతరం నిరంకుశుడైన జారు చక్రవర్తిని కూలదోసి రష్యాలో కమ్యూనిస్టులు అధికారాన్ని కైవసం చేసుకున్నారు. లెనిన్ నాయకత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. జారు చక్రవర్తుల కాలంలో అందమైన కట్టడాలను నిర్మించారు. జారు చక్రవర్తి మీద ఉన్న ద్వేషంతో దోపిడీ పాలనకు చిహ్నాలుగా ఉన్న ఆ కట్టడాలను కూల్చి జారు చక్రవర్తుల ఆనవాళ్లు కూడా లేకుండా చేయాలని కొంతమంది ప్రయత్నించినప్పుడు లెనిన్ వారిని అడ్డుకున్నాడు. ఆ కట్టడాలను ఎవరి కాలంలో నిర్మించినా అవి శ్రామికుల కళాకౌశలానికి నిదర్శనమని, శ్రామిక వర్గ పార్టీగా ఉన్న తాము వాటిని కూల్చటమంటే శ్రామికులను అవమానించటమేనన్నారు. శ్రామికులు నిర్మించిన ఆ కట్టడాలు ఇప్పటి వరకు వ్యక్తిగత సంపదగా ఉన్నాయని, వాటిని ఇప్పుడు సామాజిక సంపదగా మార్చాలన్నారు. ఆ కట్టడాలను వినియోగించుకోవాలే తప్ప కూల్చరాదని స్పష్టం చేశాడు. నిజానికి ఆ కట్టడాలు ప్రజలను దోచిన సంపదతో నిర్మించినవి. దోపిడీకి, పీడనకు ప్రతీకలుగా ఉన్నాయి. అయినా వాటిని నిర్మించింది మాత్రం శ్రమజీవులే. లెనిన్ వాటిని శ్రమకు ప్రతీకగా చూశాడు. వాటిని సైద్ధాంతికంగా తమకు శత్రువైన జారు చక్రవర్తి కట్టించినప్పటికీ, ఆ కట్టడాల పట్ల లెనిన్ కనబరచిన విజ్ఞత కమ్యూనిస్టుల విశాల దృక్పథానికి నిదర్శనం.

లెనిన్ మాత్రమే కాదు. కమ్యూనిస్టు లందరిలోనూ ఇది కనిపిస్తుంది. మన దేశంలో తాజ్‌మహల్‌ను షాజహాన్ తన భార్య ముంతాజ్ బేగం పట్ల ఉన్న ప్రేమకు చిహ్నంగా వర్ణిస్తారు. తాజ్‌మహల్ ప్రపంచ వింతలలో ఒకటిగా ప్రపంచం గుర్తించింది. ఆర్.ఎస్.ఎస్.కు ఇస్లాం అంటే గిట్టదు. కట్టించింది ముస్లిం కనుక తాజ్‌మహల్ ప్రపంచ వింతలలో ఒకటిగా ఉండటానికి వీలు లేదు. అందుకే దానిని లేకుండా చేయాలి. ఇది ఆర్.ఎస్.ఎస్ ఆలోచన. దానికోసం అక్కడ తేజోమహల్ అనే హిందూ దేవాలయం ఉండేదని, దాని మీద తాజ్‌మహల్ కట్టారని ఒక బూటకపు ప్రచారాన్ని ప్రారంభించారు. కాని కమ్యూనిస్టు వాదిగా ఉన్న శ్రీశ్రీ 'తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు' అన్నారు. తాజ్ మహల్‌ను కట్టించింది దోపిడీవర్గపు ప్రతినిధి షాజహాన్. ఆర్.ఎస్.ఎస్.వారు షాజహాన్‌ను దోపిడీ వర్గపు ప్రతినిధిగా కాకుండా ముస్లిం రాజుగా మాత్రమే చూస్తారు. ఇస్లాం అంటే తమకు గిట్టదు కాబట్టి, ఇస్లాం మతస్తులు నిర్మించిన దేదైనా, అది ఎంత గొప్పదైనా కూల్చివేయవలసిందే అంటారు. కాని షాజహాన్ దోపిడీ వర్గపు ప్రతినిధి అయినా, ఇస్లాం మతస్తుడైనా తాజ్ మహల్‌ను కట్టింది మాత్రం శ్రామికులే. కట్టించిన వాడు ఏవర్గ ప్రతినిధి అయినా, ఏ మతస్తుడైనా శ్రామికుల కళా కౌశలం వలననే అది ప్రపంచ ప్రఖ్యాతి పొందిన కట్టడంగా తయారైంది. అదే విషయాన్ని శ్రీశ్రీ తన కవిత ద్వారా చెప్పారు. నిజానికి కమ్యూనిస్టులందరి దృక్పథం అదే.

ఇక లెనిన్, అంబేద్కర్, పెరియార్‌లు అంటే ఆర్.ఎస్.ఎస్.వారికి ఎందుకు గిట్టదో చూద్దాం. నిజానికి ఒక విగ్రహం కూలిపోతే మరొక విగ్రహం పెట్టుకోవచ్చు. అదేమంత పెద్ద కష్టమైన విషయం కూడా కాదు. ఆ విషయం వారికీ తెలుసు. కానీ వారు కూలగొట్ట దలుచుకున్నది విగ్రహాలు కాదు. అవి ప్రతిబింబించే సిద్ధాంతాన్ని. ఆర్.ఎస్.ఎస్ ప్రజాస్వామ్య పాలనను కాక రాచరికపు పాలనను కోరుతున్నది. శ్రమజీవులు (కార్మికులు, ఉద్యోగులు) ఆ పాలకుల ఆదేశాలకు లోబడి బానిసలుగా పని చేయాలి. శ్రమ జీవులకు ఎలాంటి హక్కులు ఉండకూడదు. ఇదీ ఆర్.ఎస్.ఎస్. భావజాలం. కాని మార్క్సిజం, లెనినిజం అందుకు భిన్నమైనది. ఈ ప్రపంచం అభివృద్ధికి మానవ శ్రమే మూలమని, కనుక శ్రామికులకు అన్ని హక్కులుండాలని కోరుతున్నది. హక్కులుండటం మాత్రమే కాదు. శ్రామికులే పాలకులుగా ఎదగాలని, శ్రమ ఫలితం శ్రామికుల కుటుంబాలకే దక్కాలని బోధిస్తున్నది. అందు కోసం కృషి చేస్తున్నది.

> లెనిన్, అంబేద్కర్, పెరియార్‌లు తమ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టిననాడు వారి విగ్రహాలు లేవు. వారి సిద్ధాంతాలు, ఆచరణ ప్రజల గుండెలలో నిక్షిప్తమైన తర్వాత మాత్రమే విగ్రహాలు వెలిశాయి. అంతేగాని విగ్రహాల వలన సిద్ధాంతాలు ప్రజలలోకి చేరలేదు. ఆ సిద్ధాంతం అమలు కోసం, వారు చేసిన కృషిని గుర్తించటం కోసం ఏర్పాటు చేసేవే విగ్రహాలు. అందువలన విగ్రహాలు కూలగొడితే సిద్ధాంతాలు పోతాయనుకోవటం ఆర్.ఎస్.ఎస్. తెలివి తక్కువ తనం.



లెనిన్ ఎంతో కొంత దానిని రష్యాలో ఆచరించి చూపించాడు. ఇంకా కొన్ని దేశాలలో ఆవైపుగా అడుగులు వేస్తున్నారు. ఇది ఆర్.ఎస్.ఎస్. భావజాలానికి విరుద్ధం. అందుకే ఆర్.ఎస్.ఎస్.వారికి లెనిన్ అంటే గిట్టదు.

పెరియార్ ద్రవిడ ఉద్యమాన్ని నడిపాడు. ద్రవిడ సమాజం ప్రజాస్వామ్య విలువలు కలిగినది. మంచి పనులను చేసిన స్థానికులను గౌరవించింది. కులాలు, కుల అణచివేతలు లేని సమాజం. మహిళలను ఆచరణలో సరిసమానులుగా చూసింది. స్థానిక భాషలను గౌరవించే సంప్రదాయం గల సమాజం. ఉన్నత విలువలు కలిగిన సమాజం. ఆర్.ఎస్.ఎస్ అందుకు భిన్నమైన భావజాలం కలిగిన ఆర్య తత్వాన్నుండి ఉద్భవించినది. ఆర్యతత్వం రాచరికపు లక్షణాలు కలది. రాచరికపు నిరంకుశత్వాన్నే గొప్పగా కీర్తిస్తూ, స్థానికులను అణచి ఉంచుతూ వచ్చింది. రాచరికపు నిరంకుశత్వం తప్ప ప్రజాస్వామ్య విలువలు ఏమాత్రం లేనిది. నిరంకుశత్వాన్ని స్థిరపరచుకోవటం కోసం కులాలు, కుల అణచివేతలను సృష్టించింది. మహిళలను నీచంగా చూసింది. దాని కోసమే పురాణాలను, కథలను సృష్టించింది. అందుకే ఆర్య తత్వాన్ని పెరియార్ వ్యతిరేకించాడు. ఉన్నత విలువలు కలిగిన ద్రవిడ సమాజం కావాలని కోరాడు. దానిని విపరీతంగా ప్రచారం చేశాడు. అందుకోసం ద్రవిడ పార్టీని స్థాపించాడు. అందుకే పెరియార్ అంటే ఆర్.ఎస్.ఎస్.కు గిట్టదు.

అంబేద్కర్ కూడా పెరియార్ మాదిరిగానే కులతత్వాన్ని వ్యతిరేకించాడు. కేవలం వ్యతిరేకించటం మాత్రమే కాదు. కులతత్వానికి పునాదిగా ఉన్న పురాణాలను ప్రశ్నించాడు. మను ధర్మ శాస్త్రాన్ని తగులబెట్టాడు. సంస్కృతం ఆధిపత్యాన్ని నిరశించాడు. లక్షలాదిమంది దళితులను కుల తత్వానికి వ్యతిరేకంగా కూడగట్టాడు. రాజ్యాంగ రచనలో దళితులకు రిజర్వేషన్లు లాంటి సౌకర్యాలు కల్పించాడు. హిందూ మతంలో కులాలున్నందున, కులం లేని బౌద్ధం లోకి మారాడు. వేలాదిమంది దళితులను బౌద్ధంలోకి మార్చాడు. దళితులకు అండగా నిలిచాడు. ఆయన అందించిన తాత్విక ధోరణి నేడు దళితులకు ఆయుధంగా మారింది. దళితులు పంచములుగానే బతకాలని కోరుకునే ఆర్.ఎస్.ఎస్. కు అంబేద్కర్ అంటే నచ్చక పోవటానికి కారణం ఇదే.

విగ్రహాలను కూలగొట్టడం ఆర్.ఎస్.ఎస్ తెలివి తక్కువతనానికి నిదర్శనం. విగ్రహాలను కూలగొడితే సిద్ధాంతం మాసి పోదు. పోరాటాలు ఆగవు. లెనిన్, అంబేద్కర్, పెరియార్‌లు తమ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టిననాడు వారి విగ్రహాలు లేవు. వారి సిద్ధాంతాలు, ఆచరణ ప్రజల గుండెలలో నిక్షిప్తమైన తర్వాత మాత్రమే విగ్రహాలు వెలిశాయి. అంతేగాని విగ్రహాల వలన సిద్ధాంతాలు ప్రజలలోకి చేరలేదు. ఆ సిద్ధాంతం అమలు కోసం, వారు చేసిన కృషిని గుర్తించటం కోసం ఏర్పాటు చేసేవే విగ్రహాలు. అందువలన విగ్రహాలు కూలగొడితే సిద్ధాంతాలు పోతాయనుకోవటం ఆర్.ఎస్.ఎస్. తెలివి తక్కువ తనం.

చివరగా కమ్యునిస్టు సంస్కృతికి, ఆర్.ఎస్.ఎస్. సంస్కృతికి మధ్య వ్యత్యాసాన్ని గురించి కూడా చెప్పుకోవాలి. చైనా అధినేత, కమ్యూనిస్టు నాయకుడు మావో 'నూరు పుష్పాలను వికసించనీ, వేయి ఆలోచనలను సంఘర్షించనీ' అని ప్రభోదించాడు. ఇది ప్రజాస్వామ్య విధానం. అభివృద్ధికర నినాదం. అదే కమ్యూనిస్టు విధానం. ఆర్.ఎస్.ఎస్.కు ఆ సంస్కృతి లేదు. ఇతర ఆలోచనలు పట్ల అసహనం, కూలగొట్టడం, చంపటం వీరి సంస్కృతి. వీరిని గనుక ప్రజలు అనుమతిస్తే దేశమే నాశనమవుతుంది. భారతదేశం శతాబ్దాల వెనుకకు పోతుంది. దేశం అభివృద్ధి చెందాలంటే, ప్రపంచ స్థాయికి భారత ప్రజలు ఎదగాలంటే ఆర్.ఎస్.ఎస్, బి.జె.పిలను ప్రతిఘటించటం ప్రజాస్వామ్యవాదులందరి కర్తవ్యం.

(రచయిత టాక్స్ పేయర్స్ అసోసియేషన్ సెక్రెటరీ, విజయవాడ)

విశేషాలు

ఆపరేషన్ ఉచితం



ఎన్నికల వేళ తమిళనాట ఉచిత హామీలు గుప్పిస్తుంటారు. టీవీలు, ఫ్రిజ్‌లు, లాప్‌టాప్‌లు, పట్టుచీరలు వంటివి ఉచిత హామీలలో వుంటుంటాయి. తాజాగా వక్షోజాల సర్దుబాటు, పునర్నిర్మాణ సేవలను ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సాధారణంగా ప్రమాదాల బారిన పడిన, క్యాన్సర్ వ్యాధిగ్రస్త మహిళలకు ఈ శస్త్రచికిత్సలు అవసరమౌతాయి. ప్రయివేటు ఆస్పత్రిలో ఈ చికిత్స కోసం రూ.80,000 ఖర్చు అవుతోంది. అత్యంత వ్యయంతో కూడుకున్న ఈ చికిత్స పేదలకు భారమైంది. దీంతో ప్రభుత్వం ఉచిత సేవల జాబితాలో ఈ శస్త్రచికిత్సను చేర్చింది. అయితే ఇతర సంక్షేమ పథకాల కోసం కేటాయించిన నిధులను ఈ బ్రెస్ట్ సర్జరీలకు బదిలీ అయ్యే అవకాశం లేకపోలేదు. దేశంలో ప్రభుత్వ పథకాలేవీ సమర్థవంతంగా అమలు జరగడం లేదు. ప్రస్తుతం ప్రకటించిన ఈ ఉచిత హామీని ఎంతవరకు నిర్వర్తిస్తారో వేచి చూడాలి.

అబ్బాయిల కోసం...



దేశంలో లింగ నిష్పత్తిలో తీవ్ర అసమానతలు నెలకొన్నాయి. 1991 గణాంకాల ప్రకారం నాలుగు కోట్ల మంది అమ్మాయిలు గల్లంతయ్యారు. 2011 నాటికి ఆ సంఖ్య ఆరు కోట్ల 30 లక్షలకు చేరిందని ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ పేర్కొన్నారు. మరో పక్క అబ్బాయిల కోసం అమ్మాయిలను కనే తల్లిదండ్రులు ఎక్కువయ్యారు. జనాభా గణాంకాలను పరిశీలిస్తే.. మొదటి సారి ఆడపిల్ల పుడితే రెండవ బిడ్డ కూడా ఆడపిల్ల పుడుతున్న సందర్భాలున్నాయి. అలాగే బాలిక-బాలుడు, బాలుడు-బాలిక, బాలుడు-బాలుడు కూడా పుడుతున్నారు. అయితే పిల్లలు కావాలనుకునే దంపతులు అబ్బాయి కోసం అమ్మాయిలను కూడా కంటున్నారు. వీరంతా 'అవసరం లేని అమ్మాయిలు' గా పరిగణిస్తున్నారు. ఒకవేళ అబ్బాయి పుడితే ఇక పిల్లలను కనడం ఆపేస్తున్నారు. ఇప్పటికే దేశంలో రెండు కోట్లా పది లక్షల మంది 'అవసరం లేని అమ్మాయిలు' ఉన్నారని జనాభా లెక్కల నివేదికలో తేలింది. ఇదంతా నాణేనికి ఒకవైపు. మరో వైపు ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ముఖ్యంగా గుజరాత్, పంజాబ్, రాజస్థాన్‌లలో ప్రతి 2,100 మంది అబ్బాయిలకు వెయ్యి మంది అమ్మాయిలే వుంటున్నారు. అలాగే హర్యానాలో ఈ నిష్పత్తి 2,300:1000గా వుంది. అక్షరాస్యత, అభివృద్ధి, ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా వున్న కుటుంబాలలోనే ఈ రకమైన వ్యత్యాసం కనబడటం విచారించదగ్గ అంశం. మరో వైపు వెనుకబడిన ఈశాన్య రాష్ట్రాల్లో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి ఎంతో మెరుగ్గా వుందని నివేదిక పేర్కొంది. ఇది దేశాన్ని పట్టిపీడిస్తున్న అతి పెద్ద నాగరిక సమస్య.

వాతావరణం వేడెక్కుతోంది



అంటార్కిటికాలోని కింగ్ జార్జ్ ఐలాండ్‌లో వాతావరణం వేడెక్కుతోంది. కొల్లిన్స్ హిమానీనదంపై ఏర్పడిన మందపాటి మంచు పొర బీటలు వారుతోంది. ప్రస్తుతం అక్కడ మంచు కరిగిపోయి రాతి పొర కనిపిస్తోందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఈ రాతి పొర పదేళ్ల కిందట కనపడేది కాదు. ఇక్కడ ఉన్న 20 శీతల దేశాలలో చిలీ ఒకటి. ఈ ప్రాంతంలోని పరిశోధనశాలలో డజన్లకొద్దీ పరిశీలకులు స్థానిక జంతుజాలం, వృక్షజాలంపై నిరంతరం వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఈ భూమ్మీద అత్యంత వేగంగా వేడెక్కే ప్రాంతాల జాబితాలో అంటార్కిటికా ఖండం కూడా చేరింది. నాసా గణాంకాల ప్రకారం 2002 నుండి 2016 మధ్యలో అంటార్కిటికాలో ఏడాదికి 125 గిగాటన్నుల మంచు కరిగింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 0.35 మిల్లీమీటర్ల ఎత్తున సముద్ర మట్టాలు పెరిగాయి. వీటివల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉంది. అకాల వర్షాలు, వరదలు లాంటివి ఏర్పడితే పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. జీవజాతుల మనుగడ కష్టతరమౌతుంది. కొన్ని అరుదైన జీవ జాతులు అంతరించే ప్రమాదం లేకపోలేదు.

జన వాక్యం

ఆందోళనాంధ్ర పంచాంగం

ఆదాయం : అప్పు దొరికిన మేరకు
వ్యయం : అంతకు మించి, ఎన్నో రెట్లు
రాజపూజ్యం : బొత్తిగా పూజ్యం
అవమానం : కొలమానం లేదు, అనుమానం లేదు. ఘనం.


ఈ విళంబి నామ సంవత్సరాన్ని కంగాళీ నామ సంవత్సరం అనుకున్నా పరవాలేదు ఆంధ్రప్రదేశ్ వరకూ. అంతా ఆందోళనకరం. 'చంద్ర' నిప్పులు, వేడి 'పవనాలు', వై'కో'పాలు, ఒకటేమిటి ఒకటే వేడి! దీంతో రాష్ట్రం రాజకీయ నిప్పుల కొలిమిలా మారుతుంది. అప్పుల కొలిమికి ఇదో అదనం. ఎన్నికల వేళా విశేషం. ఈ నేపథ్యంలో నిగ్రహం కోల్పోయిన ప్రజలు ఆగ్రహమే అన్నిటికీ మందు అని భావిస్తారు. మన్మథ నామ సంవత్సరం మొదలైన హోదా అంశం విళంబిలోనూ హామీగానే ఉండి శాశ్వతత్వం పొందుతుంది. విభజన చట్టంలోని 19 హామీలపై 19 కమిటీలను వేసి అన్నీ అనవసరమే అని కేంద్రం తేల్చిపారేస్తుంది. మేమైతే అవన్నీ తీర్చి పారేస్తామని మరో జాతీయ కోయిల కొత్త పాట అందుకొంటుంది. వెరసి రాజకీయాలు తప్ప వేరే రోజువారీ అవసరాల చర్చలుండవు. రోజూ పెరిగే పెట్రోల్ ధరలకు అలవాటు పడ్డ జనం, కొత్త కొత్త హామీలకు అలవాటు పడాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే ఈ సంవత్సరం రాష్ట్రానికి ఇతమిద్ధంగా జరిగే మేలేమీ ఉండకపోవచ్చు. ఎన్నికల సీజన్ దాటే వరకూ ప్రజలంతా అన్ని బాధల్ని మరిపించే 'గజనీ' మంత్రం జపిస్తే చాలు. అఫ్‌కోర్స్! ఆ తరువాత నేతలు అదే మంత్రం జపిస్తారనుకోండి.

-డా॥ డివిజి శంకరరావు, పార్వతీపురం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

మతోన్మాద రాజకీయాలకు ఎదురుదెబ్బ

దర్పణం





డా॥ కత్తి పద్మారావు


ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బిజెపి, జెడియుకు తగిలిన ఎదురుదెబ్బకు సంకేతాలు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికలలో బిజెపి ఓడిపోయి ఎస్‌పి గెలవడం రాజకీయ చారిత్రక సంఘటన. ఎందుకంటే మతోన్మాద పార్టీ అయిన బిజెపి ఒక మత ఛాందసుణ్ని యుపి ముఖ్యమంత్రిగా నియమించింది. ఆర్ఎస్ఎస్ ఎజెండాను పక్కాగా అమలు జరపడానికి చేసిన వ్యూహమే ఇది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్ మఠానికి ప్రధాన పూజారి. అంతకు ముందు కూడా ఇక్కడ ప్రధాన పూజారులే గెలుస్తూ వచ్చారు. కానీ ఈ రోజు తమ స్వస్థలంలోనే బిజెపి ఓటమికి గురవ్వడం యోగి ఆదిత్యనాథ్ దుష్ట పాలనకు సంకేతం. ఆయన ముఖ్యంగా దళితులకు, ముస్లింలకు, బహుజనులకు, స్త్రీలకు, యువకులకు వ్యతిరేకంగా పని చేశారు. పోలీసు జులుం ప్రదర్శిస్తూ సామాజిక, సాంస్కృతిక రంగాల్ని ఉక్కు పాదంతో అణగదొక్కారు. శాస్త్రీయ జ్ఞానానికి, వైజ్ఞానిక విప్లవానికి, సాంకేతిక పరిజ్ఞానానికి వ్యతిరేకంగా తన ప్రభుత్వాన్ని నడిపించారు. ఇదంతా నరేంద్రమోడీ భావజాలంతోనే నడిచింది. ఒక్క యుపిలోనే కాదు, దేశ వ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ భావజాలమే నడిపించారు. హిందూ మతం ద్వారా బాల్య వివాహాలు చేస్తూ కులం గోడల్ని బలంగా లేపుతూ మూఢాచారాలను విస్తృతం చేశారు. కొలుపులు, బలులు, యజ్ఞాలు, యాగాలను పునరుద్ధరించారు. అయితే ఆ తరువాత పది రాష్ట్రాల్లో మూడు లోక్‌సభ స్థానాలకూ, 33 అసెంబ్లీ స్థానాలకూ జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపిపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత చూపించారు. ఫలితంగా బిజెపి సగం స్థానాలు పోగొట్టుకుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లలో ఆ పార్టీకి ప్రతికూల ఫలితాలొచ్చాయి. ఈ ఓటమి వెనుక దేశ వ్యాప్తంగా స్త్రీల, దళిత బహుజన మైనార్టీలపై హిందూ మతోన్మాద ప్రభుత్వ అణచివేత వుంది. ప్రధానంగా మోడీ ప్రభుత్వం స్త్రీలపై తీవ్ర దమనకాండను నిర్వహించడమే కాక బడ్జెట్‌లో వారిని పూర్తిగా అణగదొక్కే ప్రయత్నం చేసింది.

ప్రపంచ ఎకనామిక్ ఫోరమ్ అంచనాల ప్రకారం ప్రపంచ స్థాయిలో 2016 లింగ వ్యత్యాస సూచికలో మన దేశం 87వ స్థానంలో ఉంది. మహిళల ఆరోగ్యానికి సంబంధించి 142వ స్థానంలో ఉంది. దేశంలో 27 శాతం మహిళలే కార్మిక శక్తిలో భాగం పంచుకొంటున్నారు. మొత్తం మన దేశ జనాభాలో మహిళలు, శిశువులు కలిసి సుమారు 60 శాతం వరకు ఉంటారు. అయితే మోడీ ప్రభుత్వం మాతా శిశు సంక్షేమానికి క్రమంగా నిధుల కేటాయింపును తగ్గిస్తూ వచ్చింది. ఇదేగాక సంఘపరివార్ సేనలు తమ ఉనికిని ఎక్కడిక్కడ ప్రదర్శిస్తూనే వున్నాయి. ఇటీవల 'పద్మావత్' సినిమాపై చేసిన రభస అంతా ఇంతా కాదు. ఆ వివాదం ముగియక ముందే 'గేమ్ ఆఫ్ అయోధ్య' చిత్రంపై మొదలైన దాడులు భావప్రకటన స్వేచ్ఛను మరింత ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మొన్న విహెచ్‌పి, నిన్న కర్ణిసేన, నేడు ఎబివిపి... పేరేదైతేనేమి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ఏ చిన్న అవకాశాన్నీ వదిలిపెట్టకుండా సమస్త హిందూత్వ పరివారాలన్నీ వీరంగమాడుతున్నాయి. సాయుధంగా ముందుకు వస్తున్నాయి. 'గేమ్ ఆఫ్ అయోధ్య' దర్శకుడు సునీల్ సింగ్‌ను ఉద్దేశించి 'ఆయన నాకు ఎక్కడైనా కనిపిస్తే నేనే చంపేస్తా.. ఎవరైనా ఆయన చేతులు నరికి ఇస్తే లక్ష రూపాయల బహుమానమిస్తాం.' అంటూ ఎబివిపి నాయకుడు అమిత్ గోస్వామి ప్రకటన చేశారు. ఈ సినిమాకు ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎఫ్‌సిఎటి) క్లియరెన్స్ ఇచ్చినా, 'మా అనుమతి లేకుండా సినిమా విడుదల కాదు' అంటూ హిందూత్వ శక్తులు బెదిరిస్తున్నాయి.

యుపి ఉప ఎన్నికల్లో మరో ముఖ్యమైన అంశం బిజెపి వ్యతిరేక పార్టీలు, ఒకప్పటి పాలక ప్రతిపక్షాలు ఒక్కతాటిపైకి వచ్చాయి. మనువాదులు ఎస్‌సి, ఎస్‌టిలను, బిసిలను విడదీసి రాజ్యం పాలించాలని చూస్తే వీరి ఐక్యత రాబోయే ఎన్నికల్లో బిజెపి ఓటమికి పునాదులు వేసింది. బీహార్ ఉప ఎన్నికలో ఓడి ఆర్‌జెడి గెలవడం కూడా ఒక మలుపే. దేశవ్యాప్తంగా దళిత బహుజన వామపక్ష కూటమి విజయం పొందడానికి ఇదే నాంది. బిజెపి కూటములకు ఓట్లు పడవనే సంకేతం ఇందులో వుంది. దేశ వ్యాప్తంగా మార్క్సు వర్గ పోరు, దళిత బహుజనుల కులాధిపత్య వ్యతిరేక పోరు, మైనార్టీల మానవ హక్కుల పోరు ఏకమైతే, నిర్మాణాత్మక రాజకీయాలు చేయగలిగితే ఓటు విలువ ప్రజలకు చెప్ప గలిగితే, ఒక గొప్ప పరిణామానికి తొలి అడుగు పడుతుంది. 2019 ఎన్నికల్లో దళిత బహుజన మైనార్టీలు, సామ్యవాద ఐక్యతే పునరుజ్జీవనానికి నాంది అని ఈ ఎన్నికలు జ్ఞాపకం చేస్తున్నాయి. చరిత్ర పరిణామంలో పోరాట శక్తులదే విజయం.

(రచయిత నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695)

అందం..అంటే?!



అందం... అనే మాట ఇప్పుడు మరోసారి చర్చకు వచ్చింది. అందాన్ని కవులు ప్రకృతితో పోలిస్తే.. ఇటీవలకాలంలో మనువాదులు స్త్రీ బాహ్యసౌందర్యాన్నే అందంగా పదే పదే ప్రస్తావిస్తున్నారు. పురుషాధిక్య సమాజంలో స్త్రీని ఓ విలాస వస్తువుగా చూసే క్రమంలోనే ఇలాంటి మాటలు పేట్రేగిపోతున్నాయి. ఇటీవల దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ జిఎస్‌టి సినిమా విడుదలపై జరిగిన చర్చల సందర్భంగా ఉద్యమకారిణుల పట్ల ఇలానే నోరు పారేసుకుంటే, తాజాగా నిర్భయ తల్లిని చూసి కర్ణాటక మాజీ డిజిపీ ఇలాంటి అనాగరిక వ్యాఖ్యలే చేశారు. అలాగే ఓ మహిళా జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా తమిళనాడు మంత్రి ఒకరు చౌవకబారు వ్యాఖ్య చేయడం వారిలోని కుత్సితమైన భావజాలానికి, వికారానికి నిలువెత్తు నిదర్శనం. అసలు అందం అంటే ఏమిటి? కొందరు చేసే నిస్సిగ్గు ప్రేలాపనల్లో ఆంతర్యం ఏమిటి? ఇదే నేటి 'జీవన' ఫోకస్.

ప్రాచీనకాలం నుంచీ అందం అంటే ఏమిటి? దానికి నిర్దిష్టమైన నిర్వచనం ఉందా? దాన్ని తెలుసుకోవడం ఎట్లా? అందం తప్పనిసరిగా మనసుకు ఆనందాన్నిస్తుందా? ఆహ్లాదాన్ని కలిగిస్తుంది కాబట్టే అందాన్ని మెచ్చుకుంటామా? ఇటువంటి ఎన్నో ప్రశ్నలు మానవ మస్తిష్కాన్ని తొలుస్తూనే ఉన్నాయి. పెద్ద పెద్ద తత్వవేత్తలు కూడా ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికి వేసారిపోయారు. ఎవరు తెలుసుకున్న సత్యం వారు చెప్పారు. కానీ ఏ ఒక్కరి నిర్వచనం మీద ఏకాభిప్రాయం లేదు. కానీ, వర్తమానంలో కొందరి మాటల్లో అందం వారి పైత్యపు అంతరంగాలను బయటపెడుతున్నాయి. సభ్యసమాజాన్ని సిగ్గుపడేలా చేస్తున్నాయి.

అందాన్ని నిర్వచించగలమా?

మన సమాజంలో పొడవాటి జడ, పెద్ద పెద్ద కళ్ళు, చీరకట్టుతో ఎర్రగా, బుర్రగా ఉన్న అమ్మాయిని అందంగా ఉందని భావిస్తారు. అది భారతీయ సమాజంలో పూర్వకాలం నుంచి వస్తున్న అందమైన స్త్రీకి నిర్వచనం. కానీ పాశ్చాత్య దేశాల్లో ఇందుకు విరుద్ధమైన అభిప్రాయం ఉంది. అట్లాగే పురుషుని అందం పట్లా ఇటువంటి విరుద్ధ భావనలే కనిపిస్తాయి. దీన్నిబట్టి ఆయా సమాజాల సంస్కృతులే అందాన్ని తూచే తూకపురాళ్ళనవచ్చేమో. నిజానికి ఒకరు అందంగా ఉన్నారా లేదా అనే విషయాన్ని చాలా సందర్భాల్లో వ్యక్తిగతమైన ఇష్టాఇష్టాలే నిర్ణయిస్తూ ఉంటాయి.

రూపంలో విరుద్ధంగా కనిపించే ప్రేమికులను.. కాస్త చనువున్న వారు ఎవరైనా 'ఏం చూసి ప్రేమించావు?' అని అడిగితే 'నా కళ్ళతో చూస్తే.. తెలుస్తుంది' అనేవారున్నారు. అంటే భౌతికమైన రూపం ఒక్కటే అందాన్ని నిర్ణయించదన్న మాట. రూపంతో పాటు ఓ వ్యక్తి గుణగణాలు... అంటే ప్రవర్తన, మాట తీరు, ఎదుటివారిని స్వీకరించే పద్ధతి, ప్రేమాస్పదమైన పలకరింపు... ఇలా ఎన్నో అంశాలు అందాన్ని నిర్ణయిస్తాయి. అంతేగానీ, కొందరు సోకాల్డ్ పెద్ద మనుషులు అర్థరహితంగా మాట్లాడే నిర్వచనాలు కాదు.

ఇదా.. సృజనంటే?



మొన్నటికి మొన్న జిఎస్‌టి సినిమాపై చర్చ జరిగిన సందర్భంలో వీరంగం వేసిన రామ్‌గోపాల్ వర్మ మహిళా ఉద్యమకారిణులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేశాడు. మరీ ముఖ్యంగా విశాఖ ఐద్వా నేత మణిని చూసి ఆయన 'అబ్బ మీరెంత అందంగా ఉన్నారు. మీరు ముందే తెలిసి ఉంటే.. మీతోనే సినిమా తీసేవాడిని' అంటూ వ్యాఖ్యానించాడు. దేవి వంటి సామాజిక ఉద్యమకారుణులపైనా అభ్యంతరకర వ్యాఖ్యలే చేశాడు. దాంతో అతనిపై కేసులు పెట్టడం జరిగింది. దీనిపై రాష్ట్ర వ్యాపితంగా మహిళా సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలకూ దిగాయి. ప్రస్తుతం రామ్‌గోపాల్‌వర్మపై రెండు రాష్ట్రాల్లోనూ కేసులు నడుస్తున్నాయి

ఇదేం పెద్దరికం

2012లో దేశం మొత్తాన్ని కదిలించిన సంఘటన 'నిర్భయ'. ఆమె తల్లి ఆశాదేవితో కలిసి పలు రంగాల్లో కృషిచేసిన మహిళలను సన్మానించే కార్యక్రమంలో ఈనెల 16వ తేదీన పాల్గొన్న కర్ణాటక రాష్ట్ర మాజీ డిజీపీ హెచ్‌టి సంగ్లియానా నోరుపారేసుకున్నారు. 'నిర్భయ తల్లే ఇంత



అందంగా ఉంటే.. నిర్భయ ఇంకెంత అందంగా ఉండేదో' అంటూ చెత్తగా వ్యాఖ్యానించారు. అంతటితోనే ఆగలేదు. 'రేపిస్టులకు దొరికిపోతే ప్రతిఘటించకుండా లొంగిపోవాలనీ.. తద్వారా ప్రాణాలు నిలుపుకోవచ్చనీ' దిగజారి సలహాలు ఇచ్చాడు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో అతడు "నేను నిర్భయను, ఆమె తల్లిని పొగిడాను" అంటూ సమర్థించుకోవడం మరింత దారుణం. దీన్నిబట్టే ఇలాంటి వారి ఆలోచనా విధానాలు ఏవిధంగా ఉన్నాయో అర్థమవుతోంది. దీనిపై ఆశాదేవి కూడా ప్రతిస్పందిస్తూ "ఇలాంటి వ్యక్తిగత వ్యాఖ్యలకు బదులు.. మా పోరాటం గురించి మాట్లాడి ఉంటే బాగుండేది. కొందరి ఆలోచనా ధోరణిలో ఇప్పటికీ మార్పు రాలేదు" అంటూ విచారం వ్యక్తం చేశారు.

కళ్ళకు.. పచ్చకామెర్లా?!



ఇటీవలనే.. తమిళనాడు ఆరోగ్యమంత్రి సి.విజయభాస్కర్‌ని ఒక మహిళా జర్నలిస్టు అతడిపై వచ్చిన ఆరోపణలపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పకుండా 'మీరు కళ్లద్దాల్లో చాలా అందంగా ఉన్నార'ంటూ వ్యాఖ్యానించాడు. 'నేనెప్పుడూ కళ్లద్దాలు ధరిస్తాను. అన్నాడీఎంకే పార్టీతో జరిగిన సమావేశం వివరాలేంటో చెప్పండి" అని తిరిగి ఆ మహిళా విలేకరి ప్రశ్నించారు. "ఈరోజు మీరు చాలా అందంగా ఉన్నారు. అయినా ఆ పార్టీ ప్రకటన విడుదల చేస్తుంది" అంటూ మళ్లీ అల్పంగా మాట్లాడారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగడంతో 'ఆమె పదే పదే ప్రశ్నించడంతో టాపిక్ మార్చటం కోసం 'మీరు చాలా అందంగా ఉన్నారు' అని వ్యాఖ్యానించాను. నా వ్యాఖ్యలు ఆమెను బాధపెట్టి ఉంటే క్షమాపణ కోరుతున్నా" అంటూ సర్దుకునే ప్రయత్నం చేశాడు.

ఇలాంటి వ్యాఖ్యానాలు స్త్రీలపట్ల సంకుచిత భావాలను ప్రేరేపిస్తాయి.



రేపిస్టులను మరింత రెచ్చగొట్టడమే అవుతుంది. అందం అనేది మనసుకు సంబంధించింది. అందమైన మనసు ఉన్న అందరిలోనూ అందం ఉన్నట్టే. మన ప్రవర్తనా అందుకు దోహదపడుతుంది. ప్రశాంత స్వభావం.. చెరగని చిరునవ్వు.. తోటివారితో కలిసి మెలిసి ఉండటం.. అన్నింటికీమించి కష్టపడేతత్వం... ఇవన్నీ జీవితానికి అందం చందం..!

అందం అనేది మనం ధరించే దుస్తుల్లో లేదు. మనిషిలో దాగిన మానవత్వంలో ఉంది. సౌందర్యం నవ్వే పెదవిలో లేదు. బాధను ఇముడ్చుకునే గుండెల్లో ఉంటుంది. ఎదుటి మనిషి వెన్ను తట్టడంలో ఉంటుంది.

- శాంతిశ్రీ

దృష్టంతా లైంగిక కోణంలోనే



బీభత్సమైన హత్య ద్వారా కూతుర్ని పోగొట్టుకున్న తల్లికి ఓదార్పు కలిగించాల్సిన పోయి వక్రంగా మాట్లాడ్డం తప్పు. అలాంటి వ్యాఖ్యలు ఒక రక్షణాధికారి నోటి వెంట రావడం ఒక విషాదం. ఎంతటి బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారైనా స్త్రీల పట్ల వారికుండే దృష్టికోణం లైంగికమైనదే అని మరోసారి రుజువైంది. అత్యాచార బాధితులు ఆ కాసేపూ కళ్ళు మూసుకుంటే ప్రాణాలు నిలబెట్టుకోవచ్చనడం అనేది.. పరోక్షంగా సపోర్ట్ చేయడం మాత్రమే.

- కె ఎన్ మల్లీశ్వరి, రచయిత్రి

చాలా దుర్మార్గం



పోలీస్ వృత్తిలో ఉంటూ మాజీ డీజీపీ సాంగ్లియానా వ్యవహారశైలి చాలా దుర్మార్గంగా ఉంది. అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి నిర్భయ తల్లిని 'ఆకర్షణీయమైన ఆకృతి'గా వర్ణించడం అమానవీయం. ఇలాంటి మనువాద బానిసలు సమాజంలో పెరిగిపోవడం వల్లే మహిళలపై అత్యాచారాలు, అరాచకాలు ఆగడం లేదు. ఈ తప్పుడు భావజాలాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిందే.

- అరుణ గోగులమండ, రచయిత్రి

కఠినశిక్ష పడాల్సిందే!



స్త్రీ అంటే ఆటవస్తువా.. ఎవడికి వాడే ఏదైనా అనటానికి, చెప్పటానికి. ఇలాంటి వాళ్ళని ఊరికే విడిచి పెడితే మరింత మంది పుట్టుకొస్తారు. ఈరోజు సంగ్లియానా.. రేపు మరో తలమాసిన వాడు నోటికి అడ్డుండదు. వీళ్ళకి కఠినమైన శిక్షలు వెయ్యాలి.

- కె సర్వమంగళ, ఎడిటర్, జాగృతి సమీక్ష, కోల్‌కత

ఆలోచనాతీరు.. ఇంకా మారలేదు



మహిళల విషయంలో జనం మెంటాలిటీ ఏ మాత్రం మారలేదు. అతడు ఇలాంటి కామెంట్స్ చేయడం కంటే కూతురిని కోల్పోయిన నేను పడ్డ బాధను గురించి మాట్లాడి ఉంటే బాగుండేది. సమాజంలో ప్రజల మనస్తత్వం మారలేదని చెప్పడానికి మాజీ డీజీపీ సంగ్లియానా చేసిన ఈ వ్యాఖ్యలే నిదర్శనం.

- ఆశాదేవి, నిర్భయ తల్లి

అలంకరణ సామాను వాడండిలా..

అలంకరణ విషయంలో తెలిసీతెలియక పొరపాట్లు చేస్తుంటాం. అవి మన చర్మ సమస్యలని మరింత పెంచుతాయి. సాధారణంగా మనం చేసే పొరపాట్లు ఏంటో.. వాటినెలా సరిదిద్దుకోవాలో చూద్దాం.



- ఎంతో ఖరీదు పెట్టి కొన్నాం కాబట్టి అయిపోయేవరకూ అలంకరణ వస్తువులు వాడుకోవాలని అనుకోవద్దు. ఎందుకంటే మస్కారా, ఫౌండేషన్, కాటుక వంటి ఉత్పత్తుల జీవితకాలం ఆరునెలలే. కాబట్టి అంతకు మించి వాడకపోవడం మంచిది. ఎంత రాత్రైనా సరే అలంకరణ తొలగించుకోవడం ఓ అలవాటుగా మార్చుకోవాలి. లేదంటే మొటిమలూ, మచ్చలు వస్తాయి.
- కనుబొమల్ని తీర్చిదిద్దుకునే సమయం లేనప్పుడు చాలాసార్లు ప్లక్కర్ లాంటి చిన్న పరికరంతో లాగేసే ప్రయత్నం చేస్తుంటాం. ఒకవేళ మన కనుబొమలు పల్చగా ఉన్నట్లయితే ఆ రోమాలను కొద్దిగా తీసేసినా అవి పల్చగా కనిపిస్తాయి. దాంతో ముఖం పెద్దగా, వయసు పైబడినట్టుగా మారుతుందని మరవకూడదు. కాబట్టి వీటికోసం ప్రత్యేకంగా ఉండే జెల్‌ని రాసుకోవాలి. దాంతో కనుబొమలు కాస్త దట్టంగానే కాదు.. ఓ ఆకృతిలోనూ కనిపిస్తాయి.
- కళ్లు ఎర్రగా మారినప్పుడు కంట్లో ఏదో పడి ఉంటుందని అనుకుంటాం. శుభ్రం చేసుకుని వదిలేస్తాం. కానీ అన్నిసార్లూ దుమ్మూధూళే కారణం కాదు. మనం కళ్ల అలంకరణకు ఉపయోగించే బ్రష్‌లని సరిగా శుభ్రం చేయకపోవడం కూడా ఆ సమస్యల్ని తెచ్చిపెడతాయి. వాటిని వాడిన ప్రతిసారీ కాకపోయినా వారానికి ఒకసారైనా షాంపూతో కడగాలి. లేకపోతే వాటిపై వృద్ధి చెందే క్రిములు కళ్ల దురదా, ఇన్‌ఫెక్షన్లు రావడానికి కారణం అవుతాయి.
- మనం చేతివేళ్లతో కీబోర్డుని ఉపయోగిస్తాం, అంట్లు తోముతాం... మరెన్నో పనులు చేస్తాం. కానీ ఆ చేతుల్నే యథాలాపంగా ముఖంపై పెట్టేస్తాం. వేళ్లపై ఉన్న క్రిములు ముఖంలోకి చేరి చర్మరంధ్రాలను మూసేస్తాయి. దాంతో మొటిమలు వస్తాయి. కాబట్టి ముఖంపై పదేపదే చేతులు పెట్టుకునే అలవాటుని మానుకోవడం మంచిది. అలాగే అలంకరణకు ముందూ చేతుల్ని శుభ్రంగా కడుక్కోవాలి. ★

గుడ్డు పెంకులతో జిడ్డు మాయం



కోడిగుడ్డులోనే కాదు.. కోడిగుడ్డు పై ఉండే పెంకులతోనూ ఎన్నో ఉపయోగాలున్నాయి. ఇంట్లో మొక్కలను పెంచుకునేటప్పుడు ఈ పెంకులను పొడిచేసి మట్టిలో కలిపితే మొక్కల ఎదుగుదలకు మంచి పోషకంగా పనికొస్తుంది. చీమలూ బొద్దింకలూ బాగా తిరిగే చోట గుడ్డు పెంకులను ఉంచితే, వాటి బెడద తగ్గుతుంది. అలాగే, ఇంట్లో పండ్లూ, కూరగాయలూ ఉంచినప్పుడు వాటి చుట్టూ పెంకుల పొడిని చల్లితే పురుగులూ, ఈగలూ దరిచేరవు. వంటగది గట్టుపై జిడ్డుమరకలు తొలగించడానికి పెంకుల పొడి బాగా ఉపయోగపడుతుంది. వెనిగర్‌లో పెంకుల పొడి కలిపి, జిడ్డు మరకలు ఉన్న చోట రాయాలి. ఐదు నిమిషాల తర్వాత కొబ్బరి పీచుతో రుద్దితే జిడ్డు తొలిగిపోతుంది. ★

సులువైన చిట్కా



తలుపులు, గోడలమీద అంటించిన స్టిక్కర్ల మరకలు త్వరగా వదలాలంటే ముందుగా యూకలిప్టస్ ఆయిల్ రాసి తరువాత శుభ్రపరిస్తే సరి.

జీవన సౌరభం

ఎప్పుడైతే మన ఆలోచనలకు ఆచరణలకు మధ్య బంధం ధృడంగా ఉంటుందో, అప్పుడు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఆమె సాహసమే వారికి ఆరోగ్య రక్ష!

ఎవరైనా మొసళ్లు ఎదురుపడితే సాహసం చేస్తారా? అదీ ఎదుటివారి కోసం! ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సునీత ఠాకూర్ ప్రతిరోజూ భయపడకుండా వీటికి ఎదురుగా వెళ్తుంది. ఆమె ఓ గుర్తింపు పొందని సాహసవంతురాలు. తన ప్రాణాన్ని పణంగాపెట్టి ఇతరుల ప్రాణాలను రక్షిస్తుంది. చాలామంది దృష్టిలో ఇదేమీ అద్భుతం కాదు. కానీ, అద్భుతం కంటే తక్కువేమీ కాదు అని గుర్తించాలి. ప్రపంచంలో అతితక్కువ మంది ఇలా ఉంటారు. అలాంటివారు ఎప్పటికీ మన మనసుల్లో నాటుకుపోతుంటారు. ఇంతకీ ఎవరీ సునీతా ఠాకూర్? ఆమె చేస్తోన్న సాహసం వెనుక కథేంటి?

ప్రతిరోజూ సవాలే!

ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సునీత వృత్తిరీత్యా నర్సు. సుమారు ఏడు సంవత్సరాల నుంచి మొసళ్లు సంచరించే నదిని దాటుకుంటూ, దంతేవాడ జిల్లాలోని గర్భిణుల ఆరోగ్య సంరక్షణ చేస్తున్నారు. పనిలో భాగంగా ఎన్నిసార్లు ఆమె మొసళ్లు దాడి నుంచి తప్పించుకున్నారో లెక్కలేదట! అయినప్పటికీ ఆమె ఏమాత్రం భయపడకుండా తన కర్తవ్యాన్ని పూర్తిచేస్తున్నారు. దంతేవాడ జిల్లా



అటవీప్రాంతంలోఆరోగ్య సంరక్షణ కేంద్రాలు సరిగా ఉండవు. 'నేను నా పనిని పూర్తి నిబద్ధతతో చేస్తున్నాను. సొంతంగా తయారు చేసుకున్న పడవనే నేను ఉపయోగిస్తున్నాను. ఆ పడవతోనే ఇంద్రావతి నదిని దాటుతున్నాను. గ్రామస్థుల ఆరోగ్యం కోసం అడవిలోకి కాలినడకనే వెళతాను.' అంటున్నారు సునీత. నదిని దాటిన తర్వాత సుమారు 8 నుంచి 10 కిలోమీటర్లు అడవిలో నడుచుకుంటూ గ్రామస్థుల చెంతకు చేరాలి.



గ్రామస్థుల చెంతకు చేరే క్రమంలో భయంకరమైన జంతువులు ఆమెకు రోజూ ఆహ్వానం పలుకుతుంటాయి. 'ఇదే నా చివరి రోజేమో అని అనుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ, ఎప్పుడూ నేను నా వృత్తిని వదిలేద్దామన్న ఆలోచనను నా దరిదాపులకు కూడా రానివ్వలేదు. ఎందుకంటే, నా ప్రాణం కంటే ఈ గ్రామస్థుల ప్రాణాలే నాకు ముఖ్యం' అంటూ వృత్తిపట్ల ఆమెకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు సునీత. ఈ రోజుల్లో ఎదుటివారి కోసం నిస్వార్థంగా పనిచేసేవారు ఎక్కడ తారసపడినా హేట్సాఫ్ చెప్పాల్సిందే! ★

గులాబి సోయగం!

సువాసనలు వెదజల్లే గులాబీ అంటే ఎవరు మాత్రం ఇష్టపడరు? కనిపించేందుకు మాత్రమే కాదండోయ్, గులాబీలు సౌందర్య సాధనంగా కూడా ఉపయోగపడతాయి. ముఖంపై చర్మం మృదువుగా మారాలంటే, పది గులాబీ రేకలను నీళ్లలో గంటపాటు నానబెట్టి మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. దీనికి రెండు టీ స్పూన్ల గులాబీ నీళ్లు, మూడు టీ స్పూన్ల తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పావు గంట ఫ్రిజ్‌లో ఉంచాక, వేళ్లతో ముఖంపై వలయాకారంగా పది నిమిషాల పాటు రాయాలి. తరువాత గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి. గులాబీ పువ్వులు పొడిబారిన చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌లా కూడా ఉపయోగపడతాయి.



అందుకోసం.. పది గులాబీ రేకలను మెత్తగా చేసి, అందులో రెండు చెంచాల గులాబీ నీళ్లు, రెండు చెంచాల తేనె, మూడు చుక్కల బాదం నూనె వేసి మిశ్రమంలా చేయాలి. దీన్ని ముఖంపై వలయాకారంగా రాస్తూ పావుగంట తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. అంతే... పొడిబారిన చర్మం మృదువుగా మారిపోతుంది. ఎనిమిది గులాబీ రేకలను మెత్తగా చేసి అందులో రెండు చెంచాల గులాబీ నీళ్లు, చెంచా పెరుగూ, చెంచా తేనె వేసి కలపాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా వేసి పది నిమిషాల తర్వాత కడిగేయాలి. పది గులాబీలు, పది పుదీనా ఆకుల్ని మెత్తని మిశ్రమంలా చేయాలి. దీనికి చెంచా గులాబీ నీళ్లు, గుడ్డులోని తెల్లసొన, చెంచా మొక్కజొన్న పిండి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పావుగంట తరువాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖంపై ముడతలు తగ్గుముఖం పడతాయి. ★

సెన్సెక్స్ ↓ 253
32,923

నిఫ్టీ ↓ 101
10,094

రూపాయి ↓ 24 పై.
అమెరికా డాలరుకు రూ.
65.18



సిఎసిలో జియో లైఫ్..

జియోలైఫ్ అగ్రిటెక్ ఇండియా చైనాలోని షాంగైలో జరిగిన ప్రపంచ స్థాయి వ్యవసాయ ప్రదర్శన సిఎసి-18లో నీటిలో కరిగే ఎరువులు, సేంద్రీయ, నానో సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎరువులను ప్రదర్శించింది. పర్యావరణానికి హాని చేయని అధిక దిగుబడులిచ్చే తమ ఉత్పత్తులకు ప్రశంసలు అందాయని జియోలైఫ్ ఎండి వినోద్ లహోటీ పెర్కొన్నారు.



దీక్షా పంథ్ సందడి

హైదరాబాద్‌లోని బిగ్ బజార్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యాషన్ విభాగాన్ని ప్రముఖ నటి దీక్షా పంథ్, ఆ స్టోర్ మేనేజర్ ప్రశాంత్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించి సందడి చేశారు. పక్కింటి వాళ్లు ఇచ్చే ఉగాది పచ్చడి కోసం ప్రతి ఏడాది ఆతృతగా ఎదురుచూస్తుంటానని దీక్షా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఐదారేళ్లలో 5వేల కోట్ల పెట్టుబడులు

ఎంజి మోటార్స్ వెల్లడి



న్యూఢిల్లీ : వచ్చే ఐదారేళ్లలో భారత్‌లో రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎంజి మోటార్ ఇండియా ప్రెసిడెంట్ రాజీవ్ చాబా తెలిపారు. అదే విధంగా 2019 నుంచి ప్రతీ ఏడాదికి ఒక కొత్త మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నామని తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే హలోల్ ప్లాంట్‌లో రూ.2,000 కోట్లు పెట్టుబడిగా పెట్టామన్నారు. వచ్చే ఏడాది తొలి ఎస్‌యువిని ఆవిష్కరించనున్నామని తెలిపారు .హలోల్ ప్లాంట్ తొలి దశ సామర్థ్యం ఏడాదికి 80,000-1,00,000 యూనిట్లుగా ఉందన్నారు. రెండో దశలో ఈ సామర్థ్యాన్ని రెండు లక్ష యూనిట్లకు చేర్చాలని నిర్ధేశించుకున్నామన్నారు. 80 శాతం ఉత్పత్తులను స్థానికంగానే సమకూర్చుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 150 మంది ఉద్యోగులున్నారని, ఏడాది చివరి నాటికి 1,000 మందికి పెంచుకోనున్నామని తెలిపారు.

కొనసాగిన అవిశ్వాసం

33వేల దిగువన సెన్సెక్స్



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లను సోమవారం కూడా అవిశ్వాస భయాలు వెంటాడాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల కేంద్ర ప్రభుత్వంపై కొరవడిన విశ్వాసంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 253 పాయింట్లు కోల్పోయి 32,923కు పడిపోయింది. ఉదయం 33,269 వద్ద మొదలైన సూచీ ఓ దశలో 33,275 గరిష్ట స్థాయిని తాకగా అనంతరం దినమంతా ఒత్తిడికి గురై మరో దశలో 32,856 కనిష్ట స్థాయిని తాకింది. నిఫ్టీ 101 పాయింట్లు పతనమై 10,094 వద్ద ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని టిడిపి పెట్టనున్న అవిశ్వాస తీర్మాణం నేపథ్యంలో ఇంతక్రితం సెషన్‌లో బిఎస్ఇ 500 పాయంట్లు పైగా క్షీణించిన విషయం తెలిసిందే. బిఎస్ఇలో రంగాల వారిగా టెలికం సూచీ 3.40 శాతం, రియాల్టీ 3.01 శాతం, లోహ 2.65 శాతం, టెక్ 2,08 శాతం, ఐటి 1.98 శాతం, పిఎస్‌యు 1.84 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.98 శాతం, 1.58 శాతం చొప్పున క్షీణించాయి.

సొంత వ్యాపారాల్లో.. భారత్ అట్టడుగు స్థాయి

- 5% మంది మాత్రమే ఆసక్తి
- ప్రపంచంలోనే అట్టడుగు స్థాయి
- అర్ధంతరంగా ఆపేయడంలో ఫస్ట్
- వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు



అహ్మదాబాద్ : ఆర్థిక ఇబ్బందులకు తోడు సరైన మార్గం లేక భారత్‌లో చాలా మంది యువత సొంత వ్యాపారాల స్థాపనపై ఆసక్తి చూపడం లేదు. వ్యాపారం చేయడం అంత సులభం కాదనే భయాలు కూడా అనాసక్తిని పెంచుతున్నాయి. వివిధ కారణాల వల్ల దేశ యువకుల్లో కేవలం ఐదు శాతం మంది మాత్రమే వ్యాపారాల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నారని ఒకక సర్వేలో వెల్లడయ్యింది. ఈ అంశంలో ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్ అట్టడుగు స్థాయిలో ఉంది. మరోవైపు పలు కారణాల వల్ల 26.4 శాతం మంది వ్యాపారాలను అర్ధంతరంగా మూసివేయడంలో ముందున్నారు. ఈ విషయంలో మాత్రం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నారు. వ్యాపారాలను ప్రారంభించడంలో యువత ఆసక్తిపై గాంధీనగర్ కేంద్రంగా పని చేస్తున్న ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఇడిఐ), దీని అనుబంధ సంస్థలు కలిసి ఒక రిపోర్టును రూపొందించాయి. గ్లోబల్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ మానిటర్ (జిఇఎం) ఇండియా 2016-17 పేరుతో రిపోర్టును తయారు చేశాయి. ఈ సంస్థ 18-64 మధ్య వయస్సులోని 3,400 మంది ఔత్సాహికవేత్తలను సర్వే చేసింది.

బ్రెజిల్ టాప్..

జిఇఎ రిపోర్టు ప్రకారం దేశంలోని 5శాతం మంది యువకులు మాత్రమే సొంత వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. వీళ్ల మాత్రమే వ్యాపారాలను మూడేళ్ల కంటే ఎక్కువ కాలం నుంచి కొనసాగిస్తున్నారు. కొందరు వ్యాపారాలపై ఆసక్తి ఉండి మొదలు పెడుతున్నప్పటికీ మూడేళ్లలోపే నిలిపివే స్తున్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే వ్యాపారాలను నెల కొల్పడంలో భారత యువత అథమ స్థాయిలో ఉందని ఈ రిపోర్టు పేర్కొంది. ఈ అంశంలో బ్రిక్స్ దేశాల్లో బ్రెజిల్ 17శాతంతో తొలిస్థానంలో ఉంది. కాగా దక్షిణాఫ్రికాలో 3శాతం మాత్రమే సొంత వ్యాపారాల వైపు మొగ్గచూపుతున్నారు. చైనాలో 8శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. రష్యా, భారత్‌లో 5శాతం మంది వ్యాపారాలపై ఇష్టాన్ని కనబర్చుతున్నారు.

మూడేళ్ల ముచ్చట..

దేశ యువతలో 11శాతం మంది తమ కెరీర్ తొలి రోజుల్లో వ్యాపారాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే వీరిలో సగానికి పైగా మంది తమ వ్యాపారాల వద్ధిపై విశ్వాసం కొరవడి వెనక్కి తగ్గుతున్నారు. కాగా నాలుగు శాతం మంది మాత్రం తొలినాళ్లలోనే సొంతగా వ్యాపారాలను పెట్టుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. మరో 7 శాతం మంది ఔత్సాహికవేత్తలు మాత్రం 3.5 సంవత్సరాలకే వ్యాపారాల నుంచి వైదొలుగుతున్నారు. స్థూలంగా 5 శాతం మంది మాత్రమే వ్యాపారాలను ప్రారంభించి దీర్ఘకాలంగా మూడున్నరేళ్ల పైగా కొనసాగిస్తున్నరని రిపోర్టు పేర్కొంది.

విస్తరణకు వెనుకడుగు..

భారత వ్యాపార ఔత్సాహికవేత్తలు ఉద్యోగులను నియమించుకోవడంలోనూ అంతంత మాత్రంగానే ఉన్నారు. చాలా మంది తమ వ్యాపారాల విస్తరణకు ఆసక్తి చూపడం లేదు. కాగా 44 శాతం మంది మాత్రం వచ్చే ఐదేళ్లలో 1-5 మంది ఉద్యోగులను తీసుకోనున్నట్లు అబి.ప్రాయపడ్డారు. కేవలం 5 శాతం మంది మాత్రమే ఐదు కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తీసుకోగలమని పేర్కొ న్నారు. ఇదిలా ఉండగా, వ్యాపారాలను అర్ధాంతరంగా మూసివేయడం మన దేశంలో 26.4శాతంగా ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు, లాభాల కొరత, వ్యక్తిగత, ఇతర కారణా లతో వీరు తమ సంస్థలను మూసేస్తున్నట్లు ఈ సర్వేలో తేలింది.

వెంటాడుతున్న ఇబ్బందులు..

ఆర్థిక ఇబ్బందులతోనే 7 శాతం మంది తమ వ్యాపారాలను మూసివేసుకుంటున్నారు. అధికారులు పెట్టిన వివిధ కేసుల వల్ల 1.3 శాతం మంది వ్యాపారాల నుంచి వైదొలుగుతున్నారు. మరో 6.5 శాతం మంది వ్యక్తిగత కారణాలు, 16.9 శాతం మంది తమ వ్యాపారంలో లాభాలు రానందుకు, మిగితా 58.4 శాతం మంది వేరే కారణాల వల్ల వ్యాపారాలకు దూరం అవుతున్నారని ఈ రిపోర్టు వెల్లడించింది. ఈ సర్వేలో 70.9 శాతం మంది హోల్‌సేల్ అండ్ రిటైల్ వర్తకులు, వ్యవసాయ రంగం నుంచి 12.1 శాతం, వైద్య విద్యా, ప్రభుత్వ, సామాజిక సేవల నుంచి 9.3 శాతం, విత్త సేవలు 4.5 శాతం, ఇతర రంగాల నుంచి 3.3 శాతం చొప్పున ఔత్సాహికవేత్తలను భాగస్వాములను చేశారు.

వివో ప్రచారకర్తగా అమీర్ ఖాన్



న్యూఢిల్లీ : ప్రముఖ చైనీస్ స్మార్ట్‌ఫోన్ల కంపెనీ వివో భారత్‌లో తన బ్రాండ్ అంబాసీడర్‌గా బాలీవుడ్ హీరో అమీర్ ఖాన్‌ను నియమించుకుంది. ఇకపై తమ ఉత్పత్తులకు అమీర్ ప్రచారం కల్పించనున్నారని వివో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కెన్ని జెంగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం తమ అమ్మకాలను కొత్త శిఖరాలకు చేర్చనుందని జెంగ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

క్లియర్ టాక్స్, నుక్కడ్ షాప్స్ జట్టు

హైదరాబాద్ : స్థానిక కిరాణా దూకణాలు కూడా నేడు నూతన టెక్నాలజీ విదానాలను ఆచరించడానికి వీలుగా రిటైల్ టెక్ స్టార్టప్ నుక్కడ్ షాప్స్, క్లియర్ టాక్స్ జట్టు కట్టాయి. నుక్కడ్ షాప్స్ వినియోగదారులకు సులభమైన జిఎస్‌టి సమ్మతిని అందించడానికి భాగస్వామ్యం అయినట్లు ఆ సంస్థలు తెలిపాయి. హైదరాబాద్‌కు చెందిన నుక్కడ్ షాప్స్ యొక్క 1500 లకు పైగా రిటైలర్ల వారి రిటైల్ కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడానికి ప్రయత్నిస్తోంది. తమతో ఒప్పందం ద్వార వారి వ్యాపారంలో ఎలాంటి జిఎస్‌టి అవాంతరాలు లేకుండా దోహదం చేయనుందని క్లియర్ టాక్స్ సిఇఒ అర్చిత్ గుప్తా పేర్కొన్నారు. తాము ఇప్పటి వరకు మేము 3.6 లక్షల ఎస్ఎంఇ లను తమ వేదిక పైకి తెచ్చామన్నారు.

విద్య

S.S.C. MODEL PAPER

MATHS PAPER-I

(ప్రాక్టీస్ బిట్ పేపర్లు)

PART – B (1)

Time: 30 Min **Marks: 10**

Instruction:
1. Answer the all questions.
2. Each question carries 1/2 mark.
3. Part - B answers should be written the given paper only.
4. No marks given to over writing answers.

SECTION - IV (20×1/2=10)


(i) Answer all the questions.
(ii) Each question carries 1/2 Mark

14. The value of $\log_2 512$ = ... ( )
A) 3 B) 6 C) 9 D) 12

15. If 3 log(x+3) = log 27 then the value of x is .. ( )
A) 0 B) 24 C) 1 D) 8

16. The decimal form of $\frac{36}{2^3 \times 5^3}$ ( )
A) 0.036 B) 0.36
C) 0.0036 D) 3.6

17. In the adjacent figure $A \cap B$ = ... ( )
A) A B) B
C) $A \cup B$ D) ϕ




18. $n(\phi)$ = ... ( )
A) ϕ B) 1 C) 0 D) n

19. n(A) = 15 and n($A \cap B$)=5 and then n(A-B) = ... ( )
A) 15 B) 5 C) 20 D) 10

20. If a and b are the zeros of a quadratic polynomial x^2+4x+4 then a+b+ab ( )
A) 1 B) $-\frac{1}{4}$ C) 0 D) 4

21. The number of zeros of the polynomial in the graph ( )
A) 0 B) 1
C) 2 D) 4



22. The degree of a constant term is ( )
A) 1 B) -2 C) -4 D) 0

23. The lines x-2y = -1 and x+ky=11 has unique solution then.... ( )
A) $k \neq 1$ B) $k = 1$
C) $k \neq 2$ D) $k \neq -2$

24. The point of intersection of x-y=1 and 2x+y = 8 intersect at ...... ( )
A) (1, 9) B) (9, 8)
C) (3, 2) D) (1, -1)

25. X + Y = 2018 has .... number of solutions ( )
A) 0 B) Infinitely so many
C) 2018 D) only one solution

26. Sum of the roots of $bx^2+ax+c=0$ is.... ( )
A) $-\frac{b}{a}$ B) $-\frac{a}{b}$
C) $-\frac{c}{b}$ D) $\frac{c}{a}$

27. If $b^2-4ac<0$ then the roots of the quadratic equation are ..... ( )
A) Real and distinct B) Real and equal
C) Imaginary D) None

28. In A.P $a_n = 6n + 2$, then common difference (d) = ... ( )
A) 5 B) 8 C) 6 D) 4


29. If 4, x, 9 are in G.P. then x = ... ( )
A) 5 B) 6 C) 7 D) 8

30. In a G.P. $a_n=3.2^{n-1}$ then the sum of the first two terms.... ( )
A) 8 B) 9 C) 10 D) 11

31. The surface area of sphere is 616 cm^2 then the radius is .... cm ( )
A) 16 B) 12 C) 10 D) 7

32. If the volume of a cone is 462 cm^3 and r = 7 cm then height (h) = ... cm ( )
A) 9 B) 10 C) 11 D) 12

33. Surface area of the adjacent figure = ... ( )
A) $\pi r(l+2r)$ B) $\pi r(l+2r^2)$
C) $\pi r(l+3r)$ D) $\pi r(l+4r)$



Part -B (1) (Answers)

14.C 15.A 16.A 17.B 18.C 19.D 20.C 21.A 22.D
23.D 24.C 25.B 26.B 27.C 28.C 29.B 30.B 31.D
32.A 33.A

PART – B (2)

Time: 30 Min **Marks: 10**

Instruction:
1. Answer the all questions.
2. Each question carries 1/2 mark.
3. Part - B answers should be written the given paper only.
4. No marks given to over writing answers.

SECTION - IV (20×1/2=10)

(i) Answer all the questions.
(ii) Each question carries 1/2 Mark

14. The value of $\log_a \frac{1}{a}$ ( )
A) -1 B) 1 C) a D) -a

15. If log 2 = 0.30103 then log 32 = ... ( )
A) 1.20412 B)1.80618
C) 1.50515 D) 1.2345

16. The H.C.F of the numbers $3^7 \times 5^3 \times 2^4$ and $3^2 \times 7^4 \times 2^8$ is ( )
A) $2^4 \times 3^2$ B) $2^8 \times 3^7$
C) $2^8 \times 3^7 \times 5^3 \times 7^4$ D) 2 x 3 x 5 x 7

17. A = {2, 5, 10, 17} in set builder form ( )
A) $\{x : x=2n+1, n \in N, n \leq 5\}$ B) $\{x : x=n^2+1, n \in N, n \leq 5\}$
C) $\{x : x=n^2+1, n \in N, n \leq 4\}$ D) $\{x : x=n^2+1, n \in Z, n \leq 4\}$

18. $A \subset B$ then $A \cup B$ ( )
A) A B) B C) {0} D) $A \cap B$


19. The sum of zeros of the polynomial $p(x) = 2x^3-5x^2-14x + 8$ is ( )
A) -7 B) -4 C) 4 D) $\frac{5}{2}$

20. The zeros of a quadratic polynomial $x^2 - x - 12$ are.... ( )
A) 4, -3 B) -4, -3 C) -4, 3 D) 4, 3

21. If 2, $-\frac{1}{3}$ are the zeros of which quadratic polynomial ? ( )
A) $3x^2 - 5x - 2$ B) $3x^2 + 5x + 2$
C) $3x^2 + 5x - 2$ D) $3x^2 - 5x + 2$

22. Which value of k, 3x + 4y + 2 = 0 and 9x+12y+k = 0 are coincident lines. ( )
A) 6 B) 3 C) 9 D) 4

23. The graph represents .... ( )
A) Cubic polynomial
B) Quadratic polynomial
C) Straight line
D) None



24. The value of x in the equation 3x-(x-4) = 3x+1 is.... ( )
A) -3 B) 0 C) 3 D) 10

25. Find the value of k in the quadratic equation $9x^2+kx+1 = 0$ when the roots are equal ( )
A) 4 B) 5 C) 6 D) 7

26. The maximum possible zeros of a cubic polynomial ( )
A) 0 B) 1 C) 2 D) 3

27. The discriminant of $x+\frac{1}{x}=5$ ( )
A) -21 B) 21 C) 29 D) -29

28. The series 1, 1, 1, ... is in = ... ( )
A) A.P. B) G.P.
C) A & B D) None

29. If x, 2x + 1, 4x + 1 are three consecutive terms of an A.P. then the fourth term is ( )
A) 1 B) 3 C) 5 D) 7

30. 1+3+5+7+....n terms = ... ( )
A) n B) n^2 C) n^3 D) $\frac{n(n+1)}{2}$

31. The Volume of a cylinder whose radius is x cm and height 2x cm is .... ( )
A) 2πx B) $2\pi x^2$ C) $2\pi x^3$ D) πx^3

32. The ratio of the total surface areas of a sphere and a hemi sphere both having the same radius is... ( )
A) 2:1 B) 4:3 C) 1:2 D) 3:4

33. Curved surface of the cylinder is = ... ( )
A) πrl B) 2πrh C) $\pi r^2 h$ D) 2πr(r+h)

Part -B (2) (Answers)

14.A 15.C 16.A 17.C
18.B 19.D 20.A 21.A
22.A 23.A 24.C 25.C
26.D 27.D 28.C 29.D
30.B 31.C 32.B 33.B

ఉద్యోగాలు

నాబార్డ్‌లో 92 ఉద్యోగాలు

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) రూరల్ డెవలప్ మెంట్ బ్యాంకింగ్ సర్వీస్ (ఆర్‌డీబీఎస్)లోని 92 గ్రేడ్ 'ఎ' కేటగిరీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్.

వేతనశ్రేణి: రూ.28,150-రూ.55,600.

విభాగాల వారీ ఖాళీలు: జనరల్-46, ఏనిమల్ హజ్బెండరీ-5, చార్టర్డ అకౌంటెంట్-5, ఎకనామిక్స్-9, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-2, ఫుడ్ ప్రాసెసింగ్/ ఫుడ్ టెక్నాలజీ-4, ఫారెస్ట్రీ-4, ల్యాండ్ డెవలప్‌మెంట్ (సాయిల్ సైన్స్)/ అగ్రికల్చర్-8, మైనర్ ఇరిగేషన్ (వాటర్ రీసోర్సెస్)-6, సోషల్ వర్క్-3.

అర్హతలు: సంబంధిత విభాగాలను బట్టి కనీసం 50 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ-45 శాతం) మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో బ్యాచిలర్ డిగ్రీ/ పీజీ/ పీజీ డిప్లొమా/ ఎంబీఏ/ పీహెచ్‌డీ.

వయసు: 2018, మార్చి 1 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ.

ప్రిలిమినరీ పరీక్ష విధానం: దీన్ని ఆన్‌లైన్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో ఒక్కోదాన్నుంచి 20 చొప్పున 80 ప్రశ్నలు, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఎకనామిక్స్ అండ్ సోషల్ ఇష్యూస్ (విత్ ఫోకస్ ఆన్ రూరల్ ఇండియా), అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (విత్ ఫోకస్ ఆన్ రూరల్ ఇండియా) విభాగాల్లో ఒక్కోదాని నుంచి 40 చొప్పున 120 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు.

మెయిన్ ఎగ్జామినేషన్: ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో డిస్క్రిప్టివ్ విధానంలో 100 మార్కులకు ప్రశ్నలిస్తారు. జనరల్ ఇంగ్లీష్ కంప్రైజ్ ఎస్సే రైటింగ్, కాంప్రెహెన్షన్, రిపోర్ట్ రైటింగ్, పారాగ్రాఫ్ రైటింగ్, లెటర్ రైటింగ్, ఎస్సే-40 మార్కులకు, ప్రెస్సీస్-20 మార్కులకు, క్వశ్చన్ ఆన్ ప్రెస్సీస్ పారా-20 మార్కులకు, రిపోర్ట్/ లెటర్ రైటింగ్-20 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర. పేపర్-2లో సంబంధిత విభాగాలకు సంబంధించి 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవధి గంటన్నర.

ఇంటర్వ్యూ: మెయిన్స్‌లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన మెరిట్ జాబితా అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇది 25 మార్కులకు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ ఎస్టీ-రూ.150 (ఇంటిమేషన్ చార్జీలు మాత్రమే), మిగిలిన కేటగిరీలకు రూ.800 (అప్లికేషన్ ఫీ-రూ.650 + ఇంటిమేషన్ చార్జీ-150).

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018.

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.nabard.org

రూ.30 లక్షల కల్తీ విత్తనాలు పట్టివేత

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో సుమారు రూ.30 లక్షల విలువైన కల్తీ మిర్చి విత్తనాలను వ్యవసాయాధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఏటుకూరు రోడ్డులో విఆర్ఎల్ పార్శిల్ సర్వీసు సెంటర్‌కు కర్నాటక నుంచి వచ్చిన పార్శిల్‌ను అధికారులు ముందస్తు సమాచారంతో తనిఖీలు చేయగా ముతక గోతాల్లో లూజు, హైబ్రిడ్ మిర్చి విత్తనాలను గుర్తించారు. కర్నాటక రాష్ట్రంలోని కొప్పాల జిల్లా కృషి సీడ్స్‌లో తయారైన విత్తనాలు, గుంటూరులోని సన్‌సీడ్స్‌కు పంపినట్లు పార్శిల్ రసీదులో పేర్కొన్నారు. పట్టుబడిన విత్తనాలు మొత్తం 205 కిలోలు ఉండగా, వాటి విలువ సుమారు రూ.30 లక్షల వరకూ ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడిన విత్తనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు గుంటూరు ఎడిఎ శ్రీనివాసరావు, ఎఒ అంకారావు తెలిపారు.



శత జయంతి సభలో మాట్లాడుతున్న శ్రీనివాస రావు

ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సుబ్బారావు

శతజయంతి సభలో సిపిఎం కేంద్రకార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఉయ్యూరు

చనిపోయేవరకూ విప్లవ జ్యోతిగా వెలుగొందిన ఆదర్శ కమ్యునిస్టు, కృష్ణా ఉద్యమ నిర్మాణ నాయకుడు మానికొండ సుబ్బారావు స్ఫూర్తిని, పోరాట భావజాలాన్ని అందరూ పాటించాలని సిపిఎం కేంద్రకార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కృష్ణాజిల్లా ఉయ్యూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన మానికొండ సుబ్బారావు శతజయంతి సభలో ఆయన మాట్లాడారు. తొలుత సుబ్బారావు చిత్రపటానికి కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్యతో కలసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టులపై నిర్బంధాలు కొనసాగుతున్న సమయంలోనే ఆయన పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని వివరించారు. పుచ్చలపల్లి సందరయ్య స్ఫూర్తితో జిల్లాలో ప్రజా ఉద్యమాల నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ నిర్మాణంలో ఆయన ముఖ్య పాత్రపోషించారన్నారు. ఆ సందర్భంగా ఆయనతో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మానికొండ సుబ్బారావు పేరుతో రచించిన 'ఆదర్శ కమ్యునిస్టు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మొదటి ప్రతిని కేంద్రకార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావుకు అందజేశారు. సిపిఎం కంట్రోల్ కమిటీ చైర్మన్ బి.ఆర్.తులసీరావు మాట్లాడుతూ ఉద్యమాల కోసం ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన మానికొండ సుబ్బారావు బాటలోనే అందరం పయనించాలన్నారు. మానికొండ సుబ్బారావు కుమార్తె డాక్టర్ వాణి మాట్లాడారు.

అంగన్‌వాడీల చలో విజయవాడ విజయవంతం

- వేలాదిమందితో భారీ ర్యాలీ
- మూడు నెలల్లో సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం
- అవసరమైతే బంద్‌కు పిలుపునిస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు
- మద్దతు తెలిపిన కార్మిక, ప్రజాసంఘాలు
- పలు జిల్లాలో ముందస్తు అరెస్టులు



సభలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ డైరెక్టర్ శివ పార్వతి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, వైసిపి అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి, జనసేన ప్రతినిధి పోతిన మహేశ్ ,సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.ఎ. గఫూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/యంత్రాంగం

ఐసిడిఎస్ బడ్జెట్ , అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని, బయోమెట్రిక్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవరం అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమయింది. మండుటెండను లెక్కచేయకుండా తరలివచ్చిన అంగన్‌వాడీలు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు జాయింట్ డైరెక్టర్ ధర్నా చౌక్ వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆందోళనకు రాకుండా అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు అడ్డుకొని ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. అయినప్పటికీ అన్ని జిల్లాల నుంచి తరలివచ్చిన వేలాది మంది అంగన్‌వాడీలు రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళనకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. అవసరమైతే వివిధ రాజకీయ పార్టీల మద్దతుతో బంద్‌కు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఆందోళన చేస్తామని వారి కోసం జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధమన్నారు. తెలంగాణలో పెంచినట్లుగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, వారిపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు అధ్యక్షత వహించిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి. బేబిరాణి మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా అంగన్‌వాడీలపై పనిభారం పెరిగింది కాని వేతనాలు పెరగలేదన్నారు. ఐసిడిఎస్ కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ తగ్గించాయన్నారు. తెలంగాణలో 2017 నుంచి అంగన్‌వాడీ వర్కర్‌కు నెలకు రూ 10,500, హెల్పర్, మినీవర్కర్‌కు రూ 6 వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. కాని మన రాష్ట్రంలో పెంచకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్‌కు రూ యాభై వేలు, హెల్పర్‌కు రూ 20 వేలు రిటైరయ్యాక బెనిఫిట్స్ ఇస్తుందన్నారు. 2016 నుంచి ప్రకటించిన బెనిఫిట్స్ కూడా వారికి అందడంలేదని మండిపడ్డారు. వేతనాల పెంపుతోపాటు, సెంటర్ అద్దెలు, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు 3 నెలల్లోగా పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో కేవలం అదనపు పోషకాహారానికే పెంచారు తప్ప ఐసిడిఎస్ వేతనాలకు తగ్గించిందన్నారు. ప్రచారం కోసం ప్రభుత్వ కార్యక్రమాలకు, సభలకు అంగన్‌వాడీలను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు నోటీసులిస్తూ బెదిరింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. రెండేళ్లుగా సెంటర్ అద్దెలు, అమృత హస్తం, టిఎ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల అంగన్‌వాడీలు అప్పులు చేసి నడపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. లబ్దిదారులకు ఫీడింగ్‌ను దూరం చేసేందుకు ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పై మండలిలో ప్రస్తావించామన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెరిగేవరకు వారి ఆందోళనకు మద్దతు ఉంటుందన్నారు.

హోదాతో 90 శాతం కేంద్రం నిధులు : ఎవి. నాగేశ్వరారవు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఐసిడిఎస్‌కు కేంద్రం 70 శాతం నిధులిస్తుందని,మోడి ప్రభుత్వం వచ్చాక 60 శాతానికి తగ్గించాయన్నారు. ప్రత్యేక హోదా వస్తే ఈ ప్రాజెక్టుకు కేంద్రం 90 శాతం నిధులిస్తుందన్నారు. జనసేన ప్రతినిధి పోతిన మహేశ్ మాట్లాడుతూ త్వరలో అంగన్‌వాడీల సమస్యలను పవన్ దృష్టికి తీసుకువెళ్ళేందుకు యూనియన్ ప్రతినిధులు ఆయనతో భేటి అయ్యేలా చూస్తానన్నారు.

అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నాయకులు ఐడిడిఎస్ ప్రాజెక్టు జెడి శివపార్వతికి అందజేశారు. వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పెండింగ్ బకాయిలు మార్చి నెలాఖరులోగా విడుదల చేస్తామని ఆమె అంగన్‌వాడీలకు హామీ ఇచ్చారు. అమృత హస్తం అమలుకు అడ్వాన్సులిస్తామని, సెంటర్ అద్దెలు వర్కర్ల ఖాతాలో జమ చేస్తామని, సబ్సిడీతో కూడిన గ్యాస్ అందిస్తామన్నారు. ఆన్‌లైన్ డ్యూటీలు వర్కర్లు చేయాల్సిన అవసరంలేదని స్పష్టంచేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు పోలారి, రామారావు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె. ధనలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర నాయకులు కె. స్వరూపరాణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. ఉమామహేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్‌వి. నర్సింహారావు, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రోజా, ఎన్‌సిహెచ్. సుప్రజ తదితరులు నాయకత్వం వహించారు.

స్కీం వర్కర్లు ఐక్యంగా పోరాడాలి : గఫూర్

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.ఎ. గఫూర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో సమస్యల పరిష్కారానికి స్కీం వర్కర్లంతా ఐక్యంగా పోరాడాలన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ 18 వేలు, రూ 3 వేలు పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలన్నారు. లబ్దిదారులకు బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కేటాయించిన పనులనే తప్ప అదనపు పనులనే అప్పగించరాదన్నారు.

అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలి : పార్థసారథి

మాజీ మంత్రి, వైసిపి అధికార ప్రతినిధి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగాఉండాలనే మంచి ఉద్దేశంతో పనిచేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

అదనపు పనులతో ప్రీ స్కూల్‌కు ఆటంకం : రమాదేవి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల జాబ్ చార్ట్‌లో లేని పనులు అప్పగిస్తే ప్రీ స్కూల్ దెబ్బతింటుందన్నారు. పెన్షన్ లేకుండా రిటైరవుతుంటే ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పలు జిల్లాలో ముందస్తు అరెస్టులు

'చలో విజయవాడ' కార్యక్రమంపై పోలీసుల ఉక్కుపాదాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఆందోళనలు చేపట్టారు. దీర్ఘకాలికంగా అపరిష్కృంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకొని అరెస్టులు చేశారు. కొన్ని జిల్లాల్లో ఆదివారం, మరికొన్ని జిల్లాల్లో సోమవారం అరెస్టులకు పాల్పడ్డారు. పలువురిని గృహనిర్బంధం చేశారు.

వెటర్నరీ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్/విజయవాడ

పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నరీ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. సోమవారం కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, బజారి మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏళ్ల తరబడి పని చేస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ప్రమోషన్లే తప్ప ఇప్పుడు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో తాము ప్రమోషన్‌లను కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 620 వెటర్నరీ పోస్టులు, 1200 ఆఫీస్ సబ్‌స్టాఫ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణం వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే లైవ్‌స్టాక్ ఆఫీసర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు పోస్టు ద్వారా వినతి పత్రాలు

న్యాయమైన తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెటర్నరీ విద్యార్థులు పోస్టాఫీసు నుంచి రిజిస్టర్ పోస్టులో పత్రాలు పంపించారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వెటర్నరీ కళాశాల వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళన 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రబాబుకు వినతి పత్రాలు పోస్టు చేయడం ద్వారా తమ నిరసన తెలిపారు. ఆ తర్వాత కళాశాల గేటు వద్ద రిలేదీక్షలు ప్రారంభించారు. విద్యార్థి పోరాట కమిటీ నాయకులు యస్వంత్ నాయుడు, కళ్యాణ్ మాట్లాడారు.

ఉపాధి కూలీ రూ.500 ఇవ్వాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

ఉపాధి కూలి రోజుకు రూ.500 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ అమలులో నిర్లక్ష్యం, కూలీల సమస్యలపై ఈనెల 21న చలో అసెంబ్లీని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో పని ప్రదేశాల్లో సంఘం నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీని ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని, వలసల నివారణకు ఈ చట్టాన్ని తెస్తే పనులను యంత్రాలతో చేయించడం ద్వారా కూలీలను వలస బాట పట్టిస్తున్నారని చెప్పారు. నిధులను సైతం మళ్లిస్తూ కూలీల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు.

విశాఖలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ను విలువ కట్టేందుకు 'అసెట్ వేల్యూయర్' బృందం సోమవారం డిసిఐలో పర్యటించింది. ఈ సమాచారం తెలుసుకున్న డిసిఐ కార్మికులు, ఉద్యోగులు గేటు వద్దకు చేరుకుని, ఆందోళన చేపట్టారు.

-విశాఖపట్నం ప్రతినిధి

ప్రజ్ఞ

జవాబులు

1. 78వ స్థానం
2. సింగపూర్, డమాస్కస్ (సిరియా)
3. ఫిలిఫ్పైన్స్
4. వాస్కో(గోవా), (ఈ నెల 19 నుంచి 24 వరకూ)
5. జువాన్ మార్టిన్ డెల్ పోట్రో (అర్జెంటీనా)

'చలో కలెక్టరేట్' భగ్నం

'రిమ్స్' వద్దనే అడ్డుకున్న పోలీసులు

45 మంది సెక్యూరిటీ గార్డులు అరెస్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

బకాయి, కొత విధించిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళంలోని రిమ్స్ సెక్యూరిటీగార్డులు సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను పోలీసులు భగ్నం చేశారు. రిమ్స్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సెక్యూరిటీగార్డులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా సమస్య పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని సెక్యూరిటీగార్డులు నిర్ణయించుకున్నారు. ఇందుకోసం రిమ్స్ జనరల్ ఆస్పత్రి నుంచి ర్యాలీగా వస్తుండగా రిమ్స్ ప్రధాన గేటు నుంచి బయటకు రానీయకుండా సమ్మె శిబిరం వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. సిఐటియు డివిజన్ ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవాధ్యక్షులు డి.గణేష్, యూనియన్ నాయకులు టి.రామారావు, రాజేంద్రప్రసాద్, టి.సంతోషి, మాధవి, భీమశంకర్‌తో పాటు 45 మందిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.



నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు డివిజన్ ఉపాధ్యక్షులు డి.గణేష్ అన్నారు. వేతనాలు చెల్లించని జైబాలాజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సెక్యూరిటీగార్డుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కలెక్టర్ స్పందించి బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పతనమవుతున్న నైతిక విలువలు

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ఘనంగా ప్రగతిశీల ఉగాది ఉత్సవం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజంలో నైతిక విలువలు లోపిస్తున్నాయని ప్రజాశక్తి సిజిఎం, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. అశాస్త్రీయ పంచాంగాలు, జాతకాలు, మూఢ నమ్మకాలను ప్రశ్నిస్తూ 17 అభ్యుదయ, ప్రగతిశీల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉగాది ఉత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేమన పద్యాలను నృత్య రూపకంగా ప్రదర్శించారు. ప్రజా నాట్యమండలి, అరుణోదయ కళాకారులు తమ కళారూపాల ద్వారా మూఢ నమ్మకాలను, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అనంతరం జరిగిన సభలో శర్మ మాట్లాడుతూ అంతరించిపోతున్న తెలుగు భాషా సంస్కృతిని కాపాడవలసిన బాధ్యత నేటి యువత పై ఉందన్నారు. నాస్తిక కేంద్రం సంచాలకులు జి విజయం మాట్లాడుతూ పెద్దనోట్ల రద్దు, వ్యవసాయ రంగ సంక్షోభాల వల్ల ప్రజలు పండుగలనే మర్చిపోయారన్నారు. ప్రకృతి విధ్వంసమవుతోందని, గ్లోబల్ వార్మింగ్ భూతంలా వెంటాడుతోందని భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ ప్రకృతి సంపదైన

వేప, పసుపు వంటి ఉత్పత్తులపై సామ్రాజ్యవాద దేశాలు పేటెంట్ పేరుతో పెత్తనం చెలాయిస్తున్నాయని విమర్శించారు. నాస్తిక సమాజం కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్, హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పాలకులే మూఢాచారాలను, మత విశ్వాసాలను పాటిస్తూ ప్రజాస్వామిక, లౌకిక వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. కూరపాటి రామారావు (ఐఎఫ్‌టియు), కెఎస్‌సి బోస్ (ఎంబి విజ్ఞాన కేంద్రం), కొత్తపల్లి రవిబాబు (ప్రజాసాహితి), సింగంపల్లి అశోక్ కుమార్ (శ్రీశ్రీ సాహిత్య నిధి), శాంతిశ్రీ (ప్రజాశక్తి), బి జమిందార్ (ప్రోగ్రెసివ్ ఫోరమ్) తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాశక్తి సిజిఎం, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

తెలుగు భాషాను కాపాడుకోవాలి

తెలుగువారి మధ్య ఐక్యత, అనుబంధాలను పెంచేది ఉగాది పండుగని మాజీ శాసనమండలి సభ్యులు ఎంవి.ఎస్.శర్మ అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా విద్యాధరపురం రామరాజ్యనగర్‌లో వి.వి.రాజు స్మారక అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ సమాజాన్ని ముందుకు నడిపించే సాహిత్యం రచయితలు సృష్టించాలన్నారు. టి.వి. సీరియళ్ళు ప్రజలను నిద్రపుచ్చే సాహిత్యాన్ని కుమ్మరిస్తున్నాయనీ, వీటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు సంస్కృతిని, తెలుగు భాషను కాపాడుకోవడానికి తెలుగు ప్రజలంతా ఆలోచించాలని అన్నారు.

హోదా విషయంలో బాబు, మోడీ మోసం చేశారు

ప్రజాశక్తి - ఉయ్యూరు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేశారని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. శ్రీనివాసరావు విమర్శించారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ కృష్ణాజిల్లా ఉయ్యూరులో సిపిఎం కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి ప్రధాన సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని బహిరంగ సభలో చెప్పిన మోడీ ఎన్నికల అనంతరం మాట మార్చడం శోచనీయమన్నారు. హోదా కంటే ప్యాకేజీతోనే ఎక్కువ నిధులు వస్తాయని చెప్పిన బాబు ఇప్పుడు తిరిగి హోదా ఇవ్వాలని మాట్లాడడం పచ్చి రాజకీయ అవకాశవాదమన్నారు. హోదా విషయంలో రాష్ట్రంలో టిడిపి, వైసిపి డ్రామాలాడుతున్నాయని విమర్శించారు.

సమస్యలు పరిష్కరించాలని 108 ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న పైలెట్లు, టెక్నీషియన్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కోటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. 108 సిబ్బందిని ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి 50 శాతం వేతనాలు పెంచాలని, ప్రతి నెలా 1వ తేదీనే చెల్లించాలని, 12 గంటల పనిని ఎనిమిది గంటలకు కుదించాలని, ఫుడ్ అలవెన్స్ ఇవ్వాలని, పాత నిర్వహణా సంస్థ జివికె నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.దినేష్ మాట్లాడుతూ ..ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల్లో నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

రోహింగ్యాల శిబిరాలలోని పరిస్థితులపై నివేదికివ్వండి : సుప్రీం


న్యూఢిల్లీ : దేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రత్యేకించి హర్యానా, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన శిబిరాలలో తలదాచుకుంటున్న రోహింగ్యా శరణార్థుల పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం సుప్రీం కోర్టు ఆదేశించింది. రోహింగ్యా శిబిరాలలో అపరిశుభ్ర వాతావరణం ఉందని, పారిశుద్ధ్య పరిస్థితులు అంతగా బాగాలేవని సీనియర్ అడ్వకేట్ కొలిన్ గొన్‌సాల్వేస్ ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయ మూర్తులు ఎ.ఎం. ఖన్విల్కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ అక్కడ పరిస్థితులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రోహింగ్యా శిబిరాలలోని పరిస్థితులపై జఫర్ ఉల్లా పిటిషన్ దాఖలు చేశారు.



కార్మిక నిరసన
గోవాలో గనుల తవ్వకం నిషేధాన్ని వ్యతిరేకిస్తూ వేల సంఖ్యలో గని కార్మికులు, ఐరన్ ఓర్ ఫ్యాక్టరీ కార్మికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. పనాజీ నగరంలోకి వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది.

దాణా స్కామ్‌లో లాలూ దోషి జగన్నాథ మిశ్రా నిర్దోషి

4వ కేసులో ప్రత్యేక సిబిఐ కోర్టు



న్యూఢిల్లీ : దాణా స్కామ్‌కు సంబంధించిన నాలుగో కేసులో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్‌యాదవ్‌ను రాంచీలోని ప్రత్యేక సిబిఐ కోర్టు దోషిగా ప్రకటించింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం దాణా స్కామ్ చోటు చేసుకున్నది. ప్రస్తుతం జార్ఖండ్‌లో ఉన్న దుమ్కా ట్రెజరీ నుండి రూ.3.5 కోట్లు మోసపూరితంగా డ్రా చేశారన్న ఆరోపణపై దాణా స్కామ్ నమోదయ్యింది. ఈ కేసులో జగన్నాథ మిశ్రాను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. దాణా స్కామ్‌కు సంబంధించిన రెండో కేసులో లాలూ, మిశ్రాలు ఇద్దరిని కూడా గత ఏడాది డిసెంబర్ 23న నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ కేసులో ఈనెల 21, 22, 23 తేదీలలో జరిగే వాదోపవాదాలు విన్న తరువాత ఏ మేరకు శిక్ష విధించాలో కోర్టు నిర్ణయిస్తుంది. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి శివపాల్ సింగ్ తన తీర్పును చదివి వినిపిస్తూ 19 మందిని దోషులుగాను, 12 మందిని నిర్దోషులుగాను ప్రకటించారు. న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తున్న సమయంలో లాలూ కోర్టులో లేరు. రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో ఉన్న ఆయనను కోర్టుకుతీసుకు వచ్చారు. న్యాయమూర్తి ఎదుట వ్యక్తిగతంగా కొద్దిసేపు హాజరై వెళ్లిపోయారు. బిర్సా ముండాజైలులోఉన్న లాలూ శనివారం అనారోగ్యానికి గురికావడంతో రిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే.

నితిన్ గడ్కరీకి ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ క్షమాపణలు


కేజ్రీవాల్


నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి క్షమాపణలు చెప్పారు. గడ్కరీపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పారు. పంజాబ్ మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజితియాకు క్షమాపణలు చెప్పిన కొద్ది రోజులకే ఆయన నితిన్ గడ్కరీకి క్షమాపణలు చెప్పడం విశేషం. కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పిన వారిలో నితిన్ గడ్కరి రెండో వారు. దేశంలోని అత్యంత అవినీతి పరులలో నితిన్ గడ్కరి ఒకరని 2014లో కేజ్రీవాల్ ఆరోపించారు. దీంతో గడ్కరి ఆయనపై పరువునష్టం దావా వేశారు. కేసు విచారణను ఎదుర్కొంటున్న ఆయన లిఖితపూర్వకంగా రాసిన క్షమాపణ లేఖను కోర్టుకు సమర్పించారు. క్షమాపణలు చెప్పిన తరువాత పరువునష్టం కేసును ఉపసంహరించుకుంటున్నట్లు కేజ్రీవాల్, గడ్కరీలు ఉమ్మడిగా ఢిల్లీ హైకోర్టుకు దరఖాస్తు సమర్పించారు. కేజ్రీవాల్ ఇప్పటి వరకు తనపై దాఖలైన దాదాపు 33 పరువునష్టం కేసులను కోర్టు వెలుపల పరిష్కరించుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

లింగాయత్‌లకు ప్రత్యేక మత మైనారిటీలుగా గుర్తింపు

బెంగళూరు : రాష్ట్రంలోని లింగాయత్ వర్గానికి ప్రత్యేక మతంగా గుర్తింపు కల్పించాలని, మత మైనారిటీ హోదా కల్పించాలని నాగమోహన్ దాస్ కమిటీ సిఫార్సుకు కర్ణాటక ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మరో రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామం రాష్ట్రంలో పెద్ద ఎత్తున రాజకీయ వివాదానికి దారి తీయనున్నది. రాష్ట్రంలోని గడగ్‌లో ఉన్న టొంటదర్య మఠానికి చెందిన సిద్ధ లింగ స్వామి గతవారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలుసుకుని తమ కమ్యూనిటిని ప్రత్యేక మతంగా గుర్తించి, మత మైనార్టీ హోదా కల్పించాలని ప్రభుత్వం అధికారికంగా నియమించిన నాగమోహన్ దాస్ కమిటీ చేసిన సిఫార్సును ఆమోదించాలని కోరారు. ఈ సందర్భంగా టొంటదర్య మఠ స్వామి విలేకరులతో మాట్లాడుతూ పోరాటం తమకేమీ కొత్త కాదన్నారు. దాదాపు 900 సంవత్సరాలుగా ఈ పోరాటం జరుపుతున్నామన్నారు. అది ఇప్పుడు పూర్తి రూపం ధరించిందన్నారు.

ఆర్జేడీతో చేతులు కలపనున్న ఎస్‌పి...!

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఉప ఎన్నికల సందర్భంగా బిఎస్‌పి (బహుజన్ సమాజ్ వాది పార్టీ)తో చేతులు కలిపిన సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి), ఇప్పుడు ఆర్జేడీతో కూడా కలిసేందుకు సన్నద్ధమైంది. 2019లో లోక్‌సభకు జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడించటానికి పటిష్ట కూటమిని ఏర్పాటు చేసే దిశగా పయనిస్తోంది. ఈ నేపథ్యంలో రాంచీలో లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీని ఎస్‌పి వైస్ ప్రెసిడెంట్ కిరణ్మయి నంద కలవనున్నారు. గోరఖ్‌పూర్, ఫుల్పూర్ ఉప ఎన్నికల్లో బిఎస్‌పి, ఎస్‌పి ఏకమై బిజెపిని ఓడించిన సంగతి తెలిసిందే. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో ఉన్న లాలూను మార్చి 24న జైలులో లేదా ఆసుపత్రిలో కలవనున్నట్లు కిరణ్మయి నంద తెలిపారు. దీని కోసం జైలు అధికారుల నుండి అనుమతి తీసుకున్నామని తెలిపారు. లాలూతో చర్చల అనంతరం తేజస్వీని కలుస్తామని తెలిపారు. ఆర్జెడీ ఎల్లప్పుడూ తమకు మద్దతిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఈవిఎంలు పూర్తిగా విశ్వసనీయమైనవి

మాజీ ఎన్నికల కమిషనర్ కృష్ణమూర్తి

హైదరాబాద్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవిఎంలు) పూర్తిగా విశ్వసనీయమైనవని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి ఎస్ కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. మళ్లీ పేపర్ బ్యాలెట్లకు మళ్లడం తిరోగమన చర్యగా పేర్కొన్నారు. పేపర్ బ్యాలెట్ల వ్యవస్థలో తారుమారు చేసే అవకాశం, కాగితం అధిక వృథా, ఫలితాల ప్రకటనకు అధిక సమయం, వంటి ఇతర నష్టాలు ఉంటాయని తెలిపారు. ఈవిఎంలు దేశం గర్వించే విషయమని, పూర్తిగా నమ్మకమైనవి అన్నారు. దురదృష్టవశాత్తూ కొన్ని రాజకీయ పార్టీలు మళ్లీ పేపర్ బ్యాలెట్ల కోసం పిలుపునిస్తున్నాయని ఆయన అన్నారు. పేపర్ బ్యాలెట్ వ్యవస్థలో ఫలితాల ప్రకటనకు అధిక సమయం పడుతుందని అన్నారు. కొన్ని ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో నకిలీ బ్యాలెట్ పేపరు బయటపడిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్‌లను వినియోగించాలని గతవారంలో ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

చైనా అధ్యక్షునికి అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : రెండవ సారి చైనా అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా జిన్‌పింగ్‌కు ప్రధాని నరేంద్రమోడీ సోమవారం అభినందనలు తెలిపారు. చైనా-భారత్ మధ్య సంబంధాలను మరింత అభివృద్ధి చేయడానికి జిన్‌పింగ్‌తో కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. గత వారం నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌సిపి)లో 2,970 సభ్యులు తిరిగి దేశ అధ్యక్షునిగా జిన్‌పింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. చైనా అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైనందుకు జిన్‌పింగ్‌కు అభినందనలని చైనా సోషల్ మీడియా ద్వారా మోడీ తన సందేశాన్ని పోస్ట్ చేశారు. సిక్కింలోని డోక్లాం వద్ద 73 రోజుల పాటు ఉద్రిక్తతలు కొనసాగిన అనంతరం భారత్, చైనా దౌత్య సంబంధాలను మెరుగు పర్చుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే ఇటీవలే బీజింగ్‌ను సందర్శించి చైనా ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. తాను కూడా ఈ నెలలో చైనాను సందర్శించే అవకాశం ఉందని రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు.

2జి స్పెక్ట్రం కేసులో మరో మలుపు

ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసిన ఇడి

న్యూఢిల్లీ : 2జి స్పెక్ట్రం కుంభకోణం కేసులో టెలికాం మాజీ మంత్రి ఎ.రాజా, డిఎంకె ఎంపి కనిమొళిని నిర్దోషులుగా పేర్కొంటూ సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. 2008లో 2జి స్పెక్ట్రం కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలను ఎదుర్కొంటున్న 17 మందిని నిర్దోషులుగా గత డిసెంబర్‌లో సిబిఐ కోర్టు తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. 200 కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగిన ఈ కుంభకోణంలో ఎ.రాజా పాత్ర ఉందన్న ఆరోపణలపై సరైన ఆధారాలు లేకపోవడంతో వారిని నిర్దోషులుగా పేర్కొంటూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసులో సిబిఐ అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని, పథకం ప్రకారమే చార్జీ షీటు రూపొందించిందని, ప్రాసిక్యూటర్ కూడా దీనిని రాజకీయ అవినీతి కేసుగా చూపిస్తున్నారని ప్రత్యేక న్యాయమూర్తి ఓ.పి.షైని పేర్కొన్నారు. 2008లో 2 జీ స్పెక్ట్రం కేటాయింపుల్లో భారీ ఎత్తున మోసం జరిగిందనీ, దీని వల్ల ప్రభుత్వానికి 1.76 లక్షల కోట్ల రూపాయల నష్టం జరిగిందని 2010లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వినోద్‌రాయ్ ఆరోపించారు.

పది కోట్ల రైతుల సంతకాల సేకరణ

ఆగస్టు 9న జైల్‌బోరో

ఏప్రిల్ మొదటి వారంలో “త్రిపుర సంఘీభావం”

సెప్టెంబర్‌లో రైతు, కార్మిక ఆందోళన

ఎఐకెఎస్ కేంద్ర కమిటీ నిర్ణయాలను వెల్లడించిన హన్నన్ మొల్లా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
దేశంలో ఏప్రిల్ 15 నుంచి 23 వరకు రైతు రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం మద్దతు ధరపై పది కోట్ల మంది రైతుల సంతకాలు సేకరించి, 300 జిల్లాల కలెక్టర్లకు వినతులను అందజేస్తామని అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా వెల్లడించారు. రెండు రోజుల పాటు ఎఐకెఎస్ కేంద్ర కమిటీ సమావేశాలు సంఘ ప్రధాన కార్యాలయంలో జరిగాయి. అనంతరం సోమవారం నాడిక్కడ ఈమేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే, ఉపాధ్యక్షుడు అమ్రరామ్, సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్, కోశాధికారి కృష్ణప్రసాద్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో జరిగిన రైతు ఉద్యమాలకు నేతృత్వం వహించిన మహారాష్ట్ర కిసాన్ సభ కార్యదర్శి అజిత్ నావలే, రాజస్థాన్ కార్యదర్శి ప్రేమారామ్‌లతో కలిసి హన్నన్ మొల్లా మాట్లాడారు. ఎఐకెఎస్ నేతృత్వంలో జరిగిన మహారాష్ట్ర, రాజస్థాన్ రైతు ఉద్యమాలు విజయం సాధించాయని, అందుకు కేంద్ర కమిటీ ఆ రెండు రాష్ట్రాల కమిటీలకు అభినందనలు తెలిపిందని అన్నారు. మహారాష్ట్ర ఉద్యమం జాతీయ స్థాయిలో రైతాంగంపై తీవ్ర చర్చకు దారితీసిందని, రైతుల సమస్యలపై మాట్లాడని వారుకూడా ఇప్పుడు రైతాంగ సమస్యలపై మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ నిర్ణయాలను తెలిపారు.

ఈ నెల 20,21న భూమి అధికార్ ఆందోళన(బిఎఎ) నేతృత్వంలో వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక వ్యవస్థపై దాడి, దళిత, మైనార్టీల గోరక్షక్ హత్యలపై ఫోటో ఎగ్జిబిషన్, జాతీయ సదస్సు నిర్వహిస్తోన్నట్లు హన్నన్ మొల్లా తెలిపారు. రుణమాఫీ, మద్దతు ధర ప్రధాన డిమాండ్లతో ఏప్రిల్ 15 నుంచి 23 వరకు దేశంలో పది కోట్ల మంది రైతుల సంతకాలను సేకరించి, దాదాపు 300 జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతాంగ సమస్యలపై ఆగస్టు 9న జైలోబోరో కార్యక్రమం చేపట్టాలని కేంద్ర కమిటీ నిర్ణయించినట్లు చెప్పారు. త్రిపురలో బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత కిసాన్ సభ కార్యకర్తలపైన, సంఘం కార్యాలయాలపైన దాడులు జరుగుతున్నాయని, వందలాది కార్యాలయాలను బిజెపి, ఆరెస్సెస్ గూండాలు ధ్వంసం చేశారని తెలిపారు. త్రిపురలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఏప్రిల్ మొదటి వారం మొత్తం“త్రిపుర సంఘీభావం వారం”గా ప్రకటించామని, ఈ వారం రోజులో దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 11న సదస్సులు, ర్యాలీలు వంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. గో గూండాల దాడుల్లో పాలరైతు పెహుల్లాఖాన్ హత్యకు గురై ఏప్రిల్ 3 నాటికి ఏడాది పూర్తవుతుందని, ఈ సందర్భంగా ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో మోడీ సర్కార్ గద్దెనెక్కిన తరువాత 40 గో గూండాల దాడి ఘటనలు జరిగాయని, అందులో 30 మంది హతమయ్యారని గుర్తు చేశారు. దేశంలోని రైతాంగం, కార్మిక వర్గం ఉమ్మడిగా సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఐక్య పోరాటం చేస్తాయని, ఇందులో లక్షలాది మంది రైతు, కార్మికులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏపి, తెలంగాణ రైతు సంఘం నేతలు వై.కేశవరావు, పి.పెద్దిరెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్, పి.జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రైతులు నష్టపోతున్నారు : సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణలో ముఖ్యమంత్రి కెసిఆర్ 14 లక్షల మంది కౌలుదార్ల హక్కులను 1971 పాస్ పుస్తకాల చట్ట సవరణ ద్వారా తొలగించారని కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ఎకరాకు రూ.4వేలు సబ్సిడీ ఇస్తున్న 14 లక్షల మందికి, దేవదాయ భూములను కౌలు చేస్తోన్న 1.50లక్షల మందికి, పోడు భూములను సాగు చేస్తోన్న 1.20లక్షల మందికి, భూదాన యజ్ఞభూములు సాగు చేస్తోన్న వారికి తొలగించారని తెలిపారు. ఈ విధంగా 76లక్షల రైతుల్లో 26 లక్షల మంది రైతులకు ఈ పథకం నుంచి తొలగించారని వివరించారు. ఆ 26 లక్షల మంది వాస్తవ సాగుదార్లని, వారికి హక్కు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం పెద్దఎత్తున ఆందోళన చేస్తే, మిగతా రైతు సంఘాలు బలపరిచాయని, కానీ సిఎం కెసిఆర్ మాత్రం పెడచెవిని పెడుతున్నారని విమర్శించారు. గతేడాది తెలంగాణలో బిటి-3 పేరుతో 18లక్షల ఎకరాల్లో వేసిన పంటలు పూర్తిగా నష్టపోయారని, బిటి-3కి జిఈఎసి అనుమతి లేదని తెలిపారు. దేశంలో 1.3 మిలియన్ హెకార్ల్లో ఈ పంట వేశారని, మాన్‌శాంటో కంపెనీకి భయపడి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం వచ్చే ఏడాది మళ్లీ అదే కంపెనీకి 450 గ్రాముల ప్యాకెట్‌కి రూ.740 ధర నిర్ణయించిందని, దీన్ని రూ.900లకు పెంచాలని కంపెనీ యజమానులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. విత్తనాల ధరలు నిర్ణయించడం వల్ల ఏ విత్తనాలు వేయాలో తెలియక రైతులు ప్రత్తిపంట వైపు మొగ్గు చూపు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఏపి, తెలంగాణ, ఢిల్లీ నుంచి బిటి-3 విత్తనాలు సరఫరా చేసే వారిపై కేసులు రిజిస్టర్ చేయాలని ఒకవైపు చెప్పారని, మరోవైపున బిటి విత్తనాలకు ధర నిర్ణయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. తెలంగాణలో వ్యవసాయం వచ్చే ఏడాది తీవ్ర సంక్షోభంలోకి వెళుతుందని, మూడు చెరకు ఫ్యాక్టరీలు మూత పడ్డాయని, ఇలాంటి పరిస్థితిలో రాష్ట్రంలో 1.13 కోట్ల ఎకరాల్లో సాగయ్యే వరి మినహా ఏ పంటల వేయాలన్న దానిపై వ్యవసాయ శాఖ నిర్లిప్తంగా ఉందని అన్నారు.

ఏముంది గర్వకారణం?

యోగి సర్కార్‌పై యుపి మంత్రి విమర్శలు



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినప్పటికీ, ఉత్సవాలను గొప్పగా జరుపుకోవడానికి, చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేదని రాష్ట్ర మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని హెచ్చరించారు. మధుర, కాశీలలో ఆలయాలు నిర్మించామని చెప్పుకుంటూ ఉత్సవాలు జరపుకోవడం వల్ల ఫలితం లేదని, నిజం మాట్లాడటం తిరుగుబాటే అయితే, తాను చేస్తున్నది కూడా తిరుగుబాటేనని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికారంలో వున్న బిజెపిపై, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. సుహల్దేవ్ భారతీయ సమాజ పార్టీ (ఎస్‌బిఎస్‌పి)కి రాజ్‌భర్ నేతృత్వం వహిస్తున్నారు. యోగి మంత్రివర్గంలో ఎస్‌బిఎస్‌పి భాగస్వామిగా ఉన్నది. బిజెపి ప్రభుత్వ తీరును భాగస్వామ్య పక్షాలే విమర్శించడం గమనార్హం. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల ఓటమి నుంచి పార్టీ గుణపాఠాలు నేర్చుకోవాలని, కోల్పోయిన ప్రతిష్టను నిలబెట్టుకునేందుకు యోగి ప్రభుత్వం కృషి చేయాలంటూ కేంద్ర మంత్రి రామ విలాస్ పాశ్వాన్ కూడా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. రాజ్‌భర్ నేతృత్వంలోని ఎస్‌బిఎస్‌పి బిజెపి కూటమి నుంచి బయటకు రాకపోయినప్పటికీ వార్షిక ఉత్సవానికి మాత్రం హాజరు కాలేదు. ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో తాము భాగస్వాములుగా ఉన్నామని, భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూడాలని అన్నారు. వార్షికోత్సవ సంబరాలు జరుపుకోవడం వల్ల ఉపయోగమేమిటి? బిజెపి పేదల కోసం పనిచేస్తుందని భావించి దానితో కలిసి కూటమిగా ఏర్పడ్డామని, అటువంటిదేమీ జరగలేదని రాజ్‌భర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

మోడీ ముక్త్ భారత్ కోసం ప్రతిపక్షాలకు రాజ్‌థాకరే పిలుపు

ముంబయి : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఆయన నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పుడు హామీలతో దేశ ప్రజలు విసుగుచెందారని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్)వ్యవస్థాపకుడు రాజ్ థాకరే ఆదివారం వ్యాఖ్యానించారు. ముంబయిలోని శివాజి పార్కు వద్ద జరిగిన ఒక ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని ఓడించి 'మోడి ముక్త్ భారత్(మోడీ లేని భారత్)ను నిర్మించేందుకు ప్రతిపక్షాలన్ని కలిసి రావాలని పిలుపు నిచ్చారు. “1947లో దేశానికి తొలి సారి స్వాతంత్ర్యం లభించింది. 1977లో ఎమర్జెన్సీ తరువాత జరిగిన ఎన్నికల్లో రెండో సారి స్వాతంత్ర్యం పొందింది. ఇక 2019లో జరగబోయే ఎన్నికలు మూడోసారి స్వాతంత్ర్యాన్ని తీసుకు రానున్నాయి. అది మోడీ ముక్త్ భారత్‌తో వచ్చే స్వాతంత్ర్యం.” అని రాజ్‌థాకరే అన్నారు. మోడీ ప్రభుత్వం ఓడిపోయి, నోట్ల రద్దుపై విచారణకు ఆదేశించబడితే 1947 నాటి నుంచి దేశంలో జరిగిన అతి పెద్ద స్కాం ఇదే అవుతుందన్నారు. రాష్ట్ర పరిస్థితిపై మాట్లాడుతూ ఇక్కడ ఎన్నో సమస్యలున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ పాటలు పాడుకోవడంలో మునిగిపోయారనన్నారు.

యూపీలో మరో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆజంగర్ జిల్లాలోని బచ్వల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. కాగా, గడిచిన పది రోజుల్లో ఆజంనగర్ జిల్లాలో మరోసారి అంబేద్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకొని దుండగులు ధ్వంసం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీసులు మోహరించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే జిల్లాలో రాజ్‌పత్తి గ్రామంలో ఈ నెల 10న అంబేద్కర్ విగ్రహాన్ని దుండుగులు ధ్వంసం చేశారు. కాగా, ప్రముఖుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని అన్ని జిల్లా అధికారులకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇలాంటి ఘటనలు కొనసాగుతూనే ఉండటం గమనార్హం.

జునాయిద్ హత్య కేసులో పునర్విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ : గత జులైలో మధుర-బౌండ్ రైల్లో జరిగిన జునాయిద్ అనే యువకుడిని హత్య చేసిన కేసులో సిబిఐ పునర్విచారణకు సుప్రీంకోర్టు సోమవారం ఆమోదం తెలిపింది. కేసులో సిబిఐ దర్యాప్తును తిరస్కరిస్తూ సింగిల్ బెంచ్ తీర్పుకు వ్యతిరేకంగా జునాయిద్ తండ్రి జలాలుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్‌ను పంజాబ్, హర్యానా హైకోర్టు రెండు వారాల క్రితం కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై హర్యానా ప్రభుత్వం, సిబిఐ సమాధానం తెలపాలని ఆదేశాలు జారీ చేసింది. ఫరీదాబాద్ కోర్టులో ఉన్న విచారణను నిలిపివేసింది. కేసుల బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు రూపొందించిన మార్గదర్శకాల పరిధిలోకి ఈ కేసు రాదన్న కారణంతో ఈ కేసును దర్యాప్తుకు గతంలో సిబిఐ అంగీకరించలేదు. గత సంవత్సరం జూన్‌లో తన సోదరులతో రైల్లో జునాయిద్ హత్య గురైన సంగతి తెలిసిందే.

ఆరుషి కేసు విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఆరుషి-హేమరాజ్ హత్య కేసులో రాజేష్, నుపూర్ తల్వార్‌లను నిర్దోషులుగా పేర్కొంటూ అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ హేమరాజ్ భార్య కుంకలా భంజాదే దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. అక్టోబరు 12, 2017న వారు నిర్దోషులుగా పేర్కొన్న విషయం తెలిసిందే. నిర్దోషులుగా ఇచ్చిన ఆదేశాలపై సిబిఐ కూడా గతవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2008 మేలో రాజేష్, నుపూర్ తల్వార్‌ల కుమార్తె ఆరుషి తన గదిలోనే చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. పనిమనిషి హేమరాజ్ ఒక రోజు తర్వాత తల్వార్ ఇంటి టెర్రస్‌పై శవమై కనిపించాడు. దీనిపై పోలీసు విచారణ తీరుపై నిరసనలు వెల్లువెత్తడం తో తరువాత కేసును సిబిఐకి అప్పగించారు.

రూ.10 కోట్లు చెల్లించండి

నేషనల్ హెరాల్డ్ కేసులో యంగ్ ఇండియాను ఆదేశించిన హైకోర్టు

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో ఆదాయం పన్ను బకాయిలకు సంబంధించి రూ.10 కోట్లు చెల్లించాలని యంగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ను ఢిల్లీ హై కోర్టు సోమవారం ఆదేశించింది. వాస్తవానికి యంగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ను రూ.249.15 కోట్లు ఆదాయం పన్నుగా చెల్లించాల్సి ఉంది. యంగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌లో కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్ గాంధీలు షేర్ హోల్డర్లుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికకు చెందిన ఆస్తులను తమ సొంతం చేసుకోవాలనే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు ఇద్దరూ మోసపూరిత కుట్రకు పాల్పడ్డారని బిజెపి నేత సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్‌తో సహా మూడు వార్తా పత్రికలను ప్రచురిస్తున్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ పేరుపై రూ.90.25 కోట్లు వడ్డీ రహిత రుణాన్ని తీసుకున్నారని, ఈ రుణాలలో రూ.50 లక్షలను యంగ్ ఇండియా లిమిటెడ్‌కు బదిలీచేశారని సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నారు.

2011-2012 సంవత్సరానికి గాను రూ.249.15 కోట్లను డిపాజిట్ చేయాలని ఆదాయం పన్ను శాఖ డిమాండ్‌చేసింది. ఈ డిమాండ్‌ను యంగ్ ఇండియా కోర్టులో సవాల్ చేసింది. డిపాజిట్‌కు అవసరమైనన్ని నిధులు తమ వద్ద లేవని తెలిపిది. మార్కెట్ నుంచి నిధులు పెంచుకుంటామని పేర్కొంది.

మన్మోహన్‌కు పంజాబ్ మంత్రి సిద్దూ క్షమాపణలు



న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆర్భాట ప్రచారంతో చేయలేనిది మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మౌనంతో సాధించారని పంజాబ్ మంత్రి, మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ వ్యాఖ్యానించారు.. ఢిల్లీలో జరిగి కాంగ్రెస్ 84వ ప్లీనరీ సమావేశంలో సిద్ధూ మాట్లాడుతూ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పారు. పదవిలో ఉన్నంత కాలం సమస్యలను పట్టించుకోకుండా మౌనంగా ఉన్న మన్మోహన్ సింగ్‌ను సిద్ధూ తీవ్రంగా విమర్శించే వారు. సిద్దూ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ సర్దార్ (సిక్కు) మాత్రమే కాదని అసర్దార్ (ప్రభావశీలి) కూడా అని ప్రశంసించారు. “సర్దార్ మన్మోహన్ సింగ్‌కు క్షమాపణ చెబుతున్నాను. ఆయన ముందు తల వంచుతున్నాను. సర్దార్ మన్మోన్ సింగ్ మీ మౌనం చేయగలిగిన పనిని కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి చేయలేక పోయింది. పది సంవత్సరాల తరువాత నేను ఈ విషయాన్ని తెలుసు కోగలిగాను.” అని రాజకీయ వేత్తగా మారిన క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్దూ అన్నారు. 2017లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన బిజెపిలో చేరి సంగతి తెలిసిందే. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ అరేబియా గుర్రంలా పరిగెత్తిందని, బిజెపి పాలనలో ఆర్థిక వ్యవస్థ ఒక తాబేలు లా నత్త నడకన నడుస్తున్నదని చెప్పారు.

ఆ ప్రదర్శనలో ఐపిఎఫ్‌టి ఎలా పాల్గొంది? : సిపిఎం

అగర్తలా : త్రిపురలోని బిజెపి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) ఢిల్లీలో జరిగిన కొత్త రాష్ట్రాల ఉద్యమంలో పాల్గొనడంపై సిపిఎం ప్రశ్నించింది. బిజెపి దీనిపై స్పష్టతనివ్వా లని డిమాండ్ చేసింది. సిపిఎం ట్రైబల్ ఫ్రంట్ నేత, లోక్‌సభ ఎంపి జితేంద్ర చౌదరి ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనిపై తొలి నుంచి తాము వివరణ కోరుతూనే ఉన్నామని, వివరణ ఇచ్చేందుకు బిజెపి నిరాకరిస్తూ వచ్చిందని, ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారైనట్లు కనిపిస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఐపిఎఫ్‌టి ప్రత్యర్థిగా ఉన్న ఇండిజినియన్ సేషనలిస్టు పార్టీఆఫ్ త్విప్రా (ఐఎన్‌పిఎఫ్‌టి) కూడా ఇదే ప్రశ్నను లేవనెత్తింది. ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌ను తిరస్కరించిన ప్రభుత్వంలో భాగస్వామిగాఉన్న ఐపిఎఫ్‌టి ప్రదర్శనలో పాల్గొనడం చెడు సంకేతాలనందిస్తున్నదని ఐఎన్‌పిఎఫ్‌టి వైస్ ప్రెసిడెంట్ జగదీష్ దేవవర్మ తెలిపారు. ఐపిఎఫ్‌టి ప్రదర్శనలో పాల్గొనడంలోని ఆంతర్యంపై ఆయన ప్రశ్నించారు. దీనిపై బిజెపి ఉపాధ్యక్షుడు సుబల్ భౌమిక్ స్పందిస్తూ రాష్ట్ర విభజనకు అవకాశమే లేదని మోడీ స్పష్టం చేశారన్నారు. త్విప్రలాండ్‌తో సహా ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌ను పరిశీలించాలని ఢిల్లీలోని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ న్యూ స్టేట్స్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తిచేసింది. ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌తో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ న్యూ స్టేట్స్ సోమవారం ఢిల్లీ నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించింది. త్రిపుర ప్రభుత్వంలో బిజెపి భాగస్వామిగా ఉన్న ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి)కు చెందిన 5 వందల మంది కార్యకర్తలు ఈ ప్రదర్శనలో చేరారు.

స్త్రీ, పురుషులు సమానమే

సౌదీ యువరాజు వ్యాఖ్య

వాషింగ్టన్ : మహిళలు, పురుషులతో పూర్తిగా సమానులని సౌదీ అరేబియా యువరాజు ప్రిన్స్ మహ్మద్‌బిన్ సల్మాన్ వ్యాఖ్యానించారు. సోమవారం సౌదీ యువరాజు అమెరికా పర్యటనను పురస్కరించుకుని ఆదివారం సిబిఎస్ న్యూస్ ప్రోగ్రామ్ '60మినిట్స్'లో ఈ వ్యాఖ్యలు ప్రసారమయ్యాయి. మహిళలు పురుషులతో సమానమని భావిస్తారా అని ప్రశ్నించగా, 'ఖచ్చితంగా, మనందరం మానవులం. ఎలాంటి తేడా లేదని' అన్నారు. స్త్రీ, పురుషులకు సమానంగా వేతనాలు చెల్లించే విధానాల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలు వాహనాలను డ్రైవ్ చేసేందుకు సౌదీ ప్రభుత్వం అనుమతించింది. జూన్ నుండి ఇది అమల్లోకి రానుంది.

ప్రమాణ స్వీకారం



చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ కొత్త మంత్రివర్గాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా ఉప ప్రధాని హాన్ జెంగ్‌తోపాటు ప్రమాణస్వీకారం చేస్తున్న కొత్త ఉపప్రధానులు, స్టేట్ కౌన్సిలర్లు

చైనా ప్రధానిగా తిరిగి లీ కెకియాంగ్

జిన్‌పింగ్ కొత్త మంత్రివర్గం ఏర్పాటు

బీజింగ్ : చైనా అధ్యక్షుడిగా గత వారం రెండోసారి అధ్యక్షుడైన జీ జిన్‌పింగ్ కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. వీరిలో చైనా మిస్సైల్ మేన్‌గా పిలిచే లెఫ్టినెంట్ జనరల్ వెయ్ ఫెంగీ కొత్తగా రక్షణ మంత్రిగా నియమితులయ్యారు. జనరల్ వెయ్ చైనా సత్వర సైనిక ఆధునీకరణ, పునర్వ్యవస్థీకరణలో కీలక పాత్ర పోషించారు. నూతన మంత్రిమండలికి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) ఆమోద ముద్ర వేసింది. జిన్‌పింగ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన పాలనా యంత్రాంగంలో భాగంగా ప్రధానిగా లీ కెకియాంగ్ తిరిగి నియమితులయ్యారు. ఆయన ప్రతిపాదించిన నలుగురు ఉప ప్రధానులకు ఎన్‌సిపి డిప్యూటీలు ఆమోద ముద్ర వేశారు. మాజీ అవినీతి నిరోధక చీఫ్ వాంగ్ కీ షన్ ఉపాధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఉప ప్రధాని లియూ హీ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తారని భావిస్తున్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి కి స్టేట్ కౌన్సిలర్‌గా పదోన్నతి కల్పించారు. సంస్కరణవాది యీ గాంగ్‌ను సెంట్రల్ బ్యాంక్ కొత్త గవర్నర్‌గా నియమించారు. చెన్ వెన్‌కింగ్‌ను అంతర్గత భద్రత శాఖలో నియమించారు. ప్రభుత్వాన్ని మరింత వ్యవస్థాగతంగా తీర్చిదిద్దేందుకు వివిధ మంత్రిత్వ శాఖలను పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరించేందుకు చైనా ఈ కొత్త నియామకాలు చేపట్టింది. కొత్త పాలనాయంత్రాంగంలో 26 మంత్రిత్వ శాఖలు, స్టేట్ కౌన్సిల్ వున్నాయి.

ఆ మాటే అర్థం లేనిది : పుతిన్

మాస్కో : తీవ్రంగా అస్వస్థతకు గురై ప్రస్తుతం బ్రిటీష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రష్యా మాజీ గూఢచారి సెర్గీ స్కిరిపాల్, ఆయన కుమార్తెలపై రష్యా విష ప్రయోగం చేసిందన్న ఆలోచనే అర్థం లేనిదిగా వుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. గూఢచారి స్కిరిపాల్, ఆయన కుమార్తెపై విష ప్రయోగం చేసేందుకు సోవియట్ కాలం నాటి నెర్వ్ ఏజెంట్ 'నొవిచొక్'ను రష్యా ప్రయోగించిందని బ్రిటన్ ఆరోపిస్తున్నది. ఈ రసాయన ఆయుధాలను రష్యా నిల్వ చేసిందని, వాటిని ఎలా ఉపయోగిస్తున్నదో ప్రస్తుతం తాము దర్యాప్తు చేస్తున్నామని బ్రిటన్ విదేశాంగ మంత్రి బోరిస్ జాన్సన్ పేర్కొన్నారు. కాగా, ఈ ఆరోపణలపై తొలిసారిగా వ్యాఖ్యానించిన పుతిన్, తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బ్రిటన్ ప్రస్తావిస్తున్న ఈ విషాదం గురించి మీడియాలోనే తాను తెలుసుకున్నానని, ఇది నిజంగా మిలటరీ గ్రేడ్ రసాయన ఆయుధమే అయితే ప్రజలు అక్కడికక్కడే చనిపోయేవారని పుతిన్ విలేకర్లతో అన్నారు.

ముల్లర్ బృందంపై ట్రంప్ అసహనం

వాషింగ్టన్ : అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై దర్యాప్తు జరుపుతున్న ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లర్ బృందంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనాన్ని ప్రదర్శించారు. ముల్లర్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఆదివారం పలు ట్వీట్లు చేశారు. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంపై సాగుతున్న దర్యాప్తును ఆయన తీవ్రంగా నిరసిస్తున్నారు. ముల్లర్ బృందంలోని సభ్యుల 'నిష్పక్షపాత' వైఖరిని ప్రశ్నించారు. వారి రాజకీయ సంబంధాల పట్ల ఆందోళనలు వెలిబుచ్చారు. ఇదే విషయమై గతేడాది తొలగించిన ఎఫ్‌బిఐ మాజీ డైరెక్టర్ జేమ్స్ కామే, తాజాగా తొలగించిన ఎఫ్‌బిఐ డిప్యూటీ డైరెక్టర్ ఆండ్రూ మెక్ కాబె నిజాయితీని ట్రంప్ సవాలు చేశారు.

వాణిజ్య యుద్ధం ప్రమాదకరం

అమెరికాను హెచ్చరించిన జర్మనీ

బెర్లిన్ : రక్షణాత్మక విధానాలు అనుసరించడం వల్ల తలెత్తే ప్రమాదాల గురించి జర్మనీ అమెరికాను గట్టిగా హెచ్చరించింది. చైనా ఉక్కు, అల్యూమినియం దిగుమతు లపై అమెరికా అధికంగా సుంకాలు విధించడాన్ని నివారించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపింది. జర్మనీ ఆర్థిక మంత్రి పీటర్ అల్లామెయిర్ మీడియాతో మాట్లాడుతూ, దిగుమతి సుంకాలతో జర్మనీకి, ఇతర యూరప్ దేశాలకు మధ్య విభేదాలను అమెరికా సృష్టించలేదని అన్నారు. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం అటు ఉత్పత్తిదారులను, ఇటు వినియోగదారులను ఇద్దరినీ దెబ్బతీస్తుందని అన్నారు. సోమవారం వాషింగ్టన్ వచ్చిన మంత్రి అల్లామెయిర్ మాట్లాడుతూ, ఇయు వాణిజ్య కమిషనర్ సిసీలియా మామ్‌స్టార్మ్ సమన్వయంతో అమెరికా అధికారులతో సమావేశమవనున్నట్లు చెప్పారు. తమకు కస్టమ్స్ యూనియన్ వుందని, సంయుక్తంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యూరప్‌ను విభజించడం అమెరికా ప్రయోజనాలకు మంచిది కాదన్నారు. పైగా అది సఫలీకృతం కాలేదని అన్నారు. మెర్కెల్ సంకీర్ణంలో జూనియర్ భాగస్వామి అయిన సోషల్ డెమోక్రాట్స్ సభ్యుడు, కొత్త ఆర్థిక మంత్రి అయిన ఓలాఫ్ స్కాల్జ్ మాట్లాడుతూ, ఇలా రక్షణవాద విధానాలు అనుసరించడం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ భవిష్యత్ వృద్ధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. అర్జెంటైనాలో జరుగుతున్న జి-20 దేశాల సమావేశానికి బయలుదేరి వెళుతూ స్కాల్జ్, అమెరికా ఆర్థిక మంత్రిని కలిసినపుడు అమెరికా చర్యల పట్ల జర్మనీ వ్యతిరేకతను తెలియచేస్తానని చెప్పారు. చైనా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలు విధించాలన్న ట్రంప్ ఆలోచనలకు వ్యతిరేకంగా జర్మనీ, ఇయు అధికారులు పోరాడుతున్నారు. మెర్కెల్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు టెలిఫోన్‌లో మాట్లాడుతూ, బహు ముఖ సహకారం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. జి-20 చట్రపరిధిలో ప్రపంచ ఉక్కు మార్కెట్‌లో అదనపు సామర్థ్యం కోసం పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఇరువురు నేతలు ప్రతిన చేశారు. అమెరికా కానీ ఇతర దేశాలు కానీ తమకు అవకాశాలు లేవు, వెనుకబడ్డా మనుకున్న నిర్దిష్ట రంగాలపై చర్చించేందుకు ఇయు సిద్ధంగా వుందని మంత్రి అల్తామెయిర్ తెలిపారు. జర్మనీ కార్లపై సుంకాల విధింపు అంశంపై అమెరికా అధికారులతో చర్చిస్తానని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో జర్మనీ కార్లు విజయవంత మయ్యాయని, వాటిపై అధికంగా సుంకాలు విధించడం తప్పని పేర్కొన్నారు.



వాణిజ్యానికి అమెరికా అడ్డంకులు విధించడంపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టినా లాగార్డె హెచ్చరించారు. వాణిజ్య యుద్ధాల్లో ఎవరూ విజేతలు కాలేరని ఆమె వ్యాఖ్యానించారు. అర్జెంటీనా దినపత్రిక లా నాసియన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ వాణిజ్యంలో పెరుగుదల వల్ల పేద దేశాలు, సంపన్న దేశాల్లోని నిరుపేదలు లబ్ధి పొందారని చెప్పారు. అయితే కొన్ని ప్రాంతాలు, పరిశ్రమలు కూడా దెబ్బ తిన్నాయన్నారు. వినూత్న పద్ధతులు

వాణిజ్య యుద్ధాల్లో ఎవరూ విజేతలు కాలేరు : ఐఎంఎఫ్

అవలంబించడం వల్ల కలిగిన ప్రభావం, వాణిజ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ నష్టానికి పరిష్కారాన్ని కనుగొనాలని, అంతేకానీ వాణిజ్యాన్ని తగించడం వల్ల లేదా అదనపు అడ్డంకులు సృష్టించడం వల్ల ఎవరూ విజేతలు కారని ఆమె పేర్కొన్నారు. జి-20 ఆర్థిక మంత్రుల, సెంట్రల్ బ్యాంకుల అధ్యక్షుల సమావేశం కోసం లాగార్డె బ్యూనస్ ఎయిర్స్ వచ్చారు. ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బాగుందని, ఈ ఏడాది 3.9శాతం వృద్ధిరేటు వుంటుందని అంచనా వేశారని తెలిపారు.

ఖలీదా జియాకు బెయిల్‌పై స్టే

ఢాకా : ఒక అవినీతి కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా బెయిల్‌పై బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు సోమవారం స్టే విధించింది. ఈ కేసులో ఆమెకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. బెయిల్‌పై విడుదలై ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆమె ఆలోచనలకు ఎదురు దెబ్బ తగిలినట్లైంది. జియా ఆర్ఫనేజ్ ట్రస్టుకు ఉద్దేశించిన 21 మిలియన్ల టాకాలు (దాదాపు 2,50,000 డాలర్లు) స్వాహా చేసిన కేసులో ఫిబ్రవరి 8న జియాకు శిక్షపడింది. ఇదే కేసులో ఆమె కుమారుడు తారిక్ రహమాన్, మరో నలుగురికి కూడా పదేళ్ళ పాటు శిక్ష విధించారు. జియాకు నాలుగు నెలల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ, మార్చి 12వ తేదీన హైకోర్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రధాన న్యాయమూర్తి సయ్యద్ మహమూద్ హుస్సేన్ నేతృత్వంలోని అప్పిలేట్ బెంచ్ సోమవారం ఈ బెయిల్‌పై స్టే విధించింది. ఈ ఉత్తర్వులతో జియా మే 8వరకు జైలునుండి విడుదల కాలేరు. కేసు రికార్డులను పరిశీలించిన మీదట బెంచ్‌లోని నలుగురు న్యాయమూర్తులు ఏకగ్రీవంగానే ఈ తీర్పు ఇచ్చారని హుస్సేన్ తెలిపారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా ఇలా స్టే విధించడానికి సుప్రీం కోర్టు ఎలాంటి కారణం చెప్పకపోవడం గతంలో ఎన్నడూ జరగలేదని జియా తరపు లాయర్ తెలిపారు.

చైనా దిగుమతులపై సుంకాలు వద్దు

ట్రంప్‌కు 45 వాణిజ్య సమాఖ్యల లేఖ

దీనివల్ల మనకే నష్టమని వెల్లడి

వాషింగ్టన్ : చైనా దిగుమతులపై అధికంగా సుంకాలు విధించరాదని 45 అమెరికా వాణిజ్య సమాఖ్యలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ని కోరాయి. దేశంలోని అతిపెద్ద కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ వాణిజ్య గ్రూపులు, ఇలా సుంకాలు విధించడం వల్ల అమెరికా ఆర్థిక, వినియోగదారుల ప్రయోజనాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని హెచ్చరించాయి. ఈ మేరకు ట్రంప్‌కు ఒక లేఖ రాశాయి. చైనా దిగుమతులపై సుంకాలు విధించడం వల్ల వినియోగదారుల ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని, ఉద్యోగాలు పోతాయని, ఆర్థిక మార్కెట్లు నష్టపోతాయని పేర్కొన్నాయి. వాణిజ్య విధానాలపై వ్యాపార వర్గానికి, ట్రంప్‌కు మధ్య పెరుగుతున్న విభేదాల్లో ఈ లేఖ తాజాది. దేశీయ పరిశ్రమను కాపాడుకునేందుకు అవసరమైన మరిన్ని చర్యలు తీసుకుంటానని ట్రంప్ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ లేఖ వెలువడింది. చైనా రక్షిత వాణిజ్య విధానాలకు సమర్థవంతమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు, అమెరికా ఉద్యోగాలు, పోటీ తత్వాన్ని కాపాడేందుకు వాణిజ్య వర్గాలతో కలిసి పనిచేయాలని ఆ లేఖలో ట్రంప్‌ను కోరారు. వాణిజ్యం పట్ల చైనా దృక్పథంపై తమకు చాలా తీవ్రమైన ఆందోళనలు వున్నప్పటికీ అమెరికా ఏకపక్షంగా విధించే సుంకాల వల్ల మిత్రపక్షాల నుండి అమెరికా వేరవుతుందని ఆ లేఖ పేర్కొంది. చైనా సమాచార సాంకేతికత, టెలికం,వినియోగదారుల ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించేందుకు ట్రంప్ ప్రభుత్వం సమాయత్తమవుతున్న తరుణంలో ఈ లేఖ వెలువడింది.

మొదటిపేజీ తరువాయి

పుతిన్ ఘన విజయం

పుతిన్ ప్రత్యర్థి అలెక్సీ నావల్నీ పోటీ నుండి తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో పుతిన్ ఎన్నిక కేవలం లాంఛనప్రాయమైంది. 1999లో తొలిసారిగా పుతిన్ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టారు. 2012 వరకు రష్యాలో అధ్యక్ష పదవీ కాలం నాలుగు సంవత్సరాలుగానే వుంది. కానీ పుతిన్ అధ్యక్షుడుగా వున్న సమయంలో ఈ పదవీ కాలాన్ని ఆరేళ్ళకు పెంచారు. రష్యాను అత్యధికంగా పాలించిన జోసెఫ్ స్టాలిన్ తర్వాత ఎక్కువ కాలం అధికారంలో వున్న నేతగా పుతిన్ రికార్డు స్థాపించనున్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం పుతిన్ మాట్లాడుతూ, తనకు మద్దతిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనాడు ఓటు వేసిన ప్రతి ఒక్కరూ మన జాతీయ బృందంలో భాగస్వాముడేనని ఆయన వ్యాఖ్యానించారు.

జిన్‌పింగ్ అభినందనలు

బీజింగ్ : రష్యా అధ్యక్షుడుగా ఎన్నికైన వ్లాదిమిర్ పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అభినందించారు. ఇటీవలి కాలంలో, రష్యన్లు ఐక్యంగా వుండి దేశాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతున్నారని, ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నారని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలకమైన నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నారని జిన్‌పింగ్ తన అభినందన సందేశంలో పేర్కొన్నారు. జాతీయాభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కగల సామర్ధ్యం రష్యాకు వుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చైనా-రష్యా సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యం అత్యున్నత స్థాయిలో వుంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ళేందుకు చైనా సుముఖంగా వుందని జీ ఆ సందేశంలో పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా కోసం మానవహారం, ధర్నాలు

నిర్వహించారు. అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో వైసిపి, సిపిఎం ఆందోళన చేపట్టాయి. టిడిపి జడ్‌పి వైస్ ఛైర్మన్ కొట్యాడ అప్పారావు ఆధ్వర్యంలో అనంతగిరిలో ర్యాలీ నిర్వహించారు. పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పంచకట్టు, కండువాలతో నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో ఆందోళనలు కొనసాగాయి. రావులపాలెం జాతీయ రహదారిపై, అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఏలూరు పాతబస్టాండ్ వద్ద వైసిపి, సిపిఎం, సిపిఐ, ఎంసిపిఐ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు మాట్లాడారు. ఉంగుటూరు ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు నాయకత్వంలో భీమడోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. భీమవరంలో ప్రత్యేక హోదా సాధన ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బిజెపి కార్యాలయాన్ని ముట్టడించారు. పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం చెక్‌పోస్ట్ సెంటర్లో రాస్తారోకో చేశారు. కొవ్వూరులో, గణపవరం పోలీస్ దిమ్మ సెంటర్‌లో, ఆచంట కచేరి సెంటర్లో, పాలకొల్లు గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో మానవహారం నిర్వహించారు. పోలవరంలో ఆందోళన చేశారు. వైసిపి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గన్నవరంలో ప్రదర్శన చేపట్టారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తిరువూరులో స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే రక్షణ నిధి పాల్గొన్నారు. నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు మానవహారం నిర్వహించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమిలో టిడిపి శ్రేణులు నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశాయి. డప్పు వాయిద్యాలతో ప్రధాని మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా దిష్టిబొమ్మలను ఊరేగించారు. అనంతరం వాటిని చెప్పులతో కొట్టి దహనం చేశారు. కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మానవహారాలు నిర్వహించారు. కడప నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. సిపిఎం మద్దతు తెలిపింది. కర్నూలు జిల్లాలో వైసిపి ఆధ్వర్యంలో మానవహారాలు నిర్వహించారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా వైసిపి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు చోట్ల మానవహారం నిర్వహించారు. అనంతపురంలో సిపిఎం నగర కమిటీ మద్దతు తెలిపింది.

'బాబు' ప్రభుత్వ అవినీతిపై విచారణ

2.5, కేసిఆర్ పాలనకు 6 మార్కులు పవన్ వేశారు.

వివాదాస్పదమైన పవన్ వ్యాఖ్యలు

ఈ ఇంటర్వ్యూ సందర్భంగా పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి రాష్ట్రానికి ప్రత్యేకహోదా అనే పేరు అంత ముఖ్యం కాదని, అదే స్థాయిలో నిధులు ఇచ్చే ప్యాకేజి అయినా తమకు సమ్మతేమనని పవన్ అన్నట్లుగా వార్తలు వచ్చాయి. పలు తెలుగు టివి ఛానళ్లు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ బ్రేకింగ్ న్యూస్‌లు, కథనాలు ప్రచారం చేశాయి. కొందరు బిజెపి నేతలు పవన్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు ప్రకటనలు కూడా చేయడంతో ఈ విషయం చర్చనీయాంశమైంది. అయితే. పవన్ కళ్యాణ్ అలా అనలేదని, ఆయన వ్యాఖ్యలను రిపోర్టర్ తప్పుగా అర్థం చేసుకున్నారని జనసేన వివరణ ఇచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ అధికారిక ట్విట్టర్‌లో ట్వీట్ చేసింది.

క్షేత్ర స్థాయిలోకి హోదా పోరు

(మొదటిపేజీ తరువాయి)

కొత్త దశలోకి వెళుతోందని తెలిపారు. ఇప్పటి వరకూ కేంద్రం స్పందించలేదని, నాలుగేళ్లు మభ్యపెట్టిన టిడిపి కూడా అదేతీరుతో ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లి అన్ని చోట్లా హోదాకోసం పోరాడేవారందరినీ కలుపుకొనిపోవాల్సి ఉందని తెలిపారు. ఐక్యంగానే ఉద్యమాలన్నీ నిర్వహించాలని తెలిపారు. వేర్వేరు పార్టీలు, సంఘాలు ఈ ఆందోళన నిర్వహిస్తున్నా వాటికి మద్దతునివ్వాలని సూచించారు. నాలుగు సంవత్సరాలపాటు రాష్ట్ర ప్రజలకు జరిగిన నష్టానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జరిగిన అన్యాయంపై వారిదే పూర్తి బాధ్యతన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 2015లో హోదాపై ప్రశ్నించిన వారందరినీ జైల్లో పెట్టారని గుర్తు చేశారు. హోదా పోరు తీవ్రరూపం దాల్చడంతో సమస్య జాతీయ సమస్యగా మారిందని, దీనిపై పెద్దఎత్తున చర్చ సాగుతోందని తెలిపారు. ఇప్పటి వరకూ అన్నీ చేశామని చెబుతున్నారని, ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అవిశ్వాసంపై చర్చకు రాకుండా పార్లమెంటు సమావేశాలను వాయిదా వేస్తున్నారని, ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులు కేంద్రానికి తెలిసే విధంగా పోరాటాన్ని ఉధృతం చేయాల్సి ఉందని, అవసరమైతే రైళ్లు, విమానాలు కూడా నిలిపేసేందుకు సిద్ధమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. పిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి మాట్లాడుతూ విభజన సమయంలో మన్మోహన్‌సింగ్ ఆరు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారని, హోదా విషయంలో తావోపేడో తేల్చుకునేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. సినీ నటుడు శివాజీ మాట్లాడుతూ తెలుగు ప్రజలంటే బిజెపికి అవహేళనగా ఉందన్నారు. వైసిపి నాయకులు కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అడ్డుకోవడంలో కేంద్రం ఉద్దేశపూర్వకంగానే వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోదా కోసం జరిగే పోరుకు తామందరం కలిసి వస్తామని చెప్పారు. జనసేన నాయకులు అద్దేపల్లి శ్రీధర్ మాట్లాడుతూ హోదా కోసం సాధన సమితి నిర్వహించే ఆందోళనలకు జనసేన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. లోక్‌సత్తా నాయకులు చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన రైతు ఉద్యమం మాదిరిగా రాష్ట్రంలో హోదా కోసం పోరు జరగాలన్నారు. ఎపిజెఎఫ్ నాయకులు కృష్ణాంజనేయులు మాట్లాడుతూ ఆందోళన ఉద్యమ రూపంలోకి వెళ్లాలన్నారు. రాష్ట్రం పట్ల బిజెపి చిన్నచూపు చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం ప్రజలను నయవంచన చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం రెండోదోషిగా ఉందని తెలిపారు. బిజెపి నాయకులు పార్లమెంటును కూడా లెక్కచేయడం లేదని విమర్శించారు. ఉత్తర భారతీయ పార్టీగా ఉన్న బిజెపి కుయుక్తులతో ముందుకొస్తోందని ఎద్దేవా చేశారు. శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థి, యువజన నాయకులను భాగస్వామ్యులు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాల వద్ద కాగడాలతో ఆందోళన చేయాలన్నారు. సినీ రంగ ప్రముఖులను పోరాటంలోకి తీసుకురావాలని శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి తెలిపారు. హోదా సాధనలో యువత ప్రధాన పాత్ర పోషించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు సూచించారు. హోదా చట్టానికి కేంద్రప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మాజీ ఎంపి కొణతాల రామకృష్ణ విమర్శించారు. బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మట్టా జయకర్ మాట్లాడుతూ హోదా ఆందోళనకు న్యాయవాదుల సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఆమ్‌ఆద్మీ నాయకులు పోతిన రామారావు మాట్లాడుతూ ఢిల్లీ స్థాయిలో జరిగే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నాన్ పొలిటికల్ జెఎసి నాయకులు శ్రీహరినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆందోళనలను పట్టించుకోవడం లేదని, ప్రజల అభిప్రాయం ఏమిటో వారికి పట్టడం లేదని విమర్శించారు. ఎంఎల్ పార్టీ నాయకుడు హరినాథ్, ఎంసిపిఐ నాయకులు శివయ్య, న్యూడెమొక్రసీ నాయకులు రామారావు మాట్లాడుతూ ఉద్యమాల్లోకి ప్రజలను తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, నన్నయ యూనివర్శిటీ మాజీ విసి జార్జి విక్టర్, సదాశివరెడ్డి, భీశెట్టి బాబ్జి, అప్పలనాయుడు, గోపి, కొణిజేటి రమేష్, మల్లాది విష్ణు, ప్రజా సంఘాల ఆయకులు సయ్యద్ రఫీ, సత్యనారాయణరాజు, వివిధ ప్రజా, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడారు.

నాయకులను అడ్డుకున్న పోలీసులు

రౌండ్‌టేబుల్ సమావేశం అనంతరం నాయకులు బయటకు రాగా పోలీసులు వారిని రోడ్డుపైకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తాము ఆందోళన చేయడం లేదని ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని నాయకులు వారిని ప్రశ్నించారు. దీంతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కొలుసు పార్థసారథి తదితరులు పోలీసులను నెట్టుకుని బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా పోలీసులు అంగీకరించలేదు. దీంతో నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

పార్లమెంట్‌లో అదేతీరు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థించినా సభ్యులు శాంతించలేదు. నినాదాల మధ్యలోనే స్పీకర్ సుమిత్రా మహాజన్ వైసిపి, టిడిపి ఇచ్చిన అవిశ్వాస తీర్మానం గురించి మాట్లాడారు. "వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి, టిడిపి ఎంపి తోట నర్సింహం ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సభ ముందుకు తేవాల్సి ఉంది. కానీ అంతకంటే ముందు మీరు మీమీ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలి. లేకుంటే బిజినెస్ జరగదు" అని చెప్పారు. స్పీకర్ ఈ అంశంపై మాట్లాడటం ప్రారంభించగానే వైసిపి, టిడిపి సభ్యులతో పాటు కాంగ్రెస్, సిపిఎం, టిఎంసి, ఎన్సీపి, ఆర్జేడీ, ఆరెస్పీ, ఎస్పీ తదితర పార్టీలు సభ్యులు లేచి నిలబడ్డారు. ఈ సమయంలోనే స్పీకర్ అవిశ్వాస తీర్మానానికి అవసరమైన 50 మంది మద్దతు ఉందా? లేదా? అనే లెక్కపెట్టాలి. కానీ ఆమె లెక్క పెట్టకుండా ఆందోళనను సాకుగా చూపించారు. అదేసమయంలో వెల్‌లో టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వెల్‌లో ఉన్న సభ్యులు తమ స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ చెప్పినప్పటికీ వారు తమ ఆందోళనను కొనసాగించడంతో "సభ ఆర్డర్‌లో లేనందున అవిశ్వాస తీర్మానాలపై చర్చను ప్రారంభించలేకపోతున్నాం" అని సుమిత్రా ప్రకటించారు. దీంతో స్పీకర్ తీరుపై ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవిశ్వాసానికి అవసరమైన మద్దతు ఉందని, సభ్యుల సంఖ్య లెక్కపెట్టాలని సిపిఎం సభ్యుడు ఎం.డి సలీం కోరారు. వెంటనే ఆయనను అనుసరిస్తూ టిడిపి, వైసిపి, కాంగ్రెస్, టిఎంసి తదితర పార్టీల సభ్యులు ఇదే అంశాన్ని లేవనెత్తారు. అయినా స్పీకర్ వినిపించుకోలేదు. ఈ నేపథ్యంలో సభ్యుల నిరసనల మధ్య లెక్కింపు సాధ్యం కాదంటూ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఆందోళనలు కొనసాగాయి. వివిధ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేయడంతో సభ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించారు. ప్రతిపక్షాల నినాదాలతో సభ అట్టుడికిపోవడంతో పట్టుమని పది నిమిషాలు కూడా పార్లమెంట్ ఉభయ సభలు సాగలేదు. కాగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పార్లమెంట్ సభ్యులకు ఇచ్చిన లంచ్‌ను వైసిపి, టిడిపి ఎంపిలు బహిష్కరించారు.

మళ్లీ అవిశ్వాస నోటీసులు

కేంద్రం ఎన్ని కుయుక్తులకు పాల్పడినా, చర్చ జరిగేంత వరకు అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇస్తూనే ఉంటామని వైసిపి, టిడిపి ప్రకటించాయి. సోమవారం అవిశ్వాస తీర్మానం చర్చకు రాకపోవడంతో మళ్లీ మంగళవారం కూడా అవిశ్వాస తీర్మానం చర్చకు అనుమతించాలని కోరుతూ లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాత్సవకు వైసిపి సభ్యుడు వైవి సుబ్బారెడ్డి, టిడిపి సభ్యుడు తోట నరసింహం నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

150 మంది లేచి నిలబడ్డారు: వైవి సుబ్బారెడ్డి

కేంద్ర ప్రభుత్వంపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి లోక్‌సభలో అనూహ్య మద్దతు లభించిందని వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి చెప్పారు. "స్పీకర్ అవిశ్వాస తీర్మానం నోటీసులను చదివిన తర్వాత 150 మంది దాకా ఎంపిలు లేచి నిలబడ్డారు. అయితే అప్పటికే పోడియం దగ్గర కొన్ని పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. సభ ఆర్డర్‌లో లేని కారణంగా చర్చను చేపట్టలేకపోతున్నట్లు స్పీకర్ చెప్పారు. గందరగోళ పరిస్థితుల్లోనే ఆర్థిక బిల్లులు ఆమోదించుకున్నారే, మరి అవిశ్వాసంపై చర్చను మాత్రం వాయిదా వేయడం ఎంత వరకు సబబు?" అని ఆయన ప్రశ్నించారు.

చర్చకు భయపడుతోంది: తోట నరసింహం. టిడిపి ఎంపి

అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటులో చర్చకు కేంద్రం భయపడి పారిపోతోందని టిడిపి ఎంపి తోట నరసింహం అన్నారు. అన్నారు. నాలుగేళ్లుగా ఏపికి అది చేస్తాం, ఇది చేస్తామంటూ పబ్బం గడిపిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సమాధానం చెప్పలేకపోతోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని పార్లమెంటులో నిలదీసి తీరుతామని స్పష్టం చేశారు.

అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నాం: సీతారాం ఏచూరి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి తాము మద్దతిస్తామని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "మేము అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నాం. ఎందుకంటే, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల విషయంలో బిజెపి నిస్సిగ్గుగా ప్రజల్ని మోసం చేసింది. అవిశ్వాస తీర్మానంపై చర్చలో వారి మోసాన్ని ఎండగడతాం" అని ఏచూరి తెలిపారు. అవిశ్వాస తీర్మానానికి తాము కూడా మద్దతిస్తున్నట్లు సిపిఐ రాజ్యసభ ఎంపి డి.రాజా ప్రకటించారు.

హోదాకు మద్దతిస్తాం.. కానీ అవిశ్వాసానికి కాదు: అకాలీదళ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పూర్తి మద్దతు ఇస్తామని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కాదని శిరోమణి అకాలీదళ్ ఎంపి ప్రేమ్‌సింగ్ స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్డీఏ సర్కార్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బిజెపి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి తమ మద్దతు ఉండదని ప్రేమ్‌సింగ్ స్పష్టం చేశారు.

టెట్

43 శాతం అర్హత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2017 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మొత్తం 43 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణి, టెట్ కన్వీన్ సుబ్బారెడ్డితో కలిసి విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో టెట్ ఫలితాలను మంత్రి విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,14,120 మంది ఈ పరీక్ష రాశారని, వీరిలో 1,94,093 మంది అర్హత సాధించారని చెప్పారు.

జనరల్ అభ్యర్థులు 60 శాతం, బిసి అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 40 శాతం మార్కులు తెచ్చుకుంటే అర్హులని చెప్పారు. 1 నుంచి 5 పేపర్ల వరకు పేపర్-2కి 11 మార్కులు (మాథ్స్, సైన్స్‌లకు-8, సోషల్‌కు-3) మొత్తం 16 మార్కులు కలిపామన్నారు. పేపర్-1లో 1,73,861 మంది రాయగా, 1,00,638 (57.88శాతం), పేపర్-2 (మాథ్స్,సైన్స్)కు 97,649 మందికి 36,386 (37.26 శాతం), పేపర్-2 (సోషల్ స్టడీస్)కు 840,85 మంది రాయగా, 32,138 (38.22 శాతం) మంది, పేపర్-3కు 58,525 మంది రాయగా, 24,931 (42.60శాతం) అర్హత సాధించారని వివరించారు. 84 మంది అభ్యర్థుల ఫలితాలను వివిధ కారణాలతో నిలిపేశామన్నారు. ఫలితాల వివరాలను cse.ap.gov.in, aptet.apcfss.in వెబ్‌సైట్లలో చూడవచ్చున్నారు. రాష్ట్రంలో టీచర్ పోస్టుల విషయంలో మంత్రి గంటా మాట మార్చారు.

రాష్ట్రంలో 12,370 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గత డిసెంబర్ 6న ప్రకటించారు. 10,313 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని చెప్పారు. అయితే రాష్ట్రంలో అన్ని ఖాళీలు లేవని సుమారు 10 వేలు మాత్రమే ఉన్నాయని సోమవారం టెట్ ఫలితాల సమయంలో చెప్పారు. భర్తీకి ఆర్థిక శాఖకు లేఖ రాశామని, ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిన పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

వెబ్‌సైట్ ద్వారా అభ్యంతరాలు

అభ్యర్థులు వారికి వచ్చిన మార్కులపై అభ్యంతరాలు ఉంటే cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు పంపొచ్చునని టెట్ కన్వీనర్ ఎ సుబ్బారెడ్డి 'ప్రజాశక్తి'తో తెలిపారు. అభ్యర్థులు వారి వివరాలతో వెబ్‌సైట్ ద్వారా లేఖ పంపితే పరిశీలిస్తామని చెప్పారు.

నాకు 'ఖైదీ' ఎలాంటిదో చరణ్‌కి 'రంగస్థలం' అలాంటిది

చిరంజీవి



ఆది పినిశెట్టి, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్, చిరంజీవి, రామ్ చరణ్, సమంత, దేవిశ్రీప్రసాద్, సుకుమార్, చంద్రబోస్, అనసూయ తదితరులు



'రంగస్థలం'లో రంగమ్మ అత్తగా అనసూయ

ప్రజాశక్తి– విశాఖపట్నం

'ప్యూర్ విలేజ్ నేపథ్యంలో తెరకెక్కిన సినిమా ఇది. తను నాకు చెప్పినప్పుడు ఎలాచెప్పాడో.. అంతే ప్యూర్‌గా ఈ రోజు ఎమోషనల్‌గా సినిమాను తెరకెక్కించాడు. ఫస్ట్ సీన్ నుండి లాస్ట్ సీన్ వరకు ప్రేక్షకులను సినిమా కట్టి పడేస్తుంది. సినిమాను నేను ఎంజాయ్ చేసి చూశాను. ప్రేక్షకులందరినీ అలరించే సినిమా అవుతుంది. నాకు ఖైదీ సినిమా ఎలాగో.. రామ్‌చరణ్‌కి ఇది స్టార్‌స్టేటస్‌ను పెంచే సినిమా అవుతుంది. తను పెర్ఫామర్‌గా ఎదిగే సినిమా అవుతుంది. సుకుమార్.. చరణ్‌తో ఇంత మంచి సినిమా చేసినందుకు ఆర్టిస్ట్‌గా ఈర్ష్య పడుతున్నాను. ఓ తండ్రిగా గర్వపడుతున్నాను' అని చిరంజీవి అన్నారు. రామ్ చరణ్, సమంత హీరో హీరోయిన్లుగా నటించిన 'రంగస్థలం' చిత్రం ప్రీరిలీజ్ వేడుక వైజాగ్‌లో నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ ' వైజాగ్ నగరాన్ని, ఇక్కడి అభిమానుల్ని చూస్తుంటే నేను ప్రారంభంలో చేసిన ఆరాధన, అభిలాష, ఘరానామొగుడు సినిమాలు గుర్తుకు వస్తున్నాయి. అప్పట్లో బంగారు భవిష్యత్ గురించి ఆలోచించుకుంటూ వైజాగ్ అంతటా తిరిగిన రోజులు గుర్తుకు వస్తున్నాయి. రేపు రిటైర్డ్ అయిన తర్వాత వైజాగ్‌లోనే ఉండాలనిపిస్తుంది. సుకుమార్ గ్రామంలో పుట్టి పెరగడం వల్ల ఎమోషన్స్ మిస్ కాకుండా చక్కగా తీశాడు. సినిమాలో ఓ కన్విక్షన్‌తో నేచురల్‌గా సాంగ్స్‌ను తెరకెక్కించాడు. హీరో క్యారెక్టర్‌ను డీ గ్లామరైజ్ చేయించి ..చరణ్‌కెరీర్‌లో ఓ తలమానికమైన సినిమాను చేసిన సుకుమార్‌కి నా అభినందనలు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేఖ,రామ్ చరణ్, ఉపాసన, సమంత, పూజా హెగ్డే, ఆది పినిశెట్టి, సుకుమార్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, సి.వి.ఎం(మోహన్), రామ్ లక్ష్మణ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

భారీ సెట్‌లో సంప్రదాయ గీతం



'భరత్ అనే నేను'లో మహేశ్ బాబు

మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా 'భరత్ అనే నేను'. కైరా అద్వాని కథానాయిక. డి.పార్వతి సమర్పణ. డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 20న విడుదల చేస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్రంలో మహేష్ సాంప్రదాయ లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. మహేష్ మొదటిసారి పంచె కట్టుతో కనిపించడం ఆశ్చర్యాన్ని కలిగిలించింది. ఈ లుక్‌కు విశేషమైన స్పందన లభిస్తుందని నిర్మాత దానయ్య పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన టీజర్ రికార్డు స్థాయి వ్యూస్ సాధించింది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించి ఓ పాట రాజు సుందరం నేతృత్వంలో చిత్రీకరణ జరుగుతోంది. భారీ టెంపుల్ సెట్‌లో 100 డాన్సర్లు, 1000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో చాలా గ్రాండ్ లెవల్‌లో ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈనెల 25 నుంచి స్పెయిన్‌లో షెడ్యూల్ ఉంటుంది' అని తెలిపారు.


కల్యాణ్ రామ్ కొత్త చిత్రం



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ త్వరలో ఒక చిత్రాన్ని ప్రారంభించనుంది. ప్రముఖ నిర్మాత 'జెమినీ' కిరణ్ నిర్మించనున్న ఈ చిత్రానికి 'ఉయ్యాలా జంపాల, మజ్ను' ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సంవత్సరం ద్వితీయ భాగంలో ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్తుందని నిర్మాణ సంస్థ తెలిపింది. చక్కటి కుటుంబ కథా నేపథ్యం ఉన్న కథను విరించి వర్మ సిద్ధం చేసుకున్నాడని నిర్మాత కిరణ్ తెలిపారు. ప్రస్తుతం కల్యాణ్ రామ్ 'ఎంఎల్‌ఏ' సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నవ్వుకునే 'నర్తనశాల'

'ఛలో' చిత్రంతో విజయం అందుకున్న నాగశౌర్య ఇప్పుడు అదే ఐరా క్రియేషన్స్‌పై మరో చిత్రం చేస్తున్నాడు. దానికి 'ఎట్‌ది రేట్ ఆఫ్ నర్తనశాల'అని నామకరణ చేశారు. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. వంశీ పైడి పల్లి హీరో నాగశౌర్యపై క్లాప్ కొట్టారు. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. కష్ణవంశీ దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. నరేష్, జయప్రకాష్ రెడ్డి, అజయ్, పోసాని కృష్ణ మురళి, సత్యం రాజేష్, వెన్నెల కిషోర్, గుండు సుదర్శన్, జెమిని సురేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా నాగశౌర్య మాట్లాడుతూ 'ఈ సినిమా తర్వాత చక్రవర్తి కచ్చితంగా పెద్ద దర్శకుడు అవుతారు. మా సంస్థ నుంచి మరో కొత్త డైరెక్టర్‌ను పరిచయం చేస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ చిత్రం డ్యాన్స్ బేస్డ్ చిత్రం అని, పాత నర్తనశాల రీమేక్ అని చాలా మంది అనుకుంటున్నారు. కానే కాదు. ఇది ఫుల్ ఎంటర్‌టైనర్. నవ్వుకునే చిత్రం. హీరోయిన్స్ ఇంకా ఫైనల్ కాలేదు. ఇక 'చూసి చూడంగానే' సాంగ్‌తో 'ఛలో' చిత్రానికి సూపర్బ్ సాంగ్ ఇచ్చిన మహతి మరోసారి అంతకంటే అద్భుతమైన పాటలిస్తాడని భావిస్తున్నాన'ని అన్నారు.



నాగశౌర్య

పాటలన్నీ వచ్చేశాయ్



నితిన్, మేఘా ఆకాశ్

నితిన్, కథానాయిక మేఘా ఆకాష్‌తో కలసి నటించిన చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. ఈ సినిమా ఆల్బమ్‌ని యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఈ చిత్రానికి కృష్ణ చైతన్య దర్శకత్వం వహించారు. నిఖితా రెడ్డి సమర్పణ. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇంతకు ముందు విడుదలైన మూడు పాటలులాగానే ఆల్బమ్‌లో కొత్తగా విడుదలైన మిగతా మూడు పాటలు వివిధమైన శైలిలో ఉన్నాయి. మాస్ నుంచి క్లాస్ వరకు, ప్రేమ నుంచి విరహం వరకు , సంతోషం నుంచి బాధ వరకు, అనింటిని ఎంతో బాగా స్వరపరిచి ఒక పూర్తిస్థాయి ఆల్బమ్ ఇచ్చారు థమన్. యు.ఎస్, ఊటీ, హైదరాబాద్‌లో వంటి ప్రదేశాలలో ఈ చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రానికి ఎన్.నటరాజన్ సుబ్రహ్మణ్యన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు ప్రకటించారు.

'సుబ్రహ్మణ్యపురం'లో మిస్టరీ!



నాగ చైతన్య, ఇషా, సుమంత్

'మళ్ళీ రావా' చిత్రంతో విజయాన్ని అందుకున్న సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సుబ్రహ్మణ్యపురం'. చిత్రీకరణ హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. టారస్ సినీ కార్ప్ పతాకంపై ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈషా కథానాయిక. పూజా కార్యక్రమాల అనంతరం సుమంత్, ఈషాపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు నాగచైతన్య క్లాప్‌నివ్వగా, దర్శకుడు ప్రశాంత్‌వర్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి దర్శకుడు చందూ మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర లోగోను ఏపీ ఎంపీ జె.సి. దివాకర్‌రెడ్డి, కథానాయకుడు రాజశేఖర్, జీవిత సంయుక్తంగా ఆవిష్కరించారు.

అనంతరం సుమంత్ మాట్లాడుతూ ' ఇది నాకు 25వ సినిమా దర్శకుడు సంతోష్ రెండున్నర గంటల పాటు కథ వినిపించారు. అందులోనే సినిమా మొత్తం చూపించారు. సూపర్ నాచురల్ అంశాల మేళవింపుతో సాగే మిస్టరీ థ్రిల్లర్ ఇది. ఈ జోనర్‌లో నేను సినిమా చేయడం ఇదే తొలిసారి. నాకు ఈ తరహా కథాంశాలతో సినిమాలు చేయడమంటే చాలా భయం. కానీ కథ నచ్చి ఈ సినిమాను అంగీకరించారు. కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠతతో ఎదురుచూశాను. ఆ అనుభూతి ప్రేక్షకులకు కలిగిస్తుంది' అని తెలిపారు.

పబ్లిసిటీ ఖర్చుతో సినిమా చేసేస్తాం

\- శ్రీవిష్ణు



"పెద్ద సినిమాల పబ్లిసిటీకి అయ్యే ఖర్చుతో మా సినిమాలు చేసేస్తాం. నా సినిమా ఫస్ట్ లుక్ వదిలినప్పటి నుంచి నాకు మీడియా సపోర్ట్ చేస్తుంది. నాకే కాదు.. చిన్న సినిమాలకు ప్రమోషన్ అన్నేసి కోట్లు పెట్టి చేయలేం. ప్యాషన్‌తో చేసే చిన్న సినిమాలను జనాలకు రీచ్ చేసేది మీడియానే. మమ్మల్ని మీడియామిత్రులే జనాల్లోకి తీసుకెళ్తారు. ప్లాట్ దొరికినప్పుడే సినిమా విడుదల చేయడం హ్యాపీ. అంతేగానీ మీనమేషాలు లెక్కించకూడదు" అని హీరో శ్రీవిష్ణు అన్నాడు. ఆయన తాజాగా చేసిన 'నీదీ నాదీ ఒకే కథ' ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడాడు.

ఈ చిత్రంలో నాది డ్యూయల్ రోల్ కాదు. కాకపోతే సినిమాను చూసే ప్రేక్షకుడు మాత్రం డ్యూయల్ రోల్ కింద ఫీలవుతారు. ఎందుకంటే తెరముందు అతను, తెరమీద నేను అన్నమాట. అలా ప్రేక్షకులు డ్యూయల్ రోల్ ఫీలవుతారు. స్టూడెంట్ లైఫ్‌ని, స్ట్రగుల్‌ను చూపించాం. నేనైతే ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కో లేదు. నాకు చదువు పూర్తయ్యాక ఏం చేయాలో క్లారిటీ ఉంది. అందువల్ల నేను బీబీఎం చదివా. ఇంటర్ తర్వాతే నేను సినిమాల్లోకి రావాలని అనుకున్నా.

చిత్రసీమను ఊహించుకున్నా

చదువుకునే రోజుల్లో స్ట్రగుల్ లేదుకాబట్టి, ఇండస్ట్రీ తొలినాళ్లని ఊహించుకున్నాను. ఉదాహరణకి చెప్పుకోవాలంటే ఇంటర్ అయ్యాక ఇంజనీరింగ్ చేయకపోతే పిల్లను ఇవ్వరనో, పిల్లాడు దొరకడనో చాలా మంది ఇంజినీరింగ్ చదువుతారు. సొసైటీ కూడా ఇంజినీరింగ్ చదివేవారిని ఒక రకంగా చూస్తుంది. డిగ్రీ చదివేవాళ్లని ఇంకో రకంగా చూస్తుంది. చచ్చీచెడి ఇంజినీరింగ్ పాస్ అయినా, నచ్చింది చేయలేకపోయామనే బాధతో ప్రతి రోజూ దాన్ని తలచుకుని బాధపడే వాళ్లు చాలా మందే ఉంటున్నారు. వాళ్లు జీవితంలో 80 శాతం శాటిస్‌ఫైడ్‌గా ఉండరు. అది తప్పు అంటాను. మనం ఏం కావాలనుకుంటున్నామో ముందు మనకొక క్లారిటీ ఉంటే, దాన్ని గట్టిగా పేరెంట్స్ దగ్గర చెప్పవచ్చు. కొన్నిసార్లు మనం అనుకున్నది త్వరగా సాధించగలం. కొన్నిసార్లు కాస్త ఆలస్యమవుతుంది. అయినా నచ్చిందే చేస్తున్నామనే తృప్తి ఉంటుంది. స్టోరీ లైన్ అదే. జీవితంలో కీలక సమయాల్లో సొసైటీ గురించి ఆలోచిస్తాం. కానీ సొసైటీ మనకేమైనా చేస్తుందా అంటే చేయదు. అందుకే అన్ని సందర్భాల్లోనూ సొసైటీ గురించి ఆలోచించి, ఇష్టాయిష్టాలను చంపేసుకోవాల్సిన అవసరం లేదు అని చెబుతున్నాం.

కొత్త దర్శకుల్లో ప్యాషన్ ఉంటుంది

కొత్త దర్శకుల్లో చాలా ప్యాషన్ ఉంటుంది. నా బడ్జెట్ కథలకి తగ్గట్టు ఉంటారు. నాకు కంఫర్ట్ గా ఉంటుంది. పెద్ద దర్శకులతో చేయకూడదనేం లేదండీ. ఈ సినిమా మొదలుపెట్టి కాస్త షూటింగ్ పూర్తయ్యాక, మధ్యలో మా 'మెంటల్ మదిలో' చేశాం. పెళ్లిచూపులు డేట్‌కి ఆ చిత్రాన్ని రిలీజ్ చేద్దామన్నారు. అప్పటికి కుదరలేదు. అంతలో ఆ చిత్రాన్ని సురేశ్‌బాబు సినిమా తీసుకున్నారు. అది ఐదు నెలలు ఆయన దగ్గరుంది. ఆ సమయంలో దీన్ని రిలీజ్ చేయడం బావుండదు కాబట్టి కాస్త ఆగాం.

డోగ్మే 95 టెక్నిక్‌ని వాడాం

జీరో బడ్జెట్‌తో సినిమా చేయడం ఎలా అనేది అందులో మెయిన్. చాలా మంది దీన్ని ఫాలో అయి సినిమాలు చేస్తారు. ట్రాలీలు, జిమ్మీలు, సెట్‌లు వంటివి ఉండవు. ఒక్క సింక్ సౌండ్ మాత్రం మేం మిస్ అయ్యాం. అది కూడా ఎందుకు చేయలేకపోయామంటే మా షూటింగ్ ఎక్కువగా ఔట్‌సైడ్ ఉంటుంది. అందుకే కుదరలేదు. ఒకప్పటి రెవల్యూషన్ ఇది. డోగ్మే టెక్నిక్‌తో మలయాళంలో ఓ కంప్లీట్ సినిమా చేశారు. కానీ అది విడుదల కాలేదు. ఇప్పటివరకు ఆ టెక్నిక్‌తో రిలీజ్ అయ్యేది మా సినిమానే. మేం సినిమా చూసుకున్నాం. చాలా హ్యాపీ. యాస్పయిరింగ్ ఫిల్మ్ మేకర్స్ కూడా చేశారు. ఇందులో ట్రాలీ లేకుండా ట్రాలీలాంటి షాట్‌లు చేశాం. సినిమాలో 13–14 సింగిల్ షాట్స్ కింద చేశాం. రెండు సీక్వెన్స్ లు 6 మినిట్స్ ప్లస్ ఉన్నాయి. నేను ఈ సినిమాకు రిహార్సల్స్ చేయలేదు. ఈ సినిమా షూటింగ్‌కి ముందు రెండు నెలలు నేను, డైరక్టర్ కలిసే తిరిగాం. రెగ్యులర్ ఫిల్మ్ మేకింగ్‌గా ఇది జరగలేదు లేదు. అది సినిమా చూసినప్పుడు కచ్చితంగా గుర్తిస్తారు.

సినిమా అంతా మిడిల్ క్లాస్ తరహాలోనే

రూరల్ ప్లేస్‌లో జరిగిన స్టోరీ కాబట్టి, మిడిల్ క్లాస్ తరహాలోనే ఉంటుంది. చాలా నేచురల్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో దేవి ప్రసాద్ ఫాదర్ రోల్ చేశారు. ఓవరాల్ గా ఆయన బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. మామూలుగా సినిమా మొదలయ్యాక హీరో రోల్‌తో ఎక్కువ కనెక్ట్ అవుతాం. ఈ సినిమాలో యంగ్ స్టర్స్ హీరోతో కనెక్ట్ అవుతారు. పేరెంట్స్ ఆయనతో కనెక్ట్ అవుతారు. సెట్లో మాతో నటుడిగలా కలిసిపోయారు. ఆయన పాత్ర చూసి థ్రిల్ అయ్యారు. ఒక ఫీల్డ్ లో ఉన్నవారు థ్రిల్ కావడం గొప్ప.

బృందావనమది....



జస్ట్ ఎంటర్ టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ వంగల, ప్రభాకర్ రెడ్డి కూతురు నిర్మాతలుగా రూపొందుతోన్న సినిమా 'బృందావనమది అందరిది'. రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. వైజాగ్ సాగర తీరంలో వేయించిన హీరోయిన్ హోమ్ సెట్ సన్నివేశాలు, వైజాగ్ పరిసర ప్రాంతాలలో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తయింది. ఈ సందర్భంగా షూటింగ్‌లో రూపొందించిన వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్1 నుండి బెంగళూర్ లో ఏడు రోజులు, హైదరాబాద్‌లో మిగిలిన షెడ్యూల్స్ షూటింగ్ ఉండనుందని దర్శకుడు శ్రీధర్ సీపాన తెలిపారు.

'శబ్ధం' ... ఆయుధం



రోహిత్

నారా రోహిత్ హీరోగా 'శబ్ధం' చిత్రం ప్రారంభమైంది."హిజ్ సైలెన్స్ హీజ్ వెపన్" అనే ఉపశీర్షిక. పి.బి.మంజునాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మిస్తున్నారు. అమరావతిలో చిత్రం షూటింగ్ లాంఛనంగా మొదలైంది. నారా రోహిత్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరా శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు క్లాప్ కొట్టగా, పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. పి.బి.మంజునాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. పుల్లారావు, శ్రీధర్ కలిసి దర్శకుడు పి.బి.మంజునాథ్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. ఈ చిత్రంలో రోహిత్ మూగవాడిగా కనిపించే అవకాశం ఉన్నట్టు సమాచారం. నారా రోహిత్ మాట్లాడుతూ ' అమరావతిలోనే నా సినిమా ఆడియో విడుదల వేడుక కూడా నిర్వహిస్తాం. ఏప్రిల్ చివరి వారం నుంచి వైజాగ్, కాకినాడ, హైద్రాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంద'ని చెప్పారు.

ఇదో కొత్త 'జంబ లకిడి పంబ'



'జంబ లకిడి పంబ' లోగో ఆవిష్కరిస్తున్న అల్లరి నరేశ్

శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి ఇద్నాని హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న సినిమా 'జంబలకిడి పంబ'. శివం సెల్యూలాయిడ్స్, మెయిన్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రూపొందుతోంది. జె.బి.మురళీ కృష్ణ దర్శకత్వం. రవి, జో జో జోస్, శ్రీనివాస్ రెడ్డి.ఎన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా లోగోను అల్లరి నరేశ్ ఆయన స్వగృహంలో విడుదల చేశారు.

దర్శకుడు జె.బి.మురళీ కృష్ణ మాట్లాడుతూ 'జంబ లకిడి పంబ' అనే పదానికి అర్థం లేదు. కానీ అదే టైటిల్‌గా పెట్టిన ఈ సినిమాతో ఈవీవీగారు కామెడీలో కొత్త కోణాన్ని చూపారు. అప్పటి సినిమాకు ఇప్పుడు మేం చేసిన సినిమాకు సంబంధం లేదు. కథకు సూట్ అవుతుందనిపించి ఈ టైటిల్‌ను పెట్టాం. ఈవీవీగారి మ్యాజిక్‌ను మళ్లీ మా సినిమమా క్రియేట్ చేస్తుందని చెప్పలేను. అలాగే ఆ రేంజ్‌ని రీచ్ అవుతామని చెప్పలేం. అది అసాధ్యమని కూడా తెలుసు. అయితే ఆ సినిమా గౌరవాన్ని తగ్గించమని చెబుతున్నాం. ప్రస్తుతం సినిమా హైదరాబాద్ పరిసరాల ప్రాంతాల్లో చిత్రీకరణను జరుపుకుంటోందని అన్నారు.

మే 9న 'మహానటి'

సావిత్రి జీవిత కథా చిత్రం 'మహానటి'. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. కీర్తి సురేష్ టైటిల్ రోల్ పోషిస్తుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రియాంక దత్ నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం ఇప్పుడు విడుదల తేదీ ఖరారు చేశారు. మే 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు నిర్మాత తెలిపారు. 1990 మే 9న... వైజయంతీ మూవీస్ సంస్థ నుంచి వచ్చిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' టాలీవుడ్ రికార్డుల్ని తిరగరాస్తూ కొత్త చరిత్ర సృష్టించింది. సరిగ్గా అదే రోజున ఈ సినిమా విడుదల అవుతుండడం విశేషం. టాలీవుడ్‌లోని ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు ఇది వరకు చూడని వినోదాన్ని పంచివ్వబోతోంది. మహానటి సావిత్రి కథని వెండి తెరపై దర్శకుడు ఆవిష్కరించిన తీరు.. తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా చిలిచిపోయేలా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. సంగీతం: మిక్కీ జె.మేయర్, కళా దర్శకుడు: అవినాష్, ఛాయాగ్రహణం: ధని, నిర్మాత: ప్రియాంకా దత్.



కీర్తి సురేశ్, దుల్కర్ సల్మాన్





అత్యంత ప్రమాదకర వ్యాధుల్లో ఒకటైన క్షయ వ్యాధి (టి.బి) పురుషుల కన్నా మహిళల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ప్రపంచంలోనే పెద్ద సంఖ్యలో టిబి, ఎండిఆర్ టిబి రోగులకు భారత్ నిలయంగా మారింది. ఈ వ్యాధి అన్ని వర్గాల వారికీ వచ్చే అవకాశమున్నా ముఖ్యంగా మహిళల మెడపై కత్తిలా మారుతోంది. పేదరికం, పౌష్టికాహారలోపం క్షయ ప్రబలటానికి అవకాశమిస్తున్నాయి. తీవ్ర స్థాయిలో ఉన్న సామాజిక అసమానతలు కూడా ఈ వ్యాధికి కారణమౌతున్నాయి.




టిబి బాధిత మహిళలకు కుటుంబ మద్దతు, మానసిక స్వస్థత కరవవుతోంది. ఈ వ్యాధి ఎలా సోకుతుంది? లక్షణాలు, ఎలాంటి చికిత్సలు పొందాలి? తదితర విశేషాలు ఈనెల 24న ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం సందర్భంగా ఈవారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో తెలుసుకుందాం!

మహిళల ఆరోగ్య 'క్షయ'ం

ప్రపంచంలో భారతదేశంలోనే టిబి, ఎండిఆర్ టిబి రోగులు అధికసంఖ్యలో ఉన్నారన్న నమ్మలేని నిజాలను ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికలు చెబుతున్నాయి. గతంలో ప్రతీ మూడు నిమిషాలకు ఇద్దరు టిబి రోగులు మరణించగా, ప్రస్తుతం ప్రతి రెండు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారు. కానీ, మరోవైపు, ఒక లక్ష జనాభాకు కొత్త టిబి కేసుల సంఖ్య కూడా పెరుగుతున్నట్లు నిపుణులు గుర్తిస్తున్నారు.

క్షయ రోగుల్లో అధిక సంఖ్యలో మహిళలే ఉన్నారన్న వాస్తవాన్ని తీవ్రంగా పరిగణించి, మహిళల దృష్టికోణంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించాలి. ప్రత్యేకించి, తక్కువ రోగనిరోధక శక్తి ఉండే స్త్రీలు క్షయవ్యాధి బారినపడితే మరింత ప్రమాదకరం. 15 నుంచి 49 సంవత్సరాల వయసు మహిళల్లో రక్తహీనత అధిక మొత్తంలో ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 36శాతం స్త్రీలు చాలాకాలంగా పౌష్టికాహారం లోపంతో బాధపడుతుండగా, 55 శాతం మంది రక్తహీనతకు గురవుతున్నారు. వివాహిత మహిళల్లో సగానికి పైగా రక్తహీనతతో బాధపడుతుండగా, మూడింట ఒక వంతు పౌష్టికాహారలోపంతో బాధ పడుతున్నట్లు సర్వే స్పష్టం చేస్తోంది.





ఎలా వస్తుంది?

మనిషి ఆరోగ్యాన్ని శరవేగంగా హరించే వ్యాధి కావడంతో దీనిని 'క్షయవ్యాధి' అంటారు. ఇది 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ (ఎం.టి.బి) అనే బ్యాక్టీరియా వలన వచ్చే అంటువ్యాధి. ఈ క్షయ క్రిములు ముఖ్యంగా ఊపిరితిత్తులలో ప్రవేశించి శ్వాసకోశ క్షయవ్యాధిని కలిగిస్తాయి. ఈ శ్వాసకోశ క్షయ చాలా తీవ్రమైన అంటువ్యాధి. దీనితో బాధపడేవారే ఎక్కువమంది ఉంటారు. అయితే శరీరంలోని ఇతర భాగాలకి కూడా క్షయ వ్యాధి వచ్చే అవకాశాలున్నాయి. శ్వాసకోశంతో సంబంధం లేని ఉదరకోశం, ఎముకలు, కీళ్ళు, లింపు గ్రంథులు, మెదడు పొరలు, మూత్ర పిండాలు, గర్భకోశం, గర్భాశయం వంటి వాటికి కూడా అప్పుడప్పుడూ క్షయ వ్యాధి సోకుతుంది.

వ్యాప్తి ఇలా

క్షయ అంటువ్యాధి. ఇది స్త్రీ, పురుషులకు ఏ వయసులోనైనా, ఎవరికైనా సోకవచ్చు. జనాభాలో 40 శాతం మందికి పెద్ద వయసు వచ్చేసరికి క్షయ వ్యాధి సోకుతుంది. అయితే వీరిలోని రోగనిరోధక శక్తి వల్ల అది వ్యాధిగా మారదు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించనివారికి వేగంగా ఈ వ్యాధి సోకుతుంది. క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయి. వ్యాధితో బాధపడేవారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, చీదినప్పుడు, మాట్లాడినప్పుడు, ఉమ్మినప్పుడు వ్యాధి కారక సూక్ష్మజీవులు ఆరోగ్యవంతులకు గాలి ద్వారా సోకుతాయి. దగ్గినపుడు, రోగి ఊపిరితిత్తుల నుండి వచ్చే కఫం ద్వారా ఈ బాక్టీరియా గాలిలో చేరి, దగ్గరలో ఉన్న ఆరోగ్యవంతమైన మనిషి పీల్చే గాలితోపాటు వారి ఊపిరితిత్తులలోనికి ప్రవేశించి జబ్బుకి పునాది వేస్తుంది. క్షయ వ్యాధి సోకిన వ్యక్తి తగిన చికిత్స తీసుకోకపోతే రోగి ద్వారా సగటున ఏడాదిలో 10 నుంచి 15 మందికి ఇది సోకుతుంది. ఇటీవలి కాలంలో క్షయ కారక బ్యాక్టీరియా మరింత వృద్ధిచెందుతోందని వైద్య పరిశోధనల్లో వెలుగు చూడడం కాస్తా ఆందోళన కలిగించే అంశం.

లక్షణాలు

రోగిలో క్షయ వ్యాధి లక్షణాలు స్పష్టంగా కన్పిస్తాయి

- మూడు వారాలకి పైగా తీవ్రమైన దగ్గు ఉంటుంది, దానితో కఫం పడుతుంది.
- కొన్ని సార్లు వ్యాధి బాగా ముదిరిపోతే దగ్గు కఫంతో పాటు రక్తం పడుతుంది
- సాయంత్రం, రాత్రి సమయాల్లో జ్వరం వస్తుంది.
- బరువు బాగా తగ్గిపోతు ంది. ఆకలి కూడా మందగిస్తుంది. ఆహారంపై అయిష్టత పెరుగుతుం ది.
- హెచ్ఐవీ ఉన్నవారికి అతి వేగంగా ఈ వ్యాధి సోకుతుం ది.

నిర్ధారణ

కఫం (కళ్లె)పరీక్ష, రక్త పరీక్షలు, మూత్ర పరీక్ష, ఛాతీని ఎక్స్ రే తీయడం వంటి పరీక్షల ద్వారా ఊపిరి తిత్తులు ఎంతవరకు ఈ వ్యాధికి గురయ్యాయో పరిశీలిస్తారు. వాటి వల్ల కూడా సక్రమంగా వ్యాధి నిర్ధారణ కాకకపోతే అత్యాధునిక ఎక్స్‌పర్ట్ ఎంటీబీ/ఆర్ఐఎఫ్ తదితర పరీక్షలు చేసి నిర్ధారిస్తారు.

చికిత్స

శరీరంలో క్షయ వ్యాధి ఏ భాగంలో ఉన్నా చికిత్సా విధానం మాత్రం ఒకటే. రిఫాంపిసిన్, ఐసోనెక్స్, ఇతాంబ్యుటాల్ వంటి మందులతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. ఈ వ్యాధికి కనీసం ఆరు నెలలు క్రమం తప్పకుండా వైద్య సలహాపై మందులు వాడాలి. మందులు వాడటం మొదలుపెట్టిన నెల రోజుల్లో రోగికి చాలా వరకూ ఉపశమనం కలుగుతుంది. కానీ క్షయ క్రిములు నాశనం కావు, అందువల్ల ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు తప్పనిసరిగా మందులు వాడాలి. చికిత్స మొదలుపెట్టిన నెలరోజులకే ఈ వ్యాధి తగ్గిపోయిందని చాలా మంది మందులు వాడటం మానేస్తుంటారు. ఇటువంటి వారికి వ్యాధి తిరిగి ఆరంభమవుతుంది. క్షయ వ్యాధి సోకిందని తెలియగానే 'డాట్స్' చికిత్స తీసుకోవాలి. డాట్ ప్రొవైడర్ స్వయంగా మందులు రోగితో మింగిస్తారు. పిల్లలకు ఈవ్యాధి రాకుండా నివారించడానికి బిసిజి టీకా ఉంది. పిల్లలకు వీలున్నంత వేగంగా ఈ టీకా ఇప్పించాలి.





నివారణ

క్షయ రోగులు తమకు తాము వ్యాధిని తగ్గించుకోవడానికి, ఇతరులకు సంక్రమించకుండా చూడడానికి తగిన నివారణా చర్యలు తీసుకోవాలి.

- దగ్గినప్పుడు, తుమ్మిన ప్పుడు చేతి రుమాలు అడ్డంగా పెట్టుకోవాలి.
- దగ్గినపుడు వచ్చే కఫం ఒక పాత్రలోనికి పట్టి కాల్చివేయాలి.
- ఎక్కడ పడితే అక్కడ ఉమ్మకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతతోపాటు ఇళ్లలో గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలి.
- మంచి పోషకాహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి.

గర్భాశయ క్షయతో సంతానలేమి

- డాక్టర్ ఎం.రవీంద్రనాథ్
ఎం.డి, ఎఫ్.సి.సి.పి
పల్మనాలజిస్ట్
ఆంధ్రా హాస్పటల్స్ - విజయవాడ.



సంతానలేమి సమస్యతో బాధపడే మహిళల్లో చాలా మందికి గర్భాశయానికి సోకిన క్షయ వ్యాధి కారణమౌతుండడం ఆందోళన కల్గించే అంశం. సాధారణంగా క్షయవ్యాధి శరీరంలోని ప్రధాన భాగాలైన ఊపిరితిత్తులపై అధిక ప్రభావాన్ని చూపిస్తుంది. కొన్నిసార్లు ఈ బ్యాక్టీరియా రక్తం ద్వారా ఇతర అవయవాలకు, పునరుత్పత్తి అవయవాల వరకు ప్రయాణిస్తుంది. దీంతో ఫెలోపియన్ నాళాలు, గర్భాశయం, గర్భాశయ పొరలకు ఇన్ఫెక్షన్ ఏర్పడుతోంది. జననాంగాలలో, ఈ బ్యాక్టీరియా గుప్త భాగాలలో ఎక్కువగా ఉంటుంది. ఇలా దీని ఉనికి కొన్నిసార్లు 20 సంవత్సరాలు గడిచాక కూడా ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించకపోవచ్చు.

గర్భాశయ క్షయ లక్షణాలు

అపక్రమ రుతుస్రావం, కటి వలయంలో నొప్పి మొదలైనవి దీని ముఖ్య లక్షణాలు. కొన్నిసార్లు నిరంతరంగా రక్తంతో కూడిన లేదా దుర్గంధమైన వాసనతో రక్తం లేకుండా ఉన్నటువంటి స్రావాలు వెలువడతాయి. ఈ వ్యాధికి గురైన అనేకమంది మహిళలు లైంగిక చర్య తరువాత రక్తస్రావం జరుగుతున్న అనుభవాన్ని పొందుతారు.

గర్భ విచ్ఛిత్తికి కారణం

గర్భాశయంలో క్షయవ్యాధి ఇన్ఫెక్షన్ వల్ల పది మంది మహిళల్లో ఇద్దరు సంతానలేమి సమస్యకు గురవుతున్నారు. తీవ్రమైన సందర్భాల్లో గర్భాశయంలోని పొర సన్నగా మారి, పిండం ప్రవేశం భరించలేకపోతుంది ఫలితంగా గర్భస్రావం జరుగుతుంది.



తొలిదశలోనే గుర్తిస్తే

సాధారణంగా గర్భాశయ క్షయని 15 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలలో గుర్తించాలి. ఇది మహిళలు ఆరోగ్యకరమైన గర్భం కోసం ఎదురుచూసే సరైన సమయం. మొదట్లోనే ఈ వ్యాధిని గుర్తించి, సమయానికి సరైన ప్రామాణిక చికిత్సను అందించినట్లయితే సమస్యని పరిష్కరించవచ్చు. రోగి 6 నుండి 9 నెలల వరకు మందులు పూర్తిగా వాడితే గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి. ఒకసారి ఒక మహిళ గర్భం ధరించగానే ఆరోగ్యకరమైన పిండం, అవయవాల సరైన అభివృద్ధిని నిర్ధారించుకోవడానికి క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదిస్తుండాలి.

చాలాసార్లు గర్భస్రావాలు జరిగిన కొంతమంది మహిళలకు ప్రత్యేకంగా మొదటి మూడు నెలల్లో పిండం గర్భాశయంలోని పొరలో సరైన విధంగా అంటిపెట్టుకొనేటంత వరకు శారీరక కార్యకలాపాలను తక్కువగా లేదా అసలు చేయకూడదని సూచిస్తారు. గర్భాశయ క్షయవ్యాధి చికిత్స అనంతరం ఆరోగ్యకరమైన గర్భం కోసం మందులు వాడుతూ డాక్టర్ సలహాలను చాలా కఠినంగా పాటించాలి.



చిన్నారి



జోక్:

రాము: ఒరేయ్ సోమూ! మీస్కూళ్ళో.. నువ్వెప్పుడూ ఫస్టేనంట కదా?!

సోము : అవును.. నేను అందరికంటే.. ముందే స్కూల్‌కెళుతుంటా!

పొడుపు కథ

సజాతి ధ్రువాలు వికర్షించు
విజాతి ధ్రువాలు ఆకర్షించు
ఇనుమంటే ఇష్టం హెచ్చు
అభివృద్ధిలో పనికొచ్చు?

జవాబు : అయస్కాంతం

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలోని చుక్కలను కలిపి రంగులు వేయండి!

అదరహో..ఉల్లిపాయల పండగ



పిల్లలూ..! మీకు ఉల్లిపాయలు తెలుసు కదా! వాటిని కట్‌చేస్తే కళ్లకు నీళ్లు రావడం మీరు గమనించే ఉంటారు. అలాంటి ఉల్లికి కూడా ఒక రోజు ఉందట. స్విట్జర్లాండ్ రాజధాని బెర్న్ నగరంలో ప్రతి సంవత్సరం నవంబర్ చివరి సోమవారం 'జిబెలి మారిట్ ఫెస్టివల్ (ఆనియన్‌ఫెస్ట్)ను ఘనంగా జరుపుతారు. ఆ రోజు స్థానికులు ఉల్లిని పోలిన దుస్తులు ధరించి సందడి చేస్తారట. ఈ వేడుకలు దాదాపు 150 సంవత్సరాల క్రితమే ప్రారంభమయ్యాయని స్థానికులు చెబుతారు. ఉల్లిపాయలను అందమైన అమ్మాయిల్లా, బుజ్జి బుజ్జి పాపాయిల్లా, గుబురు మీసాల ఆజానుబాహుడిలా, రకరకాల విభిన్న రూపాల్లో ఆ రోజు భలేభలేగా ముస్తాబు చేస్తారు. రైతులు, వ్యాపారులు తెల్లవారుజామున నాలుగు గంటలకే ఉల్లిపాయల్ని ప్రదర్శనకు ఉంచుతారు. మార్కెట్‌లో ఎటు చూసినా ఆకర్షణీయమైన ఉల్లిరూపాలే దర్శనమిస్తాయి. ఉల్లిపాయలతో పాటు అల్లం, వెన్న, జామ్, బ్రెడ్‌వంటివి మాత్రమే కనిపిస్తాయి. ఇతర కూరగాయలు, పండ్లు ఆ రోజు విక్రయించరు. స్విట్జర్లాండ్ నలుమూలల నుంచే కాకుండా ఫ్రాన్స్, అమెరికా, లండన్ దేశాల నుంచి ఎంతోమంది విదేశీయులు ఈ..ఆనియన్ ఫెస్టివల్‌ను చూడటానికి వస్తారు. పుష్పగుచ్చాల్లా ఉండే 'ఉల్లి బొకేలు' ఆనియన్ ఫెస్ట్‌లో అందరిని ఆకట్టుకుంటాయి. ఆనియన్ సూప్, ఆనియన్ సాస్ వంటి ప్రత్యేక ఉల్లిపాయ వంటలు సందర్శకులకు చవులూరిస్తాయి. ఆ ఒక్కరోజే దాదాపు 5 వేల టన్నుల ఉల్లిపాయలు అమ్ముడవుతాయని అంచనా. ★





నేను గీసిన బొమ్మ





కుందేటి దుర్గాప్రసాద్
7వ తరగతి
ఎమ్‌పియుపి స్కూల్, కెహెచ్ వాడ,
పాయకరావు పేట, విశాఖపట్టణం

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

ఒక్క సిక్స్‌తో హీరో...

దినేష్ కార్తీక్‌పై ప్రశంసల జల్లు



(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చివరిబంతిని సిక్స్‌గా మలిచిన టీమిండియా సీనియర్ వికెట్ కీపర్ దినేష్ కార్తీక్(డీకే) కోట్లాది భారతీయుల హృదయాల్లో ఒక్కసారిగా హీరో అయిపోయాడు. ఆ బంతిని సిక్స్‌గా మలచడమే కాకుండా భారతజట్టుకు నిదహాస్ ట్రోఫీని అందించి... అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నాడు. ఇలా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఆఖరి బంతిని సిక్స్‌గా మలిచి ట్రోఫీని అందించిన క్రికెటర్ల జాబితాలో అతడి పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది. గతంలో జావెద్ మియందాద్(పాకిస్థాన్), రియన్ మెక్‌లారెన్(దక్షిణా ఫ్రికా), నాథన్ మెక్‌కల్లమ్ (న్యూజిలాండ్), లాన్స్ క్లుసెనర్ (దక్షిణాఫ్రికా), శివనారాయణ్ చంద్రపాల్ (వెస్టిండీస్) అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టి ఆయా దేశాలకు ట్రోఫీలను అందించి రికార్డ్ సృష్టించారు. నేడు వీరి సరసన దినేష్ కార్తీక్ కూడా చేరిపోయాడు.

> ఒకే ఒక్క బాల్ చాలు ఫలితాన్ని తారుమారు చేయడానికి అనే విషయం ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నిరూపితమైంది. ఆ ఒక్క బాల్‌ను సిక్స్‌గా మలిచి కోట్లాది భారతీయుల హృదయాల్లో సుస్థానం సంపాదించాడు సీనియర్ వికెట్ కీపర్ దినేష్ కార్తీక్. ఆ సిక్సే కార్తీక్ వ్యక్తిగత జీవితంలోనూ ఒక మధురస్మృతిగా మిగిలిపోతుందనీ చెప్పవచ్చు...

నా జీవితంలో మరచిపోలేని రోజు : దినేష్ కార్తీక్

నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లో చివరి బంతిని సిక్స్‌గా మలిచిన దినేష్ కార్తీక్ ఆ సిక్స్ తన జీవితంలో మరచిపోలేనిదిగా తెలియజేశాడు. భారత్‌కు విజయాన్నందించిన టీమిండియా సీనియర్ వికెట్ కీపర్ తన జీవితంలో ఆ రాత్రిని ఓ అద్భుతమైన రాత్రిగా కూడా అభివర్ణించాడు. నిదహాస్ ట్రోఫీలో భాగంగా ఆది వారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దినేశ్ కార్తీక్ అద్భుత ప్రదర్శనతో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో కార్తీక్‌పై అటు క్రికెట్ దిగ్గజాలు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ నేపథ్యంలో కార్తీక్ 'బహుషా నా జీవితంలో ఇది ఓ గొప్ప రాత్రి. ఇలాంటి అవకాశం తన క్రికెట్ కెరీర్‌లో మరోసారి రాకపోవచ్చు' అని తెలియజేశాడు.

ప్యాడ్స్ కట్టుకోడా నికెళ్లా : రోహిత్‌శర్మ

ఉత్కంఠ రేపిన ఫైనల్ మ్యాచ్ చివరిబంతిని తాను ప్రత్యక్షంగా చూడలేక పోయానంటూ టీమిండియా సారథి రోహిత్‌శర్మ బాధపడ్డాడు. చివరి బంతికి సిక్స్ కొడితే గెలుస్తాం... ఫోర్ కొడితే మ్యాచ్ టై అవుతుంది... అప్పుడు మ్యాచ్ సూపర్‌ఓవర్‌కు వెళుతుంది. టీమిండియా సూపర్ ఓవర్ ఆడాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో తాను చివరి బంతిని చూడకుండా డ్రెస్సింగ్ రూమ్‌లోకి ప్యాడ్స్ కట్టుకోడానికి వెళ్లానని తెలిపాడు. దీంతో చివరి బంతిని దినేశ్ కార్తీక్ (డీకే) సిక్స్‌గా మలిచి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించిన ఆ బంతిని తాను ప్రత్యక్షంగా చూడలేకపోయానంటూ వాపోయాడు.



కామెంటరీ బాక్స్‌లో గవస్కర్ నాగినీ డాన్స్..

ఫైనల్లో బంగ్లాదేశ్ ఓటమి అనంతరం టీమిండియా వెటరన్ బ్యాట్స్‌మన్, కామెంటేటర్ సునీల్ గవాస్కర్ కామెంటరీ బాక్స్‌లో నాగినీ డాన్స్ చేశాడు. మ్యాచ్ 9 ఓవర్లో ఉండగా.. కామెంటరీ బాక్స్‌లో ఉన్న గవస్కర్.. రోహిత్ బ్యాటింగ్ ధాటిని చూసి ఆపుకోలేకపోయారు. తన కుర్చీ నుంచి అమాంతం లేచి నాగిని డాన్స్ చేశాడు. అది చూస్తూ మిగతా ఇద్దరు కామెంటేటర్లు తెగ నవ్వుకున్నారు. దీంతో సీనియర్ క్రికెటర్లు 'దిగ్గజ ఆటగాడు మర్యాద పూర్వకంగా వ్యవహ రించ లేదంటూ కొందరు మండిపడితే... అలా చేయటం సరికాదంటూ మరికొం దరు చెప్పుకొచ్చారు.



శ్రీలంక జెండాతో టీమిండియా

నిదహాస్ ట్రోఫీ ఫైనల్ విజయానంతరం శ్రీలంక జాతీయ పతాకంతో టీమిండియా సభ్యులు మైదానంలో కలియతిరిగారు. ఫైనల్లో బంగ్లాదేశ్‌పై భారతజట్టు విజయం సాధించిన అనంతరం టీమిండియా సభ్యులు ఇలా చేశారు. శ్రీలంకపై బంగ్లాదేశ్ అనూహ్య విజయం సాధించి ఫైనల్‌కు చేరగా... ఆ మ్యాచ్‌లో బంగ్లా ఆటగాళ్లు దురుసుగా ప్రవర్తించడంతో లంక అభిమానులు ఫైనల్లో భారత్‌కు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో టీమిండియా సారథి రోహిత్ శర్మ విజయానంతరం వారి మద్దతుకు ప్రతీకగా ఆ దేశ జెండాను ఊపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. దీంతో రోహిత్‌పై లంక అభిమానులు ప్రశంసల జల్లు కురిపిస్తూ... అభిమానులు రోహిత్‌కు ధన్యవాదాలు తెలిపారు. శ్రీలంక స్వాతంత్ర్య వేడుకల పురస్కరించుకొని ఈ ముక్కోణపు టోర్నీని నిర్వహించిన విషయం తెలిసిందే.



ఇండియన్‌వెల్స్ టెన్నిస్
విజేత డెల్‌పెట్రో
మహిళల టైటిల్ ఒసాకాకే...



కాలిఫోర్నియా : ఇండియన్‌వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విజేతగా డెల్‌పెట్రో అవతరించాడు. సోమవారం ప్రపంచ నెంబర్ వన్ రోజర్ ఫెదరర్‌తో తలపడిన డెల్‌పెట్రో మూడు సెట్ల హోరా హోరీ పోరులో గెలుపొందాడు. అర్జంటీనాకు చెందిన డెల్‌పెట్రో 6-4, 6-7(8-10), 7-6(7-2) సెట్ల పాటు పోరాడి స్విట్జర్లాండ్‌కు చెందిన టాప్‌సీడ్‌పై గెలుపొంది ఇండియన్‌వెల్స్ టోర్నీని చేజిక్కించుకున్నాడు. 11 ప్రయత్నాలలో ఫెదరర్‌తో తలపడిన డెల్‌పెట్రో (29) తొలిసారి గెలుపొందాడు. 2 గంటల 42 నిమిషాలపాటు జరిగిన ఈ హోరాహోరీ పోరులో సీనియర్ టెన్నిస్ ఆటగాడైన ఫెదరర్ డెల్‌పెట్రోకు తలవంచాల్సి వచ్చింది. నిర్ణయాత్మకమైన మూడోసెట్ టైబ్రేక్‌లో తొలిగానే పెట్రో 5 పాయింట్లను చేజిక్కించుకొని ఫెదరర్‌పై పైచేయి సాధించాడు. ఇక మహిళల సింగిల్స్ విభాగంలో అన్‌సీడెడ్ దక్షిణ కొరియాకు చెందిన ఒసాకా 6-3, 6-2 సెట్ల తేడాతో 20వ ర్యాంక్‌కు చెందిన కసట్కినాపై గెలుపొందింది.



ముగిసిన శీతాకాల పారా ఒలింపిక్స్

ప్యాంగ్‌చాంగ్ : దక్షిణకొరియాలో ప్యాంగ్‌చాంగ్‌లో మార్చి 9 నుండి 18 వరకు జరిగిన శీతాకాల పారా ఒలింపిక్స్ ముగిశాయి. ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ పోటీల్లో 49 దేశాల నుండి 569 అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 6 క్రీడాంశాల్లో 80 పోటీలు జరిగాయి. అమెరికా 13 బంగారు, 15 రజిత, 8 కాంస్య పతకాలతో ప్రథమస్థానంలో నిలవగా... న్యూట్రల్ పారా ఒలింపిక్స అథ్లేట్స్ 8 స్వర్ణ, 10 రజిత, 6 కాంస్య పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. ఆతిథ్య దక్షిణకొరియా 1 బంగారు, 2 కాంస్య పతకాలతో 16వ స్థానంలో నిలిచింది. 2022లో జరిగే శీతాకాల పారాఒలింపిక్స్ బీజింగ్ జరగనున్నాయి.

విండీస్‌కు తొలి విజయం
ప్రపంచకప్ అర్హతటోర్నీ సూపర్-6 మ్యాచ్

హరారే : ప్రపంచకప్ అర్హత టోర్నీ (సూపర్-6) రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 4 వికెట్ల తేడాతో జింబాబ్వేపై గెలుపొందింది. తొలిమ్యాచ్ ఆఫ్ఘనిస్తాన్ చేతిలో ఓడిన విండీస్ ఈ మ్యాచ్‌లో 289 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. సోమవారం టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 289 పరుగులు చేసింది. ఆ జట్టు వికెట్ కీపర్ టేలర్ అత్యధికంగా 138 పరుగులు చేశాడు. హోల్డర్‌కు 4, రోచ్‌కు 3, పాల్‌కు 2 వికెట్లు లభించాయి. 290 పరుగుల లక్ష్యాన్ని కేవలం 6 వికెట్లు మాత్రమే కోల్పోయి విండీస్ సాధించింది. లెవిస్ 64, హోప్ 76, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ శామ్యూల్స్ 86 పరుగులు చేశారు.

షమిపై విచారణ షురూ..



కోల్‌కత్తా : టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమిపై అతని భార్య హసీన్ పెట్టిన కేసు విచారణను కలకత్తా పోలీసులు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని షమి సొంత పట్టణం అమ్రోహకు వెళ్ళి కుటుంబసభ్యులను, బంధువులను విచారించారు. పోలీసులకు షమి కుటుంబ సభ్యులు పూర్తిగా సహకరించి పోలీసులు అడిగిన అనేక ప్రశ్నలకు సావధానంగా బదులిచ్చినట్లు తెలిసింది. మరోవైపు షమీని పోలీసులు, బీసీసీఐ అధికారులు ఆదివారం విచారించి మరికొన్ని విషయాలను తెలుసుకున్నారు. భారత క్రికెట్ నియంత్రణమండలి (బీసీసీఐ) అవినీతి నిరోధక విభాగం అధికారులు త్వరలో పూర్తిస్థాయి నివేదికను బీసీసీఐకి ఇవ్వనున్నారు. షమీ క్రికెట్ భవితవ్యం అధికారులు ఇచ్చే నివేదికపైనే ఆధారపడి ఉంది.

ఆరోపణలపై వెనక్కి తగ్గిన షమీ భార్య

టీమిండియా పేసర్ మహ్మద్ షమీపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన షమి భార్య వెనక్కి తగ్గింది. ఇటీవల బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ అధికారులు షమీ భార్య హసీన్ జహాన్‌ను పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన విచారణలో ఆమె తడబాటుకు లోనవుతూ, కొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉన్నట్లు తెలిసిందే. అనంతరం హసీన్ మీడియాతో మాట్లాడుతూ షమీ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడంటూ తాను ఆరోపించినట్లు వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని కొట్టిపారేసింది.

హోదా కోసం 23న కాగడాల ప్రదర్శన
విద్యార్థి, యువజన జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భగత్ సింగ్ స్ఫూర్తితో హోదాకు కదలాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. జెఎసి రాష్ట్ర కమిటీ సోమవారం విజయవాడలోని ఐవి ప్యాలెస్‌లో సమావేశమయింది. ఈ నెల 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి అని 'భగత్ సింగ్ స్ఫూర్తితో హోదాకు కదులుదాం' అనే నినాదంతో కాగడాల ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రాన్ని, విద్యార్థి, యువజనులను సంపూర్ణంగా మోసం చేసిందని విమర్శించింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని, ప్రత్యేక హెూదా లేదని పేర్కొంది. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, యువత దయనీయస్థితిలోకి వెళ్ళిందని ఆందోళన వ్యక్తం చేసింది. రైల్వేజోన్ కూడా ఇవ్వలేమని మరో పిడుగు వేసిందని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసాలపై తిరగబడడం, హెూదా సాధించడం లక్ష్యంగా యువత ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వై.రాము, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, వివిధ సంఘాల నగర నాయకులు ప్రవీణ్, మహేష్, సుమంత్, అప్సర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్మీ మేజర్ హర్కిరాత్ సింగ్ నేతృత్వంలోని 15 మంది సభ్యులతో కూడిన ఢిల్లీకి చెందిన నేషనల్ డిఫెన్స్ కళాశాల (ఎన్‌డిసి) ప్రతినిధి బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా అమరావతి సచివాలయాన్ని సోమవారం సందర్శించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్‌తో భేటీ కావాల్సి ఉండగా ఆయనకు మాతృ వియోగం కలగడం వల్ల ఢిల్లీలో ఉండటంతో ప్రభుత్వ పొలిటికల్ కార్యదర్శి ఎన్ శ్రీకాంత్‌తో భేటీ అయింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, నూతన రాజధాని ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను శ్రీకాంత్ వివరించారు. రాజధాని నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలను సిఆర్‌డిఎ ప్రత్యేక కమిషనర్ వి రామమోహన్‌రావు ప్రతినిధుల బృందానికి వివరించారు.

ప్యాకేజీకి అంగీకరించడం వల్లే అనర్థం



ప్రత్యేక హోదా కోరుతూ వైసీపీ కార్యకర్తల మానవహారం

- హోదా పోరాటం ఆగదు
- 2016లోనే ఎన్‌డిఎ నుంచి బయటకు వస్తే హోదా వచ్చేది
- గుంటూరు జిల్లా పాదయాత్రలో వైఎస్ జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీని అంగీకరించి చంద్రబాబు ఆనాడే రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ప్రతిపక్షనేత వైఎస్ జగన్ విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం తన పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఆయన చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను మండలంలోని పెద్దివారిపాలెం, కొమ్మూరు, పెదనందిపాడు మండలంలో సోమవారం నిర్వహించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకాలని కోరుతూ కొమ్మూరులో వైసిపి నిర్వహించిన మానవహారంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నాగులపాడు మీదుగా పెదనందిపాడుకు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించారు. అందరూ ప్రత్యేక హోదా కావాలని కోరితే కాదు ప్యాకేజీయే ముద్దు అంటూ స్పష్టతలేని ప్యాకేజీకి సిఎం అంగీకరించడం వల్లే రాష్ట్రానికి ఈ దుర్గతి ఏర్పడిందని మండిపడ్డారు. 2016 సెప్టెంబరు 8న ప్రత్యేక ప్యాకేజీ రూపంలో రూ.లక్షల కోట్లు నిధులు వచ్చేసినట్లు మభ్య పెట్టి ఢిల్లీలో కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీని సన్మానించి, అసెంబ్లీలో కేంద్రాన్ని అభినందిస్తూ తీర్మానం చేశారని గుర్తు చేశారు. అరుణ్‌జైట్లీ అదే ప్రకటనను మళ్లీ ఈ బడ్జెట్ సమావేశాల్లో చేయగానే కేంద్ర మంత్రుల చేత రాజీనామా చేయించారని, ఈ రాజీనామాలు 2016లో హోదాను తిరస్కరించిన సందర్భంలోనే చేస్తే బాగుండేదన్నారు. ఇప్పుడు నిధులు తేలేక, ప్రజలకు సమాధానం చెప్పలేక చంద్రబాబు రోజుకో డ్రామా వేస్తున్నారని, పూటకో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాకుమాను మండలంలో ప్రజలు పలు ముఖ్యమైన సమస్యలను లేవనెత్తారు. గుంటూరు ఛానల్ పర్చూరు వైపు పొడిగింపు, నల్లమడ డ్రెయిన్ ముంపు సమస్య, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 98 గ్రామాలకు గాను 80 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందని ప్రజలు జగన్ దృష్టికి తెచ్చారు.

ఒకవైపు తల్లి మరణం.. మరోవైపు టెన్త్ పరీక్ష

ప్రజాశక్తి- తెర్లాం (విజయనగరం జిల్లా)



తల్లి చనిపోయిన దు:ఖాన్ని దిగమింగుకుని పదో తరగతి పరీక్షలకు హాజరైంది ఓ వికలాంగ విద్యార్థిని..విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని పెరుమాళి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పదో తరగతి పరీక్షకు హాజరైంది. విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని పెరుమాళి గ్రామానికి చెందిన వికలాంగురాలు కుమరాపు ఉమామహేశ్వరి టెన్త్ పరీక్షలు రాస్తోంది. ఆమె తల్లి విజయలక్ష్మి (38) ఈ నెల 15న ఉపాధి పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే రాజాం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం ఇంటి వద్ద తన తల్లి మృతదేహం ఉండగా, ఉమామహేశ్వరి దు:ఖాన్ని దిగమింగుకొని మోడల్ స్కూల్లో పదో తరగతి ఇంగ్లీషు పరీక్ష రాసింది.

నెలకు 2 వేలు కనీస పింఛను
ఇపిఎఫ్ చందాదారుల కోసం పార్లమెంటరీ ప్యానల్ సిఫార్సు

న్యూఢిల్లీ : ఇపిఎఫ్ చందాదారులకు నెలకు రెండు వేల రూపాయల మొత్తాన్ని కనీస పింఛనుగా నిర్ణయించాలని పార్లమెంటరీ ప్యానల్ సిఫార్సు చేసింది. జీవన ప్రమాణాలను పరిగణలోకి తీసుకుంటే ప్రస్తుతమిస్తున్న వెయ్యి రూపాయల కనీస పింఛను నామమాత్రంగా ఉందని, ఈ మొత్తాన్ని 2 వేల రూపాయలకు పెంచాలని ప్యానల్ పేర్కొంది. ప్రస్తుతం ఇపిఎఫ్‌లో 60 లక్షల మంది పింఛనుదారులు ఉండగా, వారిలో 40 లక్షల మందికి రూ. 1500 కన్నా తక్కువ మొత్తాన్ని పింఛనుగా పొందుతున్నారు. మిగిలిన వారికి రూ. 2 వేల నుండి గరిష్టంగా రూ. 2,500 అందుతోంది. అదేవిధంగా వివిధ సామాజిక, ఇపిఎఫ్ పథకాల్లో యాజయాన్య వాటా లేకుండా సభ్యులుగా చేరే కార్మికుల కోసం ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కూడా పార్లమెంటరీ ప్యానల్ సిఫార్సు చేసింది.

తెలుగు వారి ఎదుగుదలలో ఆటు పోట్లు

- ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి
- ఉగాది వేడుకల్లో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉగాది పచ్చడిలో తీపి, పులుపులా తెలుగువారి ఎదుగుదలలో ఆటుపోట్లు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగు వారంతా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉగాది వేడుకల్లో చంద్రబాబునాయుడు తన సతీమణి భువనేశ్వరి, మనుమడు దేవాన్ష్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా తెలుగు జాతి ఎదిగేందుకు ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని, అందుకు ప్రజలు తనకు ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. తెలుగు వారు తమ భవిష్యత్తును ఆలోచించుకోడానికి పంచాంగ శ్రవణం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలోని కవులు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నామన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ఇతర దేశాల కన్నా మన కుటుంబ వ్యవస్థ ఆనందాన్నిస్తుందని అన్నారు. హస్త కళలను పరిరక్షించినందుకు మొదటి బహుమతిని ప్రసన్నకుమార్‌కు, రెండో బహుమతిని ఏటికొప్పాకు చెందిన చిన్నయ్యసూరికి, మూడో బహుమతిని బెంగళూరుకు చెందిన దివ్యం శర్మకు సిఎం అందజేశారు. ఈ సందర్భంగా 47 కళారత్న, 99 ఉగాది పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు భూమా అఖిలప్రియ, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని నాని, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ, జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, విజయవాడ నగర మేయర్ కోనేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోండి బాబు...

- నిరుపేద మహిళ కడుపులో 25 కేజీల కణితి
- వైద్య ఖర్చుల కోసం వేడుకోలు.. స్పందించిన కలెక్టర్



కడుపులో 25 కేజీల కణితితో మంచాన ఉన్న రామలక్ష్మి

ప్రజాశక్తి-పిఠాపురం (తూర్పుగోదావరి)

నిరుపేద కుటుంబంలో ఇల్లాలిని కడుపులో కణితి అతలాకుతలం చేసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యఖర్చులు భరించలేని ఆమె భర్త బాధితురాలు, తన కొడుకులతో సహా సోమవారం కాకినాడలోని కలెక్టరేట్‌కు వచ్చి తమను ఆదుకోవాలంటూ కలెక్టర్‌ను వేడుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం డ్రైవర్స్‌కాలనీకి చెందిన పత్తి కొండబాబుకు భార్య రామలక్ష్మి, కొడుకులు అర్జున్, ఉమామహేష్ ఉన్నారు. లారీక్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కొండబాబు భార్య రామలక్ష్మికి కడుపులో సుమారు 25 కేజీల కణితి ఏర్పడటంతో తీవ్ర అనారోగ్యం పాలై మంచం పట్టింది.రెండేళ్లుగా భార్య కడుపులో కణితి క్రమంగా పెరుగుతూ వచ్చింది. పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి ఒక కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ స్కానింగ్, ఇతర పరీక్షలు జరిపిన వైద్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని, అందుకు రూ.నాలుగున్నర లక్షల వరకూ ఖర్చవుతుందని చెప్పారు. భార్య పరిస్థితిని చూసి పలువురిని సహాయం కోసం అర్థించినా ఫలితం లేకపోయింది. స్థానిక ఎంఎల్ఎ వద్దకు వెళ్లి మొరపెట్టుకోగా సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష వచ్చేలా ఏర్పాట్లు చేశారు. చికిత్సకు సరిపడా సొమ్ము లేని నేపథ్యంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో సోమవారం కుటుంబమంతా జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రాను ఆశ్రయించారు. స్పందించిన ఆయన వైద్యం చేయించేందుకు ఒక ప్రయివేటు ఆసుపత్రితో మాట్లాడినట్లు భర్త కొండబాబు తెలిపారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68